



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 81 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 1 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 81 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 1 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# వెళ్లొస్తమమ్మా..

## మళ్లీ రెండేండ్లకు కలుద్దాం.. మేడారం నుంచి తిరుగు పయనమైన భక్తులు



- మమ్ముల్ని సల్లంగా సూడు తల్లీ
- చివరి ఘట్టానికి సమ్మక్క సారలమ్మ జాతర
- గద్దెల వద్ద గిరిజన పూజారుల ప్రత్యేక పూజలు
- డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లనడుమ అమ్మవార్ల వన ప్రవేశం
- నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన మహా జాతర
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు

**హైదరాబాద్ పెన్ పవర్:**మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా సాగిన మహా జాతర (జనవరి 31) ముగియనుంది. తల్లుల వనప్రవేశంతో వన జాతర పూర్తి కానుంది.
సాయంత్రం సమయంలో గద్దెలను పరిశుభ్రం చేసి, గిరిజన పూజారులు అమ్మవార్లకు సంప్రదాయ పూజలను నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 7 గంటల సమయంలో డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ దేవతల పనప్రవేశం కార్యక్రమం ఆరంభమవుతుంది. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ మహాఘట్టం జనవరి 28 నుంచి 31వరకు జరుగగా.. సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చారు.
జంపన్నవాగులో పుణ్య స్నానాలను ఆచరించి వన దేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకున్నారు. సమ్మక్క సారలమ్మలకు చీర, ఒడిబియ్యం, సారె పోసి దేవతలను మనసారా కొలుచుకున్నారు. సమ్మక్క ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునీందర్, సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్యలు పూజల అనంతరం పనప్రవేశం చేయిస్తారు. సమ్మక్కతల్లి చిలుకల గుట్టకు వెళ్లనుండగా సారలమ్మ కన్నెపల్లికి చేరుకోనున్నారు. అదేవిధంగా ఏటూరునాగారం మండలం కొండాయికి గోవిందరాజు, మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల కు పగిడిద్ద రాజును తిరిగి చేర్చనున్నారు. ఈ తంతుతో మహాజాతర ముగిస్తుం ది. అమ్మవార్ల దర్శనం అనంతరం మళ్లీ వస్తాం తల్లీ అంటూ భక్తులు ఇండ్లకు పయనమయ్యారు.

**బస్సుల కోసం గంటల తరబడి ఎదురుచూపులు**

జాతరలో చివరిరోజు మేడారంలోని వసదేవతలను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్ అమ్మవార్లకి మొక్కులను సమర్పించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులు వారికి అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. హైకోర్టు జడ్జిలు సృజన, రాణి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణంలో భక్తులు నానా అవస్థలు పడ్డారు. దర్శనం సాఫీగా జరిగినా, రిటర్న్ జర్నీ ఇబ్బందులు మాత్రం తప్పడం లేదని వాపోయారు. గంటల కొద్దీ బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.



## బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా మన అభ్యర్థులు ఉండాలి

- అమెరికా నుంచి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న ముఖ్యమంత్రి
- అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచన

మిగతా 2లో

**హైదరాబాద్ పెన్ పవర్:**బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది.

## మోదీ ప్రభుత్వంతో సయోధ్య కోరుకుంటున్నాం

- బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి
- బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి నిధులు వచ్చేలా కృషి చేయాలని సూచన
- బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలన్న పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ పెన్ పవర్:**కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సయోధ్య కోరుకుంటోందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు

మిగతా 2లో



## గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

- వ్యోమగాముల భద్రత దృష్ట్యా మానవరహిత రాకెట్ల ప్రయోగం
- మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడి
- రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామన్న ఇస్రో చైర్మన్

తొలి మానవరహిత అంతరిక్ష ప్రయాణ మిషన్ 'గగన్‌యాన్'కు సిద్ధమవుతున్నామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ నారాయణన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన

మిగతా 2లో



## భారత్ పై ట్రంప్ 50 శాతం సుంకాలు...

### అమెరికా రిటైర్డ్ అధికారి కీలక వ్యాఖ్యలు

- సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశం కూడా ఇతర దేశాలతో చర్చలు జరపబోదని వ్యాఖ్య
- 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖత్వపు మనస్తత్వానికి నిదర్శనమని ఆగ్రహం
- భారత్, రష్యా దశాబ్దాలుగా మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని వ్యాఖ్య

మిగతా 2లో

## బలూచిస్తాన్‌లో రెచ్చిపోయిన వేర్పాటువాదులు

### 10 మంది సైనికులతో సహా 37 మంది ఉగ్రవాదులు మృతి..



**పెన్ పవర్ డెస్క్:**పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్లో శనివారం వేర్పాటు వాదులు ఒక్కసారిగా రెచ్చిపోయారు. పలు జిల్లాల్లో ప్లాన్ ప్రకారం జరిపిన ఈ దాడుల్లో 10 మంది పాకిస్థాన్ భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, ఎదురుకాల్పుల్లో 37 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.ఏం జరిగిందంటే...బలూచ్ లిబరేషన్ ఆర్మీ (దీూూ) అనే నిషేధిత సంస్థ ఈ దాడులు జరిపింది. దీనిని 'ఆపరేషన్ హెరోఫ్' లో రెండో దశగా

మిగతా 2లో



## రేపో మాపో జైలుకు కేసీఆర్..

- ఆయనేమైనా ఫ్రీడం ఫైటరా?
- విచారణకు సహకరించాల్సిందే
- గులాబీ పార్టీ మునిగిపోతున్న నౌక
- సిట్‌ఎంక్వైరీ తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్‌ఒక్కటవుతుంది
- బీజేపీ స్టేట్‌చీఫ్ రామ చందర్‌రావు

మిగతా 2లో

## ఏప్రిల్ 30 నాటికి అయోధ్య రామాలయం అన్ని పనులు పూర్తి



- ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1,900 కోట్లుగా అంచనా వేసినట్లు వెల్లడి
- రూ.1,600 కోట్లు ఇప్పటికే చెల్లించామన్న నిర్మాణ కమిటీ చైర్మన్
- ఏప్రిల్ 30 నాటికి పేపర్ వర్క్ బిల్లు చెల్లింపులు పూర్తవుతాయన్న చైర్మన్

**పెన్ పవర్ డెస్క్:**అయోధ్యలోని రామాలయానికి సంబంధించిన అన్ని నిర్మాణ పనులు ఏప్రిల్ 30 నాటికి పూర్తవుతాయని, ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం దాదాపు రూ.1,900 కోట్లుగా అంచనా వేసినట్టు రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి ఎల్ అండ్ టీ, టీసీఎస్ కంపెనీలు మూడేళ్ల కాలానికి ఒప్పందం చేసుకున్నాయని ఆయన వెల్లడించారు.రామాలయంలో మిగిలిన పనులు వేగంగా సాగుతున్నాయని, మరో మూడు నెలల్లో

మిగతా 2లో

## ఇంటి గోడపై నోటీసు అతికించడమా? జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ

- విచారణకు హాజరు కావడానికి చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదన్న కేసీఆర్
- నోటీసు అంటించడం ద్వారా గౌరవానికి భంగం కలిగించారని పేర్కొన్న కేసీఆర్
- బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానన్న కేసీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:**జూబ్లీహిల్స్ ఏసీపీకి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లేఖ రాశారు. విచారణకు హాజరయ్యేందుకు తనకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. నంది నగర్‌లోని తన ఇంటికి నోటీసు అంటించడం ద్వారా తన గౌరవానికి భంగం కలిగించారని పేర్కొన్నారు.బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానని అన్నారు. ఫిబ్రవరి 1 మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధమని తెలిపారు. నందినగర్‌లో తన నివాసం గోడపై నోటీసు అతికించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నోటీసులు అతికించడం రాజ్యాంగ

మిగతా 2లో




## ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం..

## తొలి మహిళగా చరిత్ర

- ముంబైలోని లోక్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్
- ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే సమక్షంలో ప్రమాణం
- సునేత్రాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### అనంత మహిమాన్వితం మహామాఘి

నక్షత్ర మండల మార్గాన్ని అనుసరించి చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతూ ఉంటాడు. ఆ మార్గంలో లెక్కలేనన్ని నక్షత్రాలు ఉన్నాయి. సదరు మార్గాన్ని మన పూర్వీకులు ఇరవై ఏడు భాగాలుగా విభజించారు. అవి దాదాపు సమా నంగా ఉంటాయి. ఒక్కొక్క భాగానికి ఒక్కొక్క పేరు పెట్టారు. ఆ భాగంలో ఎక్కువ కాంతి వంతంగా ఉండే నక్షత్రాన్ని బట్టి ఆ భాగానికి పేరు పెట్టారు. ఇరవై ఏడు నక్షత్రాలలో మఘ ఒకటి. అందులో ఐదు ప్రముఖ నక్షత్రాలు పల్లకి ఆకా రంలో చెదరి ఉంటాయి. మాసానికి ఒక సారి చంద్రుడు ఆ నక్షత్రంలో ప్రవేశిస్తాడు. కాని ఏడాదిలో ఒకేసారి చంద్రుడు పదహారు కళలతో ఒప్పుతూ మఘ నక్షత్రంలో ప్రవేశిస్తాడు. అదే మాఘ పూర్ణిమ. దానినే "మహామాఘి" అంటారు. చంద్రుడు కాంతి నిస్తంద్రుడై ప్రకాశించే దినాలు ఏడాదికి పన్నెండు ఉంటాయి. అవే పద హారు కళలతో ఒప్పుతూ చంద్రుడుండే రోజులు. పన్నెండు పౌర్ణమిలలో ఒక్కొక్క నక్షత్రంతో చంద్రుడు కూడి ఉంటాడు. ఆయా నక్షత్రాలను బట్టి ఆపౌర్ణమిని పిలుస్తారు. మాఘ నక్షత్ర యుక్త పూర్ణిమను మాఘీయని, అలాగే ఫాల్గుణీ, చైత్రీ, వైశాఖీ, జ్యేష్ఠీ, ఆషాఢీ, శ్రావణీ, భాద్రపదీ, ఆశ్వ యుజీ, కార్తీకీ, మార్గశీర్షీ అనే పేర్లతో పిలువబడేవి హిందువులకు పన్నెండు పర్వాలు. భోగ్య అర్హమైన శుక్లపక్షం వెన్నెల ఊరికే పోకుండా మన పెద్దలు శుక్ల పక్షంలోనే పండువలు అధికంగా ఏర్పరిచారు. దశావతారాల్లో ఒకటైన కూర్మావతారం, మహా భక్తుడైన హన్మంతుడు, మానవ ప్రపంచంలో మహనీయుడైన గౌతమ బుద్ధుడు పౌర్ణమిల యందే జన్మించారు. ఇక మాఘ పూర్ణమి విషయానికి వస్తే...మఘ నక్షత్రంలో చంద్రుడు పదహారు కళలతో ప్రకాశించే దినమే మాఘ పౌర్ణమి. దీనిని మహామాఘి అని పంచాంగ కర్తలు అంటారు. పార్వతీ దేవి ఈదినముననే ప్రాదుర్భవించినదని పురాణాధారం. దక్షప్రజాపతికి దక్షిణావర్తపు శంభాకారపు పద్మ ఆకారాన్ని ధరించిన సతీదేవి హస్తస్పర్శతో కన్యగా మారిన రోజే మాఘ పౌర్ణిమ. కావేరీ ఉత్తరాన స్వామిమలపై వెలసిన సుబ్రహ్మణ్య స్వామి, తెలియని విషయాన్ని విద్యా వేత్తయైన తన తండ్రికి చెప్పిన దినమైనందున అక్కడ ఈరోజు ఉత్సవం జరుగుతుంది. మాహామాఘి.నాడే జగద్గురువు ఆదిశంకరులు పంచాయతన పూజావిధిని ప్రారంభించారంటారు. మహా మాఘి అనబడే ఈ పర్వం పేరిటనే కుంభకోణంలో దాదాపు ఇరవై ఎకరాల వైశాల్యం కలిగిన ఒక కోనేరు ఉంది. తంజావూరు తెలుగు నాయక రాజులు ఆ కోనేటి చుట్టూ రాతి పావంచాలు, గట్టు చుట్టూ నలువైపులా పదహారు దేవళాలు కట్టించారు. అందులో విశ్వనాథ దేవాలయం ఒకటి. అది కోనేరు ఉత్తరాన ఉంది. ఆ ఆలయంలో శిలలపై గల శిల్పచిత్రాకృతులు ఉండగా, మాఘ పూర్ణిమ నాడు నవ నదులకు గొప్ప అర్చన జరు గుతుంది. మాఘపూర్ణిమ నాడు... కుంభకోణం లోని కోనేరులో గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, కావేరి, కృష్ణ కుమారి, పయోష్ణి అనే నవ నదులు ప్రవేశిస్తాయని, అందుకే పౌర్ణిమ నాడు సదరు కోనేట్లో తైర్థికులు స్నానాలాచరించడం పరిపాటి. మఘ నక్షత్రాధిపతియైన బృహ స్పతిని ఈనాడు పూజించాలని చెపుతారు. మాఘ పౌర్ణమి ద్వాపర యుగాది యని కొన్ని గ్రంథాలు చెపుతున్నాయి. ఈ పర్వదినం నాడు అరుణోదయ స్నానం, తిలపాత్ర కంచుక కంబళాది దానాలు చేయాలని, తిలహోమం, తిలదానం, తిలభక్షణం చేయాలని శాస్త్ర వచనం. అన్ని పౌర్ణమిల్లో కల్లా మహా మాఘి చాలా విశిష్టమైనది. మాఘ మాసంలో దేవతలు తమ సర్వ శక్తులు, తేజస్సులను జలాల్లో ఉంచుతారు. అందువల్ల మాఘ స్నానం చాలా గొప్పది. నది దగ్గరలో లేని వారు కనీసం చెరువులో గానీ, కొలనులోగానీ, లేక బావి దగ్గర గానీ స్నానం ఆచరించాలి. మాఘ స్నానం ప్రవాహ జలంలో చేస్తే అధిక ఫలితం. స్నానానంతరం సమస్త జీవరాశికి ఆధారమైన సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించాలి. వైష్ణవ, శివాలయానికి గానీ వెళ్లి దర్శనం చేసుకోవాలి. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించడమే కాకుండా శక్తిమేరకు దాన ధర్మాలు చేయాలి. ఈ రోజున గొడుగు, నువ్వులు దానం చేస్తే విశేష ఫలం లభిస్తుంది. దీని వల్ల జన్మజన్మలుగా వెంటాడుతోన్న పాపాలు, దోషాలు నశించి, అశ్వమేథ యాగం చేసినంత ఫలితం దక్కుతుందని సాక్షాత్తు శ్రీ కృష్ణుడే ధర్మరాజులు వివరించినట్లు పురాణ కథనం. మాఘ పౌర్ణమి రోజున చేసే స్నానం, పూజలు, దానాలు వల్ల వ్యాధులు, చికాకుల నుంచి విముక్తి కలుగుతుంది. ఆ పుణ్య ఫలాల విశేషం కారణంగా ఉన్నత జీవితం లభిస్తుంది. మరణం అనంతరం కోరుకునే శాశ్వత స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. "గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి, నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధింకురు" అనే శ్లోకం పఠిస్తూ స్నానం ఆచరించాలి.

# ఇంటి గోడపై నోటీసు అతికించడమా?

# జూబ్లీహిల్స్ ఏసీపీకి కేసీఆర్ లేఖ

- మొదటి పేజి తరువాయి

విరుద్ధమని లేఖలో పేర్కొన్నారు. 65 ఏళ్లు దాటిన వారిని వారి నివాసం వద్దనే విచారించాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు.తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లిలో ఉందని, అక్కడే విచారించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని, నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్‌లోని చిరునామాకు, సెక్షన్ 160 నోటీసులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చోట విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం చెబుతోందని అన్నారు.

ఇక, హరీశ్ రావుకు నోటీసుల విషయంలో పోలీసులు రెండు నాల్కల ధోరణి పాటిస్తున్నారని ఆ లేఖలో విమర్శించారు. పోలీసుల తీరు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని కేసీఆర్ అన్నారు. నంది నగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని కేసీఆర్ స్పష్టం చేశారు. అక్రమ పద్ధతిలో ఇచ్చిన నోటీసులను తాను విస్మరించవచ్చుని, కానీ బాధ్యతాయుత పౌరుడిగా విచారణకు హాజరవుతానని అన్నారు.భవిష్యత్తులో నోటీసులన్నింటినీ ఎర్రవల్లిలోని తన చిరునామాకే పంపించాలని పోలీసులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని 'వీడీ మూర్తి' కేసు తీర్పును లేఖలో కేసీఆర్ ప్రస్తావించారు. పోలీసుల చర్యలు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా మన అభ్యర్థులు ఉండాలి

- మొదటి పేజి తరువాయి

ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారు.ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ

ఇన్‌ఛార్జ్‌లు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## రేపో మాపో జైలుకు కేసీఆర్..

హైదరాబాద్: ఫోన్‌ట్యాపింగ్‌కేసులో మాజీ సీఎం కేసీఆర్ రేపో మాపో జైలుకు వెళ్తారని బీజేపీ స్టేట్‌చీఫ్ రామచందర్‌రావు అన్నారు. నాంపల్లిలోని పార్టీ ఆఫీసులో రామచందర్‌రావు మాట్లాడుతూ 'కేసీఆర్‌ఏమైనా ఫ్రీడం ఫైటరా? సిట్‌విచారణకు ఆయన సహకరించాలి. ఎంక్వైరీ తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్‌ఒక్కటవుతుంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో బీజేపీ పోటీ చేస్తుంది. తెలంగాణలో పార్టీకి ఆదరణ పెరుగుతోంది. బీఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకం లేదు. గులాబీ పార్టీ ఒక మునిగిపోతున్న నౌకగా మారింది. ఎన్నికల ముందు తమ మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా అమలు చేస్తామని కాంగ్రెస్ పెద్దగా హామీలు ఇచ్చింది. కానీ ఈ యూటర్న్‌తో పేదలు, మధ్యతరగతి ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసింది. జనం ఇకపై తప్పుడు హామీలు, నకిలీ గ్యారంటీలకు మోసపోరు. మంచి పాలన, అభివృద్ధి, బాధ్యతాయుత పాలన కోసం తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నరు' అని అన్నారు.

## మోదీ ప్రభుత్వంతో సయోధ్య కోరుకుంటున్నాం

- మొదటి పేజి తరువాయి

కేంద్రం నిధులు కేటాయించేలా రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమేం కావాలో ఎప్పటి నుంచో అడుగుతున్నామని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతున్నామని అన్నారు. తెలంగాణ పట్ల ప్రధాని నరేంద్ర మోదీ చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. గతంలో తెలంగాణ పుట్టుకనే ఆయన అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్రం నుంచి ఏమీ అడగబోమని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారం ప్రదర్శించిందని, తాము మాత్రం సఖ్యత కోరుకుంటున్నామని అన్నారు. బడ్జెట్‌లో తమ ప్రతిపాదనలకు కేంద్రం అంగీకరించాల్సిందేనని స్పష్టం చేశారు. భారత ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలపాలని అన్నారు.

## భారత్ పై ట్రంప్ 50 శాతం సుంకాలు...

భారతదేశం తన సొంత ప్రయోజనాలను కాదని, అమెరికా చెప్పే ప్రతిదానికి తలాడించదని యూఎస్ రిటైర్డ్ ఆర్మీ కల్నల్, రక్షణ రంగ నిపుణుడు డగ్లస్ మాక్‌గ్రెగర్ అన్నారు. సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశం కూడా ఇతర దేశాలతో చర్చలు జరపబోదని అన్నారు. రష్యాతో వ్యాపారం చేస్తోందన్న కారణంతో భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు.కొంతకాలంగా అమెరికా, భారత్ మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలపై డగ్లస్ స్పందిస్తూ, అమెరికా ఎప్పుడూ కూడా ప్రపంచ దేశాలు తమకు అనుకూలంగా ఉండాలని కోరుకుంటుందని, లేదంటే వ్యతిరేకంగా ఉన్నాయని భావిస్తుందని అన్నారు. అమెరికా చెప్పే ప్రతి అంశంతో లేదా అమెరికా చేసే ప్రతి దానితో భారత్ ఎప్పుడూ ఏకీభవించాలని చూడవద్దని అన్నారు.దశాబ్దాలుగా భారత్, రష్యా మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని, ఇప్పుడు వాటిని కలిసి వ్యాపారం చేయవద్దంటే అవి అమెరికాను వ్యతిరేకించే అవకాశం ఉందని అన్నారు. "మీరు రష్యాతో వ్యాపారం చేస్తే కనుక మేం మీకు వ్యతిరేకం" అనేది మూర్ఖత్వమని అన్నారు. మలేసియా వంటి దేశాలు అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం తమ ముఖ్య విధానాల విషయంలో కూడా రాజీపడాల్సి వచ్చిందని అన్నారు. ప్రపంచ దేశాలపై బెదిరింపులకు పాల్పడుతూ ఇష్టారీతిన సుంకాలు విధిస్తే అది అమెరికాకే నష్టమని అన్నారు.

## ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం.. తొలి మహిళగా చరిత్ర

రాజ్యసభ ఎంపీ సునేత్రా పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో ఆ పదవి వరించిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ముంబైలోని లోక్‌భవన్‌లో, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సమక్షంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించారు.

సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం లోక్ భవన్‌లో 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ నినాదాలు ప్రతిధ్వనించాయి. సునేత్రా పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. అజిత్ పవార్ దార్శనికతను సునేత్రా నెరవేరుస్తారని ఆయన ఆకాంక్షించారు.

"మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన, ఈ బాధ్యతను చేపట్టిన మొదటి మహిళ సునేత్రా పవార్ జీకి శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆమె అవిశ్రాంతంగా పనిచేస్తారని మరియు దివంగత అజిత్‌దాదా పవార్ దార్శనికతను నెరవేరుస్తారని నేను విశ్వసిస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు.

కాగా, ఇటీవల బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. దీనితో ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆయన భార్య సునేత్రా పవార్‌ను ఎన్సీపీ వర్గాలు ఎన్నుకున్నాయి. దీంతో ఆమె ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## ఏప్రిల్ 30 నాటికి అయోధ్య రామాలయం అన్ని పనులు పూరి

- మొదటి పేజి తరువాయి

అవి పూర్తవుతాయని తెలిపారు. రూ. 1,900 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ. 1,600 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఏప్రిల్ 30 నాటికి పేపర్ వర్క్, బిల్లు చెల్లింపులు కూడా పూర్తవుతాయని అన్నారు. ఆ తర్వాత ఆలయం శ్రీరామ జన్మభూమి ఆలయ ట్రస్ట్ పరిధిలోకి వస్తుందని వెల్లడించారు.

## బలూచిస్తాన్‌లో రెచ్చిపోయిన వేర్పాటువాదులు

- మొదటి పేజి తరువాయి

చెప్పుకుంటున్నారు. ఉగ్రవాదులు ఒకే సమయంలో వేర్వేరు నగరాల్లో ఉన్న సైనిక శిబిరాలు, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేశారు. సోషల్ మీడియాలో వచ్చిన వీడియోల ప్రకారం.. ఉగ్రవాదులు జనావాసాల్లోకి చొరబడి వాహనాలకు నిప్పంటించారు. రైఫిళ్లు పట్టుకుని రోడ్ల మీద తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. క్వెట్టా, గ్వాదర్, నుష్కి వంటి నగరాల్లో కాల్పులు, పేలుళ్లు జరిపారు.

దింతో ప్రాంతీయ రాజధాని అయిన క్వెట్టాలో పరిస్థితి చాలా దారుణంగా మారింది. బాంబు పేలుళ్లు, కాల్పులు ఆగకపోవడంతో అధికారులు ఆసుపత్రుల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు. సరియాబ్ రోడ్డులో ఓ పోలీసు వాహనంపై దాడి చేసి ఇద్దరు అధికారులను చంపడమే కాకుండా, వాహనాన్ని తగలబెట్టారు. సైన్యం, ఇంటెలిజెన్స్ ఆఫీసులపై ఆత్మాహుతి దాడులు చేశామని, కొన్ని చోట్ల సైనిక శిబిరాల్లోకి కూడా చొరబడ్డామని దీూా ప్రకటించుకుంది. పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఈ ఘటనలను ధృవీకరించారు. ఉగ్రవాదుల ఏరివేత కొనసాగుతోందని, ఇప్పటికే 37 మందిని మట్టుబెట్టామని తెలిపారు. శాంతి భద్రతలను కాపాడేందుకు భద్రతా దళాలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది.

## ఇ-సైకిళ్లపై భారీ రాయితీ..

### గిన్నిస్ రికార్డుతో ఏపీ సర్కార్ కొత్త చరిత్ర

ఏపీలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు పర్యావరణ హిత ఇ-సైకిళ్లను భారీ రాయితీపై అందిస్తోంది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా కుప్పంలో 24 గంటల వ్యవధిలో 5,555 ఇ-సైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. పర్యావరణ హితమైన కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రూ. 10 వేల సబ్సిడీ.. రూ. 25 వేలకే సైకిల్ ఇ-మోటరాడ్స్ అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, రూ. 35,000 విలువైన ఒక్కో ఇ-సైకిల్‌పై ప్రభుత్వం రూ. 10,000 రాయితీ కల్పిస్తోంది. దీంతో ప్రజలు కేవలం రూ. 25,000 చెల్లించి ఈ సైకిల్‌ను సొంతం చేసుకోవచ్చు. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే ఈ సైకిల్ 40 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. విశేషమేమిటంటే ఈ సైకిళ్లను కుప్పంలోనే ఇ-మోటరాడ్ సంస్థ అసెంబుల్ చేస్తోంది.సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈ సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తూంసీలోని ప్రజావేదిక వద్దకు ఆయన దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఇ-సైకిల్‌పై ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం గిన్నిస్ రికార్డు సాధించినందుకు గాను చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధృవీకరణ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, కుప్పం ఒక కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు. "ఎన్నికల్లో సైకిల్‌కు ఓటేశారు, అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించాం" అని పేర్కొన్నారు. ఇ-సైకిళ్లకు పైసా ఖర్చు లేకుండా ఇంట్లోనే ఛార్జింగ్ చేసుకోవచ్చని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.

## గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

- మొదటి పేజి తరువాయి

8 వేలకు పైగా ప్రయోగాలు సఫలమయ్యాయని తెలిపారు. వ్యోమగాముల భద్రత దృష్ట్యా మూడు మానవ రహిత రాకెట్‌లను ప్రయోగిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని వెల్లడించారు.రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామని, గగన్‌యాన్ మిషన్ విజయవంతం చేయడమే అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. రెండో మానవరహిత రాకెట్ ప్రయోగం ఈ ఏడాది చివరలో ఉంటుందని తెలిపారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ చేపట్టగా, ఈ ప్రాజెక్టు తుది దశకు చేరిందని అన్నారు.మానవ సహిత స్పేస్ మిషన్‌లో భాగంగా మార్చిలో వ్యోమమిత్ర రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. కాగా, 2027లో చేపట్టనున్న గగన్‌యాన్ మిషన్ కోసం వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా ఎంపికైన విషయం తెలిసిందే.

# నేడు కేసీఆర్ సిట్ విచారణ...
# రాష్ట్రవ్యాప్త నిరసనలకు కేటీఆర్ పిలుపు



హైదరాబాద్ పెన్ పవర్:మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విచారణ పేరుతో ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని బీఆర్ఎస నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. ఆదివారం నాడు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత ఆందోళనలు చేపట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు.రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ప్రభుత్వం దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని, ప్రతి మున్సిపల్, నియోజకవర్గ కేంద్రాల్లో బైక్ ర్యాలీలు, నల్ల జెండాలతో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు శాంతియుతంగా చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఆందోళనల్లో పాల్గొనాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. నిరసనలు శాంతియుతంగా చేపట్టాలని, పోలీసులతో ఘర్షణలకు దిగవద్దని సూచించారు.కాగా, కేసీఆర్ రేపు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు హాజరు కానున్నారు. న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం ఆయన విచారణకు హాజరు కావాలని నిర్ణయించారు. నందినగర్‌లోని నివాసంలో సిట్ ఆయనను విచారించనుంది.

## పెన్ పవర్ తెలంగాణ రౌండప్

- కబ్జా ప్రయత్నానికి కళ్ళెం..! ఏడీ సర్వే నివేదికతో హైడ్రాకు స్థానికుల ఫిర్యాదు..
- హైడ్రా జోక్యంతో కబ్జాను కూల్చేసి ఫెన్సింగ్ పెట్టినప్పటికీ..! పార్క్ అభివృద్ధి శూన్యం..
- లైట్లు, వాకింగ్ ట్రాక్, బెంచీలు కూడా లేవు, కనీస వసతులపై ప్రశ్నిస్తున్న ప్రజలు..
- అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా శ్రమదానం తో పార్క్ శుభ్రం చేసిన స్థానికులు..
- "పార్క్ కాపాడటమే కాదు.. ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని డిమాండ్..

పార్కులు ప్రజల ఊపిరి.. వాటిని కాపాడటమే కాదు, అభివృద్ధి చేయడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలంటూ ప్రజలు అభిప్రాయపడ్డారు.. అధికారులు వెంటనే స్పందించి, హైడ్రా కాపాడిన పార్క్‌లో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు..




పార్కులో శ్రమదానం చేస్తున్న బృందావన్ కాలనీ వాసులు..

### అధికారుల అలసత్వంపై.. శ్రమదానంతో నిరసన..

"హైడ్రా కాపాడింది కానీ..! అధికారులు అభివృద్ధి చేయడం మరిచారు. పార్క్‌ను రక్షించడం ఒక బాధ్యత అయితే, ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడం మరొక బాధ్యత. ఈ రెండింటిలో ప్రభుత్వం రెండో బాధ్యతను పూర్తిగా విస్మరించిందని, కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు.. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా, ప్రభుత్వాన్ని కదిలించేందుకు బృందావన్ కాలనీ వాసులు స్వయంగా పార్క్ అభివృద్ధికి శ్రమదానానికి దిగారు. పార్క్‌ను శుభ్రపరచడం, మొక్కలు నాటడం, చుట్టుపక్కల చెత్త తొలగించడం వంటి పనులు చేపట్టి తమ నిరసనను వినూత్నంగా వ్యక్తం చేశారు. ఇది ఒక నిరసన మాత్రమే కాదు.. ప్రజల సహనానికి, పరిపాలన వైఫల్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చంద్రశేఖర్‌తో పాటు ఆకుల సతీష్, మురళీధర్, ఐఎస్వీ సత్యనారాయణ, ఎస్.కామేశ్వర రావు, కొండల్ రావు, జీవన్, రంజన్, శ్రీనివాస్ బమ్మిడి, సతీష్ కట్ట, ఎన్. రవికిరణ్, వేణుగోపాల్ రెడ్డి, వి.తిరుపతి, వి.సాగర్, టి.చంద్రశేఖర్, ఎన్.సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# హైడ్రా కాపాడిన పార్క్..!
# అభివృద్ధిలో అధికారుల 'నిర్లక్ష్య'..!

### మౌలిక వసతులు కల్పించాలని శ్రమదానంతో కాలనీవాసుల నిరసన..!




నిజాంపేట్ పార్క్ స్థలంలో శ్రమదానంతో నిరసన..

నిజాంపేట్ బృందావన్ కాలనీలో ప్రజల కోసం కేటాయించిన 20 గుంటల పార్క్ స్థలం కబ్జాకు గురికాగా, కాలనీవాసుల పోరాటంతో హైడ్రా జోక్యం చేసుకొని పార్క్ స్థలాన్ని కాపాడింది.. స్థానిక జీహెచ్ఎంసి కాపాడాల్సిన పార్కుస్థలం, హైడ్రా జోక్యంతో కాపాడటంలో స్పష్టమవుతుంది.. స్థానిక అధికారుల చేతివాటానికి ప్రత్యేక నిదర్శనంగా చెప్పవచ్చు.. ఈ పార్కుస్థలం కాపాడటంలో స్థానిక మాజీ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ కృషి అభినందనీయం.. సతీష్ ఆద్వర్యంలో దాదాపు మూడేళ్ళపాటు అలుపెరుగని పోరాటం చేశాడని అనడంలో అతిశయోక్తి కాదు.. ఏడీ సర్వే నిర్వహించిన రిపోర్ట్ ఆధారంగా ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు పార్క్ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేశారు.. కానీ అక్కడితో అధికారుల బాధ్యత ముగిసినట్టే అన్నట్లు, పార్క్ అభివృద్ధిలో సంబంధిత జీహెచ్ఎంసి అధికారులు వ్యవహరించిన తీరుకు, స్థానికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు..

### నాడు కబ్జాకు వదిలేశారు..!నేడు అభివృద్ధికి నిర్లక్ష్యం..!

కబ్జాదారుల చెర నుంచి, పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినప్పటికీ..! అభివృద్ధిలో భాగంగా, మౌలిక వసతులు కల్పించడంలో నిజాంపేట్ జీహెచ్ఎంసి సర్కిల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. పార్కుల అభివృద్ధి అనేది పూర్తిగా అధికారుల చేతుల్లో ఉన్నప్పటికీ..! ఈ విషయంలో ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పార్క్‌లో వాకింగ్ ట్రాక్, లైట్లు, బెంచీలు, పిల్లల ఆట సామగ్రి, మొక్కలు వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.. ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

**దుండిగల్, పెన్ పవర్, జనవరి 31:** నిజాంపేట్ బృందావన్ కాలనీలో 20 గుంటల పార్క్ స్థలాన్ని, కబ్జా నుంచి హైడ్రా కాపాడినా..!అభివృద్ధి- మౌలిక వసతుల కల్పనలో అధికారులు చేతులెత్తేశారు.. పలుమార్లు వినతులు సమర్పించినా..! స్పందించని నిజాంపేట్ జీహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్య వైఖరిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. శనివారం కాలనీ వాసులు శ్రమదానంతోనే నిరసనకు దిగారు..

## సాంబార్ నీళ్లు.... ఉడకని అన్నం
### అర్ధాకలి తో కడుపు నింపుకుంటున్న విద్యార్థులు

-5 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి



# డబుల్ బెడ్ రూం ఇండ్ల పనులు..
# వేగవంతం చేయాలి..!

### గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ ఐఏఎస్..

- త్వరలో 4000 ఇండ్లను మౌలిక వసతులతో లబ్ధిదారులకు కేటాయింపు..
- గాగిల్లాపూర్ కాలనీకి అప్రోచ్ రోడ్ తక్షణమే ప్రభుత్వ భూములకు ప్రహారీ గోడలు..!
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి పర్యటన..
- నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 4000 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మాణం..
- రూ.300 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణాలు చేపడుతున్న ప్రభుత్వం..
- బౌరంపేటలో 15 బ్లాకులు-1620 ఇండ్లు ఉన్నట్లు స్పష్టీకరణ..
- గాగిల్లాపూర్, దుండిగల్‌లో పనుల పురోగతిపై వి.పి.గౌతమ్ సమీక్ష..
- ప్రభుత్వ భూములు కబ్జాలకి గురి కాకుండా ప్రహారీ గోడలు నిర్మించాలని ఆదేశాలు..

-4 లో

# ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- కరీంనగర్ సీపీపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్న కౌశిక్ రెడ్డి
- ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్
- లేదంటే ఐపీఎస్ అసోసియేషన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- క్షమాపణ చెప్పకుంటే ప్రివిలేజ్ మోషన్ పెడతానని హెచ్చరిక



హైదరాబాద్ పెన్ పవర్:హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. కరీంనగర్ సీపీ మత మార్పిడులకు పాల్పడుతున్నారని తాను వ్యాఖ్యానించినట్లు ఐపీఎస్ అసోసియేషన్ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ ఆరోపణలను నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన సవాల్ విసిరారు.

ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. "మత మార్పిడి చేస్తున్నట్టు కరీంనగర్ సీపీని నేను అన్నట్లు నిరూపించాలి. ఆ మాట నేను అనలేదు. తెలంగాణ ఐపీఎస్ అసోసియేషన్ చేసిన ఆరోపణలలో వాస్తవం లేదు" అని స్పష్టం చేశారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించడంలో విఫలమైతే ఐపీఎస్ అసోసియేషన్ నాయకులు తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఒకవేళ వారు క్షమాపణ చెప్పని పక్షంలో, వారిపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం (ప్రివిలేజ్ మోషన్) ప్రవేశపెడతానని కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. వీణవంక మినీ సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డికి, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం జరగడం తెలిసిందే. దాంతో కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేయగా, పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

- త్వరలో 4000 ఇండ్లను మౌలిక వసతులతో లబ్ధిదారులకు కేటాయింపు..
- గాగిల్లాపూర్ కాలనీకి అప్రోచ్ రోడ్ తక్షణమే ప్రభుత్వ భూములకు ప్రహరీ గోడలు..!
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి పర్యటన..
- నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 4000 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మాణం..
- రూ.300 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణాలు చేపడుతున్న ప్రభుత్వం..
- బౌరంపేటలో 15 బ్లాకులు-1620 ఇండ్లు ఉన్నట్లు స్పష్టీకరణ..
- గాగిల్లాపూర్, దుండిగల్‌లో పనుల పురోగతిపై వి.పి.గౌతమ్ సమీక్ష..
- ప్రభుత్వ భూములు కబ్జాలకి గురి కాకుండా ప్రహరీ గోడలు నిర్మించాలని ఆదేశాలు..



# డబుల్ బెడ్ రూం ఇండ్ల పనులు... వేగవంతం చేయాలి..!

## గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ ఐఏఎస్..



దుండిగల్ సర్కిల్ పరిధిలో పర్యటించిన గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ ఐఏఎస్..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 31: జిహెచ్ఎంసి పరిధిలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయం కాలనీల్లో కొనసాగుతున్న పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్న సుమారు 4000 డబుల్ బెడ్ రూం ఇండ్లను, దాదాపుగా రూ.300 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులపై ఆయన శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు.. శనివారం బౌరంపేట, గాగిల్లాపూర్, దుండిగల్ ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయంలో విస్తృతంగా పర్యటించారు.. ప్రతి కాలనీలో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు పాఠశాల, పార్కు, అంగన్‌వాడీ, రేషన్ షాపులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, ప్రజలు ఆహ్లాదకర వాతావరణంలో నివసించేలా అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.. బహుళ అంతస్తులుగా నిర్మిస్తున్న ఈ కాలనీల్లో ప్రతి బ్లాక్‌ను ఒక ప్రాజెక్టుగా తీసుకుని ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.. తొలుత బౌరంపేట్‌లో వివిధ దశల్లో ఉన్న 15 బ్లాకుల్లోని 1620 ఇండ్ల పనులను పరిశీలించారు. బ్లాక్‌ల వారీగా పనులు పూర్తి చేయాలని, డ్రైనేజీ, వాటర్ వర్క్స్, విద్యుత్ పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. నివాసితుల సౌకర్యార్థం నిర్మిస్తున్న షాపులు తగిన విస్తీర్ణంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్టర్లకు తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తయితే లబ్ధిదారులకు అలాట్ చేస్తామని స్పష్టం చేశారు.. అనంతరం గాగిల్లాపూర్‌లోని రెండు ప్రాజెక్టులను సందర్శించి పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కాలనీల్లో పునరావాసం కింద కేటాయించవలసిన వారికి మొదటి ప్రాధాన్యంతో ఇండ్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని పేర్కొన్నారు.. కాలనీకి సంబంధించిన అప్రోచ్ రోడ్ సరిగా లేనందున వెంటనే పనులు చేపట్టాలని స్థానిక మున్సిపల్ అధికారులను ఆదేశించారు.. అనంతరం దుండిగల్‌లో నిర్మాణంలో ఉన్న 864 ఇండ్ల పనుల పురోగతిని సమీక్షించారు.. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ తెలిపారు..



### ప్రభుత్వ భూముల పరిరక్షణపై కఠిన చర్యలకు ఆదేశాలు..

నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డుకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ అధికారులను ఆదేశించారు.. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని గాజులరామారం, బౌరంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లో రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డుకు చెందిన అపార్ట్‌మెంట్ టవర్లు, ఓపెన్ ప్లాట్లు, ఇతర భూములను ఆయన సందర్శించారు. ఈ ప్రాంతాల్లో సుమారు 40 ఎకరాలకు పైగా ఖాళీ ప్రభుత్వ భూములు ఉన్నాయని గుర్తించారు.. ఈ భూములన్నింటికీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, సెక్యూరిటీ గార్డులను నియమించి నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు.. బాచుపల్లి ప్రాంతంలో ఇటీవల హైడ్రా సిబ్బంది ఆక్రమణలను కూల్చివేసిన ప్రాంతాలను పరిశీలించి, ఇకపై ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ అధికారులకు సూచించారు.. ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఎం.చైతన్య కుమార్, పి. బలరాం, జి. విజయకుమార్, మేడ్చల్‌మల్కాజిగిరి ప్రాజెక్టు డైరెక్టర్ రమణమూర్తి, జిహెచ్ఎంసి అధికారులు పి.వి. రవీందర్, స్థానిక తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు..





డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయాల పరిశీలనలో వి.పి.గౌతమ్ ఐఏఎస్..



## పిట్లం మండలంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహణ



**జుక్కల్, జనవరి 31 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా పిట్లం మండలం రాంపూర్(కలన్) గ్రామంలో శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ శీతల్, హెడ్ కానిస్టేబుల్ సాయగౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో అంటరానితనం, సైబర్ క్రైమ్ వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, జీపివోలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## వింగ్స్ ఇండియా-2026 ముగింపుతో బేగంపేటలో ట్రాఫిక్ జామ్

**ఖైరతాబాద్, జనవరి 31 పెన్ పవర్:** భారత వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం ప్రదర్శనతో బేగంపేట విమానాశ్రయంలో నిర్వహించిన వింగ్స్ ఇండియా-2026 విమానయాన ప్రదర్శన శనివారంతో ముగియనుంది. ఈ ప్రదర్శనను తిలకించడానికి సందర్శకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బేగంపేటలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్‌ను పునరుద్ధరించడానికి పోలీసులు చర్యలు చేపట్టారు.



## ఎంవీఐ కార్యాలయం తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్

**కోదాడ, జనవరి 31 పెన్ పవర్:** కోదాడ మండల పరిధిలోని గుడి బండలో ఏర్పాటు చేయనున్న మోటార్ వెహికిల్ ట్రాన్స్ పోర్ట్ కార్యాలయ భవనాన్ని ఉమ్మడి నల్గొండ జిల్లా డిప్యూటీ కమిషనర్ డా. ఎం వాణి పరిశీలించారు. భవనంలో సిబ్బందికి, అర్జీదారులకు కల్పిస్తున్న సదుపాయాలను స్థానిక ఎంవీఐ జిలానీ వివరించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# హౌసింగ్ కార్పొరేషన్ కు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బాధ్యత

**ఖమ్మం, జనవరి 31, పెన్ పవర్:** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోన్న సర్కార్.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని భావిస్తోంది. ఈ మేరకు అన్ని డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలోకి బదిలీ చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు తాజాగా జారీ అయ్యాయి.తెలంగాణలోని పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రతిష్ఠాత్మక పథకాలు అమలు చేస్తోంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల గూడు కోసం రూ. 5 లక్షలు ఆర్థిక సాయం చేస్తోంది. అన్ని నియోజకవర్గాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ఊపందుకుంది. మరో రెండు, మూడు నెలల్లో తొలిదశ ఇండ్ల అందుబాటులోకి రానున్నాయి. ఇక రాష్ట్రంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలపైనా సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వివిధ ఇంజనీరింగ్ శాఖల పర్యవేక్షణలో ఉన్న అన్ని డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను ఇక నుంచి తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలోకి బదిలీ చేయాలని డిసైడ్ అయింది. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఆయా డబుల్ బెడ్ రూం ఇండ్లను మరింత వేగంగా నిర్మాణాలు చేపట్టే విధంగా.. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా రేవంత్ సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ముఖ్య కార్యదర్శి జీవో ఎంఎస్ నంబర్ 5ను శు క్రవారం విడుదల చేశారు. గత ప్రభుత్వ

హయంలో ఇతర ఇంజనీరింగ్ శాఖలకు అప్పగించిన అన్ని డబుల్ బెడ్ రూం ప్రాజెక్టులను తక్షణమే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ స్వాధీనం చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు.ఈ మేరకు అన్ని జిల్లాల్లో ఉన్న



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కాంగ్రెస్ నాయకుడు అలీషా లింగారెడ్డి మృతి:

**నారాయణఖేడ్, జనవరి 31 పెన్ పవర్:** నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం తడ్కల్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు అలీషా లింగారెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, వారి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, అశోక్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంత్యక్రియల్లో కూడా కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## రాయికోడ్ విద్యుత్ సమస్యలు: ఏఈకి వినతి, పరిష్కారానికి హామీ

**పటాన్‌చెరు, జనవరి 31 పెన్ పవర్::** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈ అంబటి మోహన్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆయన సమస్యలను సానుకూలంగా స్వీకరించి, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సంఘటన రాయికోడ్ గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపరచడానికి దోహదపడుతుంది.

## చెరువులో విషాదం.. వెలికితీసిన మృతదేహం

**జడ్చర్ల, జనవరి 31 పెన్ పవర్::** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల చెరువులో ఇనుము కోసం వెళ్లి గల్లంతైన తిమ్మాజీపేట మండలం మామిడిచెట్టు తండాకు చెందిన రమేష్ మృతదేహం శనివారం లభ్యమైంది. అగ్నిమాపక శాఖ అధికారులు గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఓటర్ ఐడి కోసం రెండు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న వైనం

**ఆలంపూర్, జనవరి 31 పెన్ పవర్:** అలంపూర్ మున్సిపల్ కేంద్రంలోని ఎనిమిదో వార్డుకు చెందిన వై రజిత భర్త వై కుమార్, రెండు నెలల క్రితం ఓటర్ ఐడి కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు ఓటర్ ఐడి అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే స్పందించి తన భార్య ఓటర్ ఐడి కార్డును త్వరగా అందేలా చూడాలని ఆయన కోరారు.

## పొలం వద్ద అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

**మహబూబ్‌నగర్, జనవరి 31 పెన్ పవర్:** మండలంలోని బైరంపల్లి గ్రామంలో జంగయ్య (44) అనే వ్యక్తి వ్యవసాయ పొలం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సాయంత్రం పొలం పనులకు వెళ్లి తిరిగి రాని జంగయ్య మృతదేహాన్ని శనివారం ఉదయం కుటుంబ సభ్యులు పొలం వద్ద కనుగొన్నారు. జంగయ్య మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది.

## మానవత్వం చాటిన చిన్నారెడ్డి..!



**వనపర్తి, జనవరి 31 పెన్ పవర్:** ప్రజా భవన్‌లో జరిగిన 'ప్రజావాణి' కార్యక్రమంలో వనపర్తికి చెందిన మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రజావాణికి వచ్చిన 94 ఏళ్ల వృద్ధురాలు దాసోజు కమలమ్మ అకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోవడంతో, మంత్రి చిన్నారెడ్డి స్వయంగా ఆమెకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం, ఆమెను అంబులెన్స్‌లో నిమ్స్‌కు తరలించి, నిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నట్లు సమాచారం.

## విద్యార్థినులను పరామర్శించిన ఎమ్మెల్యేలు జీఎంఆర్, మేఘారెడ్డి

**మక్తల్, జనవరి 31 పెన్ పవర్::** కొత్తకోటలోని బీసీ బాలికల వసతి గృహంలో 15 మంది విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) మరియు ఎమ్మెల్యే మేఘా రెడ్డి వెంటనే వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని, విద్యార్థినులను పరామర్శించారు. ఎమ్మెల్యేలు విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

## వేసవిలో తాగునీటి కష్టాలు రానీయొద్దు: కలెక్టర్

**నాగర్‌కర్నూల్, జనవరి 31 పెన్ పవర్:** వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోశ్ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పైప్ లైన్ లీకేజీలను అరికట్టి, ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చూడాలని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ లోకి కొనసాగుతున్న చేరికల పర్వం

**వనపర్తి: పెన్ పవర్:** పెబ్బేరు దీ=వా పార్టీ నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరికలు.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలోకి చేరికలపర్వం కొనసాగుతోంది.శుక్రవారం పెబ్బేరు పట్టణానికి చెందిన 4వ వార్డు 6వ వార్డు 9వ వార్డులలోని దీ=వా మాజీ అధ్యక్షులు తాటికొండ ఆంజనేయులు మరో 53 మంది దీ=వా నాయకులు కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.బిఈ సందర్భంగా వనపర్తి నందిహిల్స్ లో గల ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెబ్బేరు మున్సిపాలిటీలోని 12 వార్డులకు 12 వార్డులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించేల ప్రతి ఒక్కరు పనిచేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.కార్యక్రమంలో మండలాధ్యక్షుడు, పెబ్బేరు విషయం మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు, విజయ వర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెబ్బేరు పట్టణ మాజీ అధ్యక్షులు వెంకట్రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రంజిత్ కుమార్, సదానంద రెడ్డి (చిట్టిబాబు) శివ, రణధీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సాంబార్ నీళ్లు .......ఉడకని అన్నం అర్ధాకలి తో కడుపు నింపుకుంటున్న విద్యార్థులు




### విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం.

**సిబెళగల్ జనవరి 31 పెన్ పవర్:** మండలంలోని బురాన్ దొడ్డి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం లో అందించే మధ్యాహ్న భోజనం సాంబార్ నీళ్లు ఉడకని అన్నం విద్యార్థులకు వరంగా మారింది. దీనంతటకి ముఖ్య కారణం వంట చేసే ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం అని చెప్పవచ్చు. ఇదేమిటని ప్రశ్నించిన విద్యార్థులపై ఏజెన్సీ నిర్వాహకులు భయపెట్టడం, మీ ఇంట్లో ఇంతకన్నా బాగా భోజనం చేసుకుంటారా అని పిల్లలను బెదిరింపులకు గురి చేయడమే కాక భోజనం సరిగా లేదని ఎవరికైనా చెబితే ఇంతకన్నా నీచంగా వండి పెడతామంటూ విద్యార్థులపై చిందులేస్తున్నారు. దీంతో చేసేదేం లేక విద్యార్థులు అర్ధాకులతో కడుపు నింపుకుంటున్నారు.ఇంత జరుగుతున్న సంబంధిత విద్యాశాఖ అధికారులు బురాన్ దొడ్డి ఉన్నత పాఠశాల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి రుచికరమైన భోజనం అందించే వంట ఏజెన్సీని నియమించాలని విద్యార్థులు మీడియాతో తెలిపారు.

# వనపర్తి పట్టణంలోని 24 వ వార్డు ప్రజాసంకల్పం కోసం కృషి చేస్తా.

### ఏర్పుల అరుణ బి.ఆర్.ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి...

**వనపర్తి పెన్ పవర్:** వనపర్తి పట్టణంలో 24 వ వార్డు ప్రజల సమస్యలు పరిష్కారం కోసం మేము నిరంతరం పాటు వారి సమస్యలను, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు ప్రభుత్వం నుంచి రావాల్సినటువంటి పింఛన్లు రుణాలను మంజూరు, చేయించడానికి కృషి చేస్తానని ఇంటి స్థలాలు లేనివారికి డబల్ బెడ్ రూమ్ లేని వారికి తాను కృషి చేస్తానని ,వార్డులో ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను ఇంటింటికి వెళ్లి అరుణ కోరుతున్నారు .కాలనీలో ఐమాక్స్ లైట్లు వేయిస్తానని ప్రచారంలో దూసుకుపోతున్నారు .కాలనీలోని వృద్ధులు వితంతువులు వికలాంగుల సమస్యలను తెలుసుకుంటూ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎం వెంకటస్వామి తోట బాలరాజు, ఎండి హుస్సేన్ వి రాజశేఖర్ ,జి రవికుమార్, రాంబాబు ,రాఘవేందర్.

మహిళలు అలివేల ,అరుణ జయంతి ,మంజుల, గట్టమ్మ వినయ్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.



# డేంజర్‌లో మేడిగడ్డ

**కరీంగనర్, జనవరి 31, పెన్ పవర్:**
దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జలాశయాల జాబితాలో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ చేరినట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ 2025 తనిఖీల ఆధారంగా దీనిని కేటగిరీ–1 అత్యంత ప్రమాదకరం కింద వర్గీకరించింది. మేడిగడ్డతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. మరమ్మతులు తక్షణమే చేపట్టకపోతే భద్రతకు పెను ముప్పు పొంచి ఉందని కేంద్రం హెచ్చరించింది. దేశవ్యాప్తంగా 50 ఏళ్లు దాటిన డ్యామ్‌లు 1,681 ఉన్నాయని, డ్యామ్ సేఫ్టీ యాక్ట్–2021 ప్రకారం వీటిపై రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించింది.దేశవ్యాప్తంగా ఉన్న జలాశయాల భద్రతపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో కీలక గణాంకాలను వెల్లడించింది. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న మొదటి మూడు డ్యామ్‌ల జాబితాలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. లోక్‌సభలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) 2025 వర్షాకాలం తర్వాత నిర్వహించిన తనిఖీల్లో మూడు ప్రధాన జలాశయాలను 'కేటగిరీ–1' (అత్యంత ప్రమాదకరం) కింద వర్గీకరించారు. అందులోతెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ, ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి డ్యామ్, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీ.ఈ జలాశయాల భద్రత విషయంలో తక్షణమే నివారణ చర్యలు , మరమ్మతులు చేపట్టకపోతే భారీ రిస్క్ పొంచి ఉందని కేంద్రం స్పష్టం చేసింది. మేడిగడ్డ విషయంలో తలెత్తిన లోపాలను సరిదిద్దేందుకు మరియు బ్యారేజీ రక్షణ కోసం ఎన్‌డీఎస్‌ఏ సూచించిన జాగ్రత్తలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది.డ్యామ్ సేఫ్టీ యాక్ట్–2021 ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలం ముందు మరియు తర్వాత జలాశయాల భద్రతను తనిఖీ చేయడం తప్పనిసరి. 2025లో వర్షాకాలం ముందు 6,524 డ్యామ్‌లను,



వర్షాకాలం తర్వాత 6,553 డ్యామ్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. భారతదేశంలో ప్రస్తుతం 50 ఏళ్లు పైబడిన జలాశయాలు 1,681 ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఇవి కాలం చెల్లిన నిర్మాణాలుకావడంతో వీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.గతంలో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగిపోవడం, పగుళ్లు రావడం వంటి ఘటనల నేపథ్యంలో కేంద్ర నిపుణుల కమిటీ పర్యవేక్షణ కొనసాగుతోంది.కేటగిరీ–1 కింద వర్గీకరించడమంటే.. నిర్మాణ పరంగా అది తీవ్రమైన వైఫల్యాలను ఎదుర్కొంటోందని అర్థం. మరమ్మతులలో జాప్యం జరిగితే దిగువన ఉన్న గ్రామాలపై దాని ప్రభావం పడే అవకాశం ఉంటుంది. జలాశయాల
నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిరంతర పర్యవేక్షణ ఉండాలని కేంద్రమంత్రి సూచించారు

# రంగారెడ్డిలో పీఠం...నీదా... నాదా...

**రంగారెడ్డి, జనవరి 31, పెన్ పవర్:**
మున్సిపల్ పీఠం నీదా నాదా అన్నట్లుగా ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రచారం ప్రారంభిం చాయి. జిల్లాలోని వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల నుండి కౌన్సిలర్ పోటీ చేసేందుకు అభ్యర్థుల నుండి పెద్ద మొత్తంలో డిమాండ్ ఉండటంతో ఈ రెండు పార్టీలు టికెట్లు కేటాయించే విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. నామినేషన్ల ఘట్టం ముగిసిన కూడా ఇంకా ఎవరికీ అధికారికంగా టికెట్లు కేటాయిస్తునట్లు చెప్పలేదు. కొన్ని చోట్ల మాత్రం ప్రచారం ప్రారంభించుకోవాలని ఆశావాహులకు సూచిస్తున్నారు.మునిసిపల్ ఎన్నికల్లో బిజెపి, ఎంఐఎం పార్టీలు కూడా తమ బలాన్ని చూపించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. గత ఎన్నికల్లో గెలిచిన బిజెపి అభ్యర్థులకు ఈసారి తిరిగి టికెట్ ఇచ్చి గెలిపించుకోవడంతో పాటు జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలో కౌన్సిలర్ సీట్లను ఘననీయంగా పెంచుకోవాలని బిజెపి అధిష్టానం స్థానిక నాయకులను ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు బిజెపి ప్రయత్నాలు ప్రారంభించింది. ఇక ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రతి చోట ఎంఐఎం అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవాలని ఎంఐఎం అభ్యర్థులు వ్యూహాలు పన్నుతున్నారు. మున్సిపల్ పీఠాన్ని ఆశిస్తున్న ప్రధాన పార్టీలకు మన తోడు తప్పనిసరి అయ్యేలా సీట్లు సాధించాలనే ప్రయత్నంలో ఎంఐఎం నాయకులు ఉన్నారు. వికారాబాద్ మునిసిపల్ చైర్మన్ పీఠం ఈసారి ఎవరు దక్కించుకుంటారనే దానిపై ఓటర్లు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. వికారాబాద్ మునిసిపల్ మొత్తం 34 వార్డులు ఉండగా 58, 117 మంది ఓటర్లు ఉన్నారు. 2020లోవికారాబాద్ మునిసిపల్ చైర్మన్ జనరల్ మహిళకు కేటాయించగా ఈ దఫా ఎస్సీ మహిళకు కేటాయించారు. వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎస్సీ ఉండటంతో ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ల సన్నిహితుల్లో ఎవరో ఒకరికి ఈ పదవి దక్కనుందని ప్రచారం జరుగుతుంది. చైర్మన్ పదవి దక్కించుకోవడం ఇద్దరూ నాయకులకు సవాలుగా మారిందికాంగ్రెస్ పార్టీ తరఫున చైర్మన్‌రేసులో స్పీకర్ కుమార్తె అనన్య ఉన్నట్లు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చా రు. బీఆర్ఎస్ నుండి చైర్మన్ రేస్ లో ఎవరున్నారనే విషయంపై ఇంకా తుది నిర్ణయానికి రాలేదు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత పోటీలో ఉంటున్నట్లు ప్రచారం జరుగుతున్నా అధికారికంగా ఎక్కడ ప్రకటించడం లేదు. అయితే బిఆర్ఎస్ ప్రకటించే చైర్మన్ అభ్యర్థి ఎవరనే దానిపైనే గెలుపోటములు నిర్ణయించబడతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతు న్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వికారాబాద్ బీఆర్ఎస్ చైర్మన్ గిరిని దక్కించుకోగా తదనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల కారణంగా చైర్మన్ అభ్యర్థి హస్తం చెంతకు చేరింది.జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలలో తాండూర్ పెద్ద మున్సిపాలిటీ 36 వార్డులు ఉండగా 77,110 మంది ఓటర్లు ఉన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత జరిగిన రెండుసార్లు మున్సిపల్ ఎన్నికల్లో ఇక్కడ మహిళలే చైర్మన్ పీఠంపై కూర్చున్నారు.

ఈసారి మాత్రం బీసీ జనరల్ కావడంతో అధికార ప్రతిపక్ష పార్టీల నుండి చైర్మన్ ఆశావాహుల సంఖ్య భారీగా ఉంది. తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గం జనరల్ ఉండటంతో అధికార ప్రతిపక్షాల మధ్య ఎప్పుడు రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగుతుంది. ఇక్కడ అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ తో పాటు బిజెపి, ఎంఐఎంల కు కూడా బలమైన క్యాడర్ ఉంది. 2020 మునిసిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పదికి పైగా కౌన్సిల్ స్థానాలు గెలిచి అధికార పార్టీకి చెమటలు పట్టించింది.మునిసిపల్ ఎన్నికలను కూడా ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గత రెండుసార్లు బీఆర్ఎస్ బల్దియా పీఠాన్ని దక్కించుకోవడంతో ఈసారి కూడా విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్నారు. అయితే అధికార కాంగ్రెస్ మాత్రం ఎలాగైనా మునిసిపల్ చైర్మన్ పదవిని అస్తగతం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. కాంగ్రెస్ తరఫున చైర్మన్ రేస్ లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్ నుండి మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింలు, బిజెపి నుండి యు. రమేష్ కుమార్లు పోటీలో ఉన్నారు. వీరిలో చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.కొడంగల్ మున్సిపల్ 12
వార్డులు, 27,614 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ చైర్మన్ జనరల్ కావడంతో అధికార కాంగ్రెస్ లో పోటీ తీవ్రంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఎవరు చైర్మన్ అయినా అభివృద్ధి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆశతో అభ్యర్థులు ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ నుండి తాజా మాజీ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి మరోసారి చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్నారు. ఆయన మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్ రెడ్డి తనయుడు కావడం కొంత కలిసి వచ్చే అవకాశం ఉంది.ఆయనతో పాటు మరో సీనియర్ నాయకుడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ గుప్తా చైర్మన్ పీఠాన్ని బలంగా ఆశిస్తున్నారు. ఈయనకు కూడా రాజకీయ నేపథ్యం ఉంది.

ప్రశాంత్ గుప్తా తాత నంద్యాల వెంకటయ్య చిన్నాన్న నందారం సూర్యనారాయణ ఇద్దరు గతంలో కొడంగల్ ఎమ్మెల్యేలుగా పని చేసిన వారే. జగదీశ్వర్ రెడ్డి, ప్రశాంత్ గుప్తులు ఇద్దరు కాంగ్రెస్ వారే కావడంతో అధిష్టానం ఎవరి వైపు ముగ్గు చూపుతుందో వేచి చూడాల్సి ఉంది. బీఆర్ఎస్ నుండి చైర్మన్ పోటీలో ఎవరున్నారనే విషయంపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు.పరిగి మునిసిపాలిటీ ఈసారి బీసీ జనరల్ కు కేటాయించబడింది. ఈ మునిసిపాలిటీలో 18 వార్డులు ఉండగా 27,614 మంది ఓటర్లు ఉన్నారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఈసారి స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఎలాగైనా పరిగి మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే పట్టుదలతో ఉన్నారు. గెలిచే అవకాశం ఉన్న నాయకులకే కౌన్సిలర్ టికెట్లు ఇస్తున్నట్లు స్థానిక నాయకులు చెబుతున్నారు. గెలుపు వ్యూహం లో భాగంగానే చైర్మన్ అభ్యర్థి ఎవరనే విషయాన్ని గోప్యంగా ఉంచి ఎన్నికలకు పోతున్నారు. ఇది ఇలా ఉండగా బీఆర్ఎస్ పార్టీ సైతం రెండోసారి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకునేందుకు అన్ని రకాలప్రయత్నాలు ప్రారంభించింది. బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థిగా చివన్నోళ భాస్కర్ ను ప్రకటించి ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభించింది.

# రిజిస్ట్రేషన్ల శాఖలో కీలక మార్పులు

**నిజామాబాద్, జనవరి 31, పెన్ పవర్:**
తెలంగాణ రిజిస్ట్రేషన్ల శాఖలో దశాబ్దాల నాటి పాత పద్ధతులకు ప్రభుత్వం స్వస్తి పలికింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఎత్తైన గద్దెలపై కూర్చునే సంప్రదాయాన్ని రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై అధికారులు సామాన్యుల తరహాలోనే నేలపై టేబుల్, కుర్చీ వేసుకుని విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజలకు, అధికారులకు మధ్య దూరాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే.. అద్దె భవనాల్లో నడుస్తున్న కార్యాలయాలను తక్షణమే ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని కేంద్రాల్లో ఇప్పటికే గద్దెలను తొలగించి, సొంత భవనాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేశారు.తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పాత సంప్రదాయాలకు స్వస్తి పలుకుతూ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో
ఉన్నతాధికారుల హోదాను ప్రదర్శించే గద్దె సంప్రదాయాన్ని రద్దు చేయడంతో పాటు.. అన్ని కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోకే తరలించాలని నిర్ణయించింది. ప్రజలకు, అధికారులకు మధ్య దూరాన్ని తగ్గించిపారదర్శకమైన పాలన అందించడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం.రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్ కూర్చునే చోట ఒక ఎత్తైన గద్దెను నిర్మించి.. దాని చుట్టూ ఎరుపు రంగు వస్త్రం కప్పడం బ్రిటిష్ కాలం నాటిఆచారంగా వస్తోంది. డాక్యుమెంట్ల పరిశీలన సమయంలో అధికారులు ఎత్తులో కూర్చోవడం వల్ల సామాన్య ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. దీనిపై స్పందించిన రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్
గాంధీ హన్మంతు, రెండు వారాల క్రితమే కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ఇకపై సాధారణ టేబుల్, కుర్చీ వేసుకుని నేలపైనే కూర్చొని విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనిఅన్ని కార్యాలయాల్లో ఇప్పటికే ఈ గద్దెలను తొలగించారు.రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాల వల్ల ఖజానాపై భారీగా భారం పడుతోంది. దీనిని నివారించేందుకు ఇకపై ఏ శాఖా
కార్యాలయం కూడా అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, భీమ్‌గల్ వంటి పలు ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్‌కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లోనే నడుస్తున్నాయి. వీటన్నింటికీ ప్రభుత్వ భవనాలను కేటాయించాలని జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన ఇప్పటికే కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ భవనాల్లోకి మారడం వల్ల కేవలం అద్దె ఆదాఅవ్వడమే కాకుండా.. ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించే వీలుంటుంది. పార్కింగ్ సమస్యలు, వెయిటింగ్ హాల్స్ లేకపోవడం వంటి ఇబ్బందులకు తావుండదు. నిజామాబాద్ అర్బన్ వంటి కొన్ని చోట్లసాంకేతిక కారణాల వల్ల జాప్యం జరుగుతున్నప్పటికీ.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ.. డిజిటల్ సేవలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది.కార్యాలయాల తరలింపు పూర్తయితే సామాన్యులకు సేవలు మరింత వేగంగా అందుతాయని భావిస్తున్నారు.

## 44వ డివిజన్‌లో మాదిగ వర్గానికే బీ-ఫాం: కటుకూరి శేఖర్ బాబు

**కొత్తగూడెం, జనవరి 31 పెన్ పవర్:** గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన 44వ డివిజన్ నాయకులు కటుకూరి శేఖర్ బాబుకు బీ–ఫాం ఇవ్వాలని, లేదంటే ఆ డివిజన్ కాంగ్రెస్ చేజారిపోతుందని ఆయన విజ్ఞప్తి చేశారు. 44వ డివిజన్‌లో 2,510 మంది ఓటర్లుండగా, వీరిలో మాదిగ సామాజిక వర్గానికి చెందినవారే అధికంగా ఉన్నారని, వారికి బీ–ఫాం ఇస్తే ఖచ్చితంగా సీటు గెలిపించి కాంగ్రెస్‌కు కానుకగా ఇస్తామని శపథం చేశారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, 1200 గోడ స్టిక్కర్లు అంటించిన ఘనత కటుకూరి శేఖర్ బాబుకే దక్కుతుందని, ఎంతమంది వచ్చినా 44వ డివిజన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మణుగూరులో దుప్పట్లు పంపిణీ



**పినపాక, జనవరి 31 పెన్ పవర్:**మణుగూరు మండలంలోని రేగులగండిలో భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కూనవరం సర్పంచ్ ఏనిక శ్వేత, పీకేఓసీ రక్షణా అధికారి లింగబాబుతో కలిసి స్థానికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అమీనుద్దీన్ నేతృత్వంలో దాతల ప్రోత్సాహంతో భరోసా సేవలు ఆదివాసీ గ్రామాలకు అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లా లో :ఖీూ ప్రచారం జోరు

**మహబూబాబాద్, జనవరి 31 పెన్ పవర్:**మహబూబాబాద్ జిల్లా జమండ్లపల్లి గ్రామంలో :ఖీూ పార్టీ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. వార్డు సభ్యులు అంబాల గోవర్ధన్, బండి ఎంకన్నలు అధికార పార్టీ కంటే ముందే ప్రజల్లోకి వెళ్లి, రోడ్లు, నల్లాలు వంటి సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇస్తున్నారు. కేవలం 100, 200 ఓట్లు కాకుండా, తమకు కావాల్సిన అభివృద్ధిని అడగాలని ప్రజలకు సూచిస్తున్నారు. ఏదైనా ఆపద వస్తే ఒక్క ఫోన్ కాల్‌కే తాము ముందుంటామని గోవర్ధన్, ఎంకన్న భరోసా ఇస్తున్నారు. ఎన్నికల జోరుతో ప్రజల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

## పాలకుర్తిలో పానీ పూరి వ్యాపారి ఇంట్లో అగ్నిప్రమాదం, భారీ నష్టం

**పాలకుర్తి, జనవరి 31 పెన్ పవర్:**జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో రాత్రి పానీ పూరి వ్యాపారి అద్దె ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. స్థానిక బీజేపీ నాయకుడు కమ్మగాని శ్రీకాంత్ వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేయించి, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికులు గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. అదృష్టవశాత్తు ప్రాణనష్టం ఏమీ జరగలేదు.

## పరకాల మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి అమ్మవార్లను దర్శించుకున్నారు



**పరకాల, జనవరి 31 పెన్ పవర్:**ఆత్మకూరు మండలం అగ్రంపాడ్ శ్రీ సమ్మక్క–సారలమ్మ మహా జాతర సందర్భంగా, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి శనివారం తన కుటుంబసమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని అమ్మవార్లను మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## కోటగుళ్లు దేవాలయ శిల్ప సంపదను భావితరాలకు అందించాలి

**భూపాలపల్లి, జనవరి 31 పెన్ పవర్:** భూపాలపల్లి జిల్లా జడ్జి రమేష్ బాబు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గంగినేని అఖిల శనివారం శని త్రయోదశి పర్వదినాన గణపురం మండలం కోటగుళ్లు దేవాలయానికి కుటుంబసమేతంగా విచ్చేశారు. అక్కడ గణపతి, నందీశ్వరుడికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయ శిల్ప సంపదను భావితరాలకు అందించాలని వారు సూచించారు. గోశాల గోమాతలకు దానా బస్తాలు అందజేసిన న్యాయమూర్తులను ఆలయ పరిరక్షణ కమిటీ ఘనంగా సత్కరించింది.

## మేడారంలో బస్సు అద్దాలు పగలగొట్టిన ప్రయాణికులు

**జనగామ, జనవరి 31 పెన్ పవర్:**మేడారంలో రాత్రి నుండి తిరుగు ప్రయాణానికి ఒక్క బస్సు కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహించి బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. నిన్న మధ్యాహ్నం 3 గంటల నుండి బస్టాండ్ వద్దనే ఉన్నామని, కనీసం తాగడానికి కూడా నీళ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తాడ్వాయి నుండి వచ్చే దారిలో ట్రాఫిక్ జామ్ కావడంతో బస్సులు రాలేక పోయాయని అధికారులు తెలిపారు. శనివారం ఉదయం నుండి ట్రాఫిక్ క్లియర్ కావడంతో ఆర్టీసీ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## మేడారంలో గద్దెల వద్ద ప్లాస్టిక్ కుప్పలు

**పాలకుర్తి, జనవరి 31 పెన్ పవర్:** మేడారం వనదేవతల సన్నిధిలో భక్తులు పోటెత్తడంతో గద్దెల ప్రాంగణమంతా భక్తజనంతో నిండిపోయింది. అయితే, భక్తులు తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి చిప్పలను ఎక్కడపడితే అక్కడ పడేయడంతో అపరిశుభ్రంగా మారింది. ప్లాస్టిక్ రహిత జాతరలో ఇలా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు వెంటనే క్లిన్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కన్నెపల్లిలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

**బెల్లంపల్లి, జనవరి 31 పెన్ పవర్:** కన్నెపల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఐక్యత పెరుగుతాయని అన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాము, పంచాయతీ సెక్రటరీ అనిల్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు సతీష్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి సత్యనారాయణ, వార్డు మెంబర్లు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గం సుధాకర్ కుటుంబానికి ఆకుల రాజేందర్ అండ



**మంచిర్యాల, జనవరి 31 పెన్ పవర్:** దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన దుర్గం సుధాకర్ శనివారం అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను మాజీ వైస్ యంపిపి ఆకుల రాజేందర్ పరామర్శించి, రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుర్సెంగ కళావతి, ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, వార్డు మెంబర్ ఆత్రం భీంరావు, నాయకులు జుగతిరావు, బోడకుంట లక్ష్మయ్య, దుర్గం నరేష్, లస్మయ్య, లింగస్వామి, బుచ్చన్న, భీమయ్య, జాడి శంకరయ్య, తాల్లపెల్లి హనుమయ్య, తుడుం రాజం తదితరులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా: ఇద్దరిపై కేసు నమోదు, వాహనం సీజ్

**చెన్నూరు, జనవరి 31 పెన్ పవర్:** సాయంత్రం 7 గంటల సమయంలో జన్నారం ప్రధాన రహదారిపై బొలెరో వాహనంలో 9 పశువులను (2 ఎద్దులు, 7 కోడె లేగలు) అక్రమంగా తరలిస్తున్నట్లు గోరక్షకులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా, కొనుగోలు రసీదులు లేవని గుర్తించారు. వాహనాన్ని, అందులోని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. గోరక్షకులు, పోలీసుల సమక్షంలో పశువులను దండేపల్లి మండలం మాదాపూర్ శ్రీకృష్ణ గోశాలకు తరలించారు.

## బీ ఆర్ ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ లోకి చేరిన రాజన్న

**సిర్పూర్, జనవరి 31 పెన్ పవర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడకు చెందిన ననుమల రాజన్న శనివారం బీఆర్ఎస్ పార్టీని వీడి, ఎమ్మెల్సీ దండే విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఎమ్మాజీ శారద సంతోష్ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ చేరిక కాగజ్‌నగర్ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: సర్పంచ్ బాపూజీ

**ఆసిఫాబాద్, జనవరి 31 పెన్ పవర్:** కొమరంభీం జిల్లా, ఆసిఫాబాద్‌లోని వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం సర్పంచ్ మోహార్లే బాపూజీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను క్షుణ్ణంగా తెలుసుకుని, సమస్యలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

## పైడిమడుగు బ్రహ్మోత్సవాల్లో భోగ శ్రావణి ప్రత్యేక పూజలు



**కోరుట్ల, జనవరి 31 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవస్థాన కమిటీ సభ్యులచే సన్మానం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు: బీజేపీ విజయోత్సవ సభలో కాకరేపిన ప్రశ్నలు

**జగిత్యాల, జనవరి 31 పెన్ పవర్:** జగిత్యాల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ విజయోత్సవ సభ నిర్వహించింది. ఈ సభలో, మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి కొండా అరుణ-లక్ష్మణ్ 50 వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులకు మద్దతు కోరారు. మాజీ చైర్ పర్సన్ భోగ శ్రావణి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి కమలం గుర్తుకే ఓటు వేయాలని సూచించారు. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో ప్రజలు నిలదీయాలని, ఫిబ్రవరి 4న జరిగే బహిరంగ సభలో సీఎం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, సీఎం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు (తులం బంగారం, రైతుబంధు, పెన్షన్లు) ఏమయ్యాయని ప్రశ్నించారు.

## అభ్యర్థులు ఖర్చుల బిల్లులు సమర్పించాలి

**ధర్మపురి, జనవరి 31 పెన్ పవర్:** :మెట్పల్లి మున్సిపాలిటీలలో జరుగుతున్న నామినేషన్ల సరళిని పరిశీలించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు డి. శ్రీనివాస్, పోటీ చేసే అభ్యర్థులు నిర్దేశించిన వ్యయ పరిమితి మేరకు ఖర్చులు చేయాలని, చేసిన ఖర్చులకు సంబంధించిన బిల్లులను తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పాటించడం దీని ముఖ్య ఉద్దేశ్యం.

## దేశవ్యాప్త సమ్మె ను విజయవంతం చేయండి..

**పెద్దపల్లి, జనవరి 3 1 పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు కాంట్రాక్టు కార్మిక సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు సమ్మె నోటీసును రామగుండం-3 జీఎం కు అందజేశారు. ఏప్రిల్ నుండి అమలు చేయబోతున్న ఈ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొనాలని సంఘం రాష్ట్ర నాయకుడు అకుల వెంకన్న కోరారు.

## తొండపల్లిలో నీటి సమస్యకు తెర, బోరు పనులు ప్రారంభం



**పరిగి, జనవరి 31 పెన్ పవర్:** వికారాబాద్ జిల్లా, పరిగి మండలం తొండపల్లి గ్రామంలో శనివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గుర్రంపల్లి కృష్ణయ్య నీటి సమస్యను పరిష్కరించేందుకు నీటి సరఫరా కోసం బోరు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ చర్యతో తొండపల్లి గ్రామస్తుల నీటి సమస్యకు స్వస్తి పలుకుతుందని ఆశిస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆ 26 కులాలకు బీసీ హోదా రద్దు

**హైదరాబాద్, జనవరి 31, పెన్ పవర్:**
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెడ్డి గాండ్ల సహా 26 ఇతర వెనుకబడిన తరగతుల (డీజ) కులాలను బీసీ జాబితా నుంచి తొలగించింది. నకిలీ ధృవీకరణ పత్రాలతో రిజర్వేషన్ల దుర్వినియోగాన్ని అరికట్టడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. మున్సిపల్ ఎన్నికల్లో ఈ సామాజిక వర్గాల వారు బీసీ రిజర్వేషన్ల కింద పోటీ చేసే అవకాశాన్ని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది.రెడ్డి గాండ్ల సహా మరో 26 ఇతర వెనుకబడిన తరగతుల కులాలను ఆ జాబితా నుంచి తొలగించింది. ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఈ సామాజిక వర్గాల వారు బీసీ రిజర్వేషన్ల కింద పోటీ చేసే అవకాశాన్ని నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో రిజర్వేషన్ల దుర్వినియోగాన్ని అరికట్టడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం.కొంతమంది అర్హత లేని వారు బీసీ సర్టిఫికెట్లను సులభంగా పొంది, రిజర్వేషన్ ప్రయోజనాలను అక్రమంగా వాడుకుంటున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో, రెడ్డి గాండ్ల కులానికి చెందిన వారికి బీసీ-బి సర్టిఫికెట్లు జారీ చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. గత పదేళ్లుగా నాలుగు జిల్లాల్లో ఈ కులానికి చెందిన వారికి బీసీ సర్టిఫికెట్లు జారీ చేసేవారు. ఇప్పుడు ఆ పద్ధతిని రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. బీసీ రిజర్వేషన్ల కింద కేటాయించిన స్థానాల్లో పోటీ చేయాలనుకునే ఈ 26 కులాలకు చెందిన అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వం సూచించింది. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అర్హత లేని ఎనిమిది మంది అభ్యర్థులు నకిలీ బీసీ హోదాను ఉపయోగించి వార్డు సభ్యులుగా గెలుపొందినట్లు వెలుగులోకి వచ్చింది. ఇది ఎన్నికల అధికారుల నిర్లక్ష్యాన్ని, అభ్యర్థుల అర్హతలను సరిగ్గా పరిశీలించడంలో ఉన్న లోపాలను బయటపెట్టింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం తాజా ఆదేశాలు జారీ చేసింది.తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా లేని కొన్ని సామాజిక వర్గాలు రిజర్వేషన్లను దుర్వినియోగం చేస్తున్నాయని ఆ నివేదిక పేర్కొంది. ఈ క్రమంలో సర్కార్ 26 కులాలకు బీసీ హోదాను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.గాండ్ల కులం వారు సాంప్రదాయకంగా నూనె గింజలు నూరి జీవించేవారు. వీరిని బీసీ-బి వర్గంలో చేర్చారు.




అయితే, రెడ్డి గాండ్ల అనే ఉప కులం కూడా ఉంది. వీరిద్దరి వృత్తి ఒకటే అయినా, 'రెడ్డి' అనే పదం వాడకం వల్ల గందరగోళం ఏర్పడుతోందని, దీనిని అడ్డం పెట్టుకుని చట్టబద్ధంగా అర్హత లేని వారు కూడా ప్రయోజనాలు పొందుతున్నారని ప్రభుత్వం అభిప్రాయపడింది.2010లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్ జిల్లాల కలెక్టర్లకు రెడ్డి గాండ్ల కులానికి చెందిన వారికి బీసీ సర్టిఫికెట్లు జారీ చేయడానికి అనుమతి ఇచ్చింది. ఇప్పుడు వచ్చిన ఉత్తర్వులు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాయి. ఆనాటి నిర్ణయం ఒక పొరపాటు అని, అది దుర్వినియోగానికి దారితీసిందని ప్రస్తుత ఉత్తర్వులు పేర్కొన్నాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, 2014లో బీసీ జాబితాను సమీక్షించారు. అప్పుడు కళింగ, తూర్పు కాపు, గవర వంటి 26 కులాలు ప్రధానంగా ఆంధ్ర ప్రాంతంలోనే ఎక్కువగా ఉన్నాయని, తెలంగాణలో వారికి చెప్పుకోదగ్గ సంఖ్యలో స్థానిక ఉనికి లేదని గుర్తించారు. జీవో 3 (బీసీ 3), 2014 ద్వారా వీరిని బీసీ జాబితా నుంచి తొలగించారు. ఈ నిర్ణయాన్ని హైకోర్టు 2016లో సమర్థించింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఈ కులాలకు రిజర్వేషన్ల ప్రయోజనం కల్పించకూడదని సర్కార్ నిర్ణయించింది.

# ఎర్రవల్లి వర్సెస్ జూబ్లీహిల్స్

**హైదరాబాద్, జనవరి 31, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో గురువారం చోటుచేసుకున్న పరిణామాలు అత్యంత వేగంగా, నాటకీయంగా సాగాయి. గురువారం ఉదయం సిట్ అధికారులు నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లి నోటీసులు అందజేయడంతో మొదలైన ఈ ప్రక్రియ, సాయంత్రానికి కేసీఆర్ ఇచ్చిన ఘాటైన సమాధానంతో కొత్త మలుపు తీసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు కోరగా, కేసీఆర్ మాత్రం తన లిఖితపూర్వక సమాధానంలో చట్టపరమైన అంశాలను ప్రస్తావిస్తూ నో చెప్పారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం చివరి దశలో ఉండటంతో తానే అభ్యర్థులకు బి-ఫారాలు కేటాయించాల్సి ఉందని, అందుకే హాజరుకాలేనని స్పష్టం చేశారు.కేసీఆర్ తన సమాధానంలో కేవలం ఎన్నికల బిజీనే కాకుండా, చట్టంలోని కీలక నిబంధనలను గుర్తు చేశారు. 65 ఏళ్లు దాటిన వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు పిలవకూడదని, వారి నివాసంలోనే విచారించాలని ఉన్న నిబంధనను ఆయన తన రక్షణ కవచంగా మార్చుకున్నారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే నివసిస్తున్నానని, అక్కడికే వచ్చి విచారించుకోవచ్చని ఆయన ఆఫర్ ఇచ్చారు. దీంతో పోలీసులు ఆయనను జూబ్లీహిల్స్ ఏసీబీ కార్యాలయానికి రప్పించాలనే ప్రాథమిక ఆలోచనను తాత్కాలికంగా పక్కన పెట్టాల్సి వచ్చింది.కేసీఆర్ ఇచ్చిన సమాధానం కేవలం సమాచారం మాత్రమే కాదు, అందులో లోతైన న్యాయపరమైన అంశాలు ఉన్నాయి. ఆయన నివాస స్థలం ఎక్కడ? విచారణ ఎక్కడ జరపాలి? అనే విషయాలపై స్పష్టత కోసం సిట్ అధికారులు ఇప్పుడు న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. శుక్రవారం విచారణ ఉండదని స్పష్టమైపోయింది. సిట్ ఈ మేరకు కేసీఆర్ కు సమాచారం ఇచ్చింది.

అయితే, తదుపరి నోటీసులు ఎప్పుడు ఇస్తారు? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకునే లోపే విచారణ ముగించాలని ప్రభుత్వం భావిస్తుందా, లేక ఎన్నికల తర్వాతే దీనిపై దృష్టి పెడుతుందా అనేది వేచి చూడాలి.బీఆర్ఎస్ ఈ నోటీసులను రాజకీయ కక్షసాధింపుగా మలిచి సానుభూతి పొందాలని చూస్తుంటే, కాంగ్రెస్ మాత్రం అక్రమాలను బయటపెడుతున్నామనే సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్తోంది. నామినేషన్ల చివరి రోజైన శుక్రవారాన్ని కేసీఆర్ ఎంచుకోవడం వెనుక, క్యాడర్‌లో నైతిక బలాన్ని పెంచే ఉద్దేశం కూడా ఉందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి, విచారణ వాయిదా పడటం అనేది ప్రస్తుతానికి కేసీఆర్‌కు తాత్కాలిక ఊరటనిచ్చినప్పటికీ, సిట్ మాత్రం ప తదుపరి నోటీసుల కోసం రంగం సిద్ధం చేస్తోంది.
మరో వైపు కేసీఆర్ తన సమాధానంలో కేవలం రాజకీయ కారణాలనే కాకుండా, చట్టంలోని కీలక నిబంధనలను కూడా ప్రస్తావించారు.సీఆర్‌పీసీ సెక్షన్ 160ని ఉటంకిస్తూ, దర్యాప్తు అధికారులు సాక్షులను లేదా విచారించాల్సిన వ్యక్తులను ఎక్కడ విచారించాలనే విషయాన్ని గుర్తు చేశారు. 65 ఏళ్లు పైబడిన వాళ్లను దివ్యాంగులను, నివసించే ప్రాంతం కాకుండా ఇతర చోట్ల విచారణ నిమిత్తం పిలవకూడదని చట్టం చెబుతోందని ఆయన తెలిపారు. చట్టం ప్రకారం 65 ఏళ్లు పైబడిన వ్యక్తిని దర్యాప్తు బృందం వారు నివసించే చోటే విచారించాల్సి ఉంటుందని అన్నారు. ఈ నిబంధన మేరకు తనను విచారించాలనుకుంటే సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలోని తన నివాసానికి రావాలని పోలీసులకు సూచించారు. అధికారుల వీలును బట్టి మరో తేదీని ఖరారు చేయాలని, ముందస్తు నోటీసుతో తన నివాసానికి వచ్చి విచారణ జరపవచ్చని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేశానని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్నానని కేసీఆర్ తన లేఖలో నొక్కి చెప్పారు. ఈ దేశపు బాధ్యతాయుతమైన పౌరుడిగా దర్యాప్తుకు తన పూర్తి సహకారం ఉంటుందని అన్నారు.చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా దర్యాప్తు సంస్థలు అడిగే ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు తాను సిద్ధమని, అయితే అది చట్టం కల్పించే వెసులుబాటు మేరకు తన ఇంట్లోనే జరగాలని ఆయన కోరారు. భవిష్యత్‌లో నోటీసులుఏవైనా ఉంటే తన ఎర్రవల్లి నివాసానికే పంపాలని సూచించారు.

# కోఠి ఏటీఎం లో కాల్పులు..ఆరు లక్షల దోపిడి

**హైదరాబాద్ పెన్ పవర్:** కోఠి ఎస్బిఐ ప్రధాన కార్యాలయం ముందున్న ఏటీఎం వద్ద వ్యక్తిపై కాల్పులు జరిపిన దుండగులు రూ.6 లక్షలు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం డబ్బులు డిపాజిట్ చేయడానికి వచ్చిన రిషద్ అనే వ్యక్తిపై గన్ తో కాల్పులు జరిపారు. వద్ద ఉన్న రూ.6 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనలో రిషద్ కాలికి బులెట్ గాయం అయింది. పోలీసులకు స్పాట్లో రెండు బులెట్స్ లభ్యం అయ్ఆయి. బాధితుడిని ఆసుపత్రికి తరలించి, ఘటనా స్థలంలో సీసీటీవీ ఫుటేజ్ ను పోలీసులు పరిశీలిస్తున్నారు.ఘటనపై ఖైరతాబాద్ జోన్ డిసిపి శిల్పవల్లి వివరణ ఇచ్చారు. కోఠి లోని ఎస్బిఐ ఏటీఎం లో నగదు డిపాజిట్ చేయడానికి బాధితుడు రిషద్ వచ్చారు. రిషద్ డబ్బులు డిపాజిట్ చేయడం పై రెక్కికీ నిర్వహించి దాడి చేసినట్లు తెలుస్తోంది. బాధితుడు నాంపల్లి కి చెందిన బట్టల వ్యాపారి. కాల్పులు జరపడం తో అక్కడే కుప్పకులాడు. ఐదు టీమ్ లతో దుండగులను ,సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా గాలిస్తున్నామని అన్నారు.రిష్షద్ ప్రాణమయం లేనట్లు వైద్యులు నిర్ధారించారు

# వైఎస్ ఫ్యామిలీ లో పాలిటిక్స్ అన్నా, చెల్లెళ్ల పాదయాత్ర





**కడప, జనవరి 31, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం త్వరలో ఒక అరుదైన మరియు అత్యంత ఆసక్తికరమైన ఘట్టానికి వేదిక కాబోతోంది. వైఎస్సార్ వారసత్వ పోటీలో ఉన్న అన్నాచెల్లెళ్లు జగన్ మోహన్ రెడ్డి , వైఎస్ షర్మిల పోటాపోటీగా పాదయాత్రలకు సిద్ధమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పాదయాత్ర అనేది కేవలం ఒక ప్రచారం మాత్రమే కాదు, అది అధికార పీఠాన్ని అధిరోహించడానికి ఒక సెంటిమెంట్ , బలమైన అస్త్రం. గతంలో వైఎస్సార్, ఆ తర్వాత జగన్, షర్మిల , లోకేష్ అందరూ దీని ద్వారానే ప్రజలకు దగ్గరయ్యారు.మరోసారి అధికారం కోసం జగన్ తన పాదయాత్రను ఏడాదిన్నర ముందే ప్రకటించడం వెనుక వ్యూహాత్మక కారణాలు ఉన్నట్లు కనిపిస్తోంది. షర్మిల ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టినప్పటి నుండి వైఎస్సార్ అభిమానులను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. షర్మిల కూడా పాదయాత్రకు సన్నద్ధమవుతున్నారనే సమాచారంతోనే, జగన్ ముందస్తుగా తన యాత్రను ప్రకటించి హైప్ ను తన వైపుకు తిప్పుకోవాలని చూస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.సాధారణంగా ఏదైనా భారీ కార్యక్రమాన్ని ముందుగా ప్రకటిస్తే దానికి ఉండే క్రేజ్ తగ్గుతుంది. అయినప్పటికీ జగన్ ఈ సాహసం చేయడం వెనుక షర్మిల అడుగులను నియంత్రించే ఉద్దేశం ఉండవచ్చని చర్చ జరుగుతోంది. జగన్ యాత్రను ప్రకటించిన తర్వాత షర్మిల కూడా అదే బాట పడితే, ఆమె జగన్‌ను అనుసరిస్తున్నారనే ముద్ర పడే అవకాశం ఉంది. అయితే, షర్మిల ఈ విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. జగన్ ప్రకటించారనే నెపంతో ఆగిపోకుండా, తనదైన శైలిలో ప్రజల్లోకి వెళ్లేందుకు ఆమె ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఒకే సమయంలో అన్నాచెల్లెళ్లు ఇద్దరూ రోడ్లపైకి వస్తే ఏపీ రాజకీయం రెండు గ్రూపులుగా విడిపోయే అవకాశం ఉంది.జగన్ పాదయాత్ర ప్రధానంగా గత ఎన్నికల్లో కోల్పోయిన ప్రజాధారణను తిరిగి సంపాదించుకోవడానికి, అలాగే తన కేడర్‌లో ఉత్సాహం నింపడానికి ఉద్దేశించినది. కానీ షర్మిల వ్యూహం వేరుగా ఉంది. ఆమె జగన్ వైఫల్యాలను ఎండగట్టడమే కాకుండా, నిజమైన వైఎస్సార్ వారసురాలు నేనే అని నిరూపించుకోవాలని చూస్తున్నారు. తాజాగా ఆమె విజయవాడలో జగన్ నైజంపై చేసిన విమర్శలు దీనికి సంకేతం. జగన్ యాత్ర ప్రకటించడంపై ఆమె వేసిన సెటైర్లు చూస్తుంటే, పాదయాత్రలో ఆమె జగన్‌ను మరింత వ్యక్తిగతంగా, రాజకీయంగా ఇరకాటంలో పెట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జగన్ తన పాదయాత్ర ద్వారా తన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేయాలని చూస్తుంటే, షర్మిల మాత్రం ఆ పథకాల అమలులో జరిగిన లోపాలను, జగన్ పాలనలోని లోపాలను ఎత్తిచూపే అవకాశాలు ఉన్నాయి. ఒకప్పుడు జగన్ కోసం షర్మిల పాదయాత్ర చేశారు. జగనన్న వదిలిన బాణాన్ని అని గర్వంగా చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు అదే బాణం జగన్‌ను గురి పెడుతోంది. ఒకే రాష్ట్రంలో, ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు నేతలు, ఒకే లక్ష్యం కోసం వేర్వేరుగా పాదయాత్రలు చేయడం భారత రాజకీయ చరిత్రలో ఒక అరుదైన ఘట్టం కాబోతోంది. వీరిద్దరి మధ్య పోరాటమే రాబోయే ఎన్నికల వరకు ఏపీ రాజకీయాల్లో హైలైట్ కానుంది. ప్రజలు ఎవరికి వారసత్వం కట్టబెడతారో వేచి చూడాలి.

# రాజ్యసభకు బొత్స- అసెంబ్లీకి కుమార్తె



**విజయనగరం, జనవరి 31 పెన్ పవర్:** సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన రాజకీయ వారసత్వాన్ని రంగంలోకి దించుతున్నారు. బొత్స కుమారుడు ఆయన వారసుడిగా వస్తారని అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఆయన కుమార్తె తెరపైకి వచ్చారు. ఇప్పటికే ఆమె తండ్రి వెంట రాజకీయ సమావేశాలకు హాజరవుతున్నారు.బొత్స సత్యనారాయణ.. ఉమ్మడి ఏపీలో కానీడ ఇప్పుడు ప్రస్తుత రాష్ట్రంలో కానీ సీనియర్ రాజకీయ నేతల్లో ఒకరు. ఐదుసార్లు మంత్రిగా పనిచేసిన ఆయన, బొబ్బిలి ఎంపీగా.. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా కూడా ఉన్నారు. ఉత్తరాంధ్ర రాజకీయాలను ప్రభావితం చేసిన బొత్స.. ప్రస్తుతం మండలిలో ప్రతిపక్షనేతగా ఉన్నారు. విజయనగరం జిల్లాను శాసించిన ఆయన మొన్నటి ఎన్నికల్లో చేదు అనుభవం ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటికీ ఆ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బొత్స కుటుంబం ప్రభావితం చేయగలుగుతంది. ఆయన భార్య ఝాన్సీ రెండు సార్లు ఎంపీగా గెలుపొందగా.. సోదరుడు అప్పలనర్సయ్య ఎమ్మెల్యేగా.. తన మేనల్లుడు చిన్న శ్రీను ముఖ్య రాజకీయ నేతగా ఉన్నారు.వైఎస్ మరణం తర్వాత జరిగిన పరిణామాల్లో ముఖ్యమంత్రిగా ఈయన పేరు కూడా పరిగణలోకి తీసుకున్నారు. వైఎస్ హయాం నుంచీ తిరుగులేని నేతగా ఉన్న ఆయన ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో కాస్త నెమ్మదించారు.ప్రస్తుతం ఎమ్మెల్యేగా లేకపోవడం.. మండలి వైపు వెళ్లిపోవడంతో రాజకీయాల్లో తన కుటుంబాన్ని మరింత యాక్టివ్ చేయాలన్న ఉద్దేశ్యంతో ఆయన అనూహ్యంగా తన కుమార్తెను తీసుకొచ్చారు. బొత్స సత్యనారాయణ కుమారుడు సందీప్, కుమార్తె అనూష ఇద్దరూ వైద్యులే. కొంత కాలం తండ్రితో కలిసి రాజకీయాల్లో ఉన్నప్పటికీ సందీప్ అంత చుర్గాగా పాల్గొనలేదు. వైద్య వృత్తి ప్రాక్టీస్ చేస్తున్న ఆయనకు రాజకీయాలపై అంత ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఎంబీబీఎస్ చదివిన అనూష ఈమధ్య తండ్రితో కలిసి రాజకీయ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఇంట్లో జరుగుతున్న ముఖ్య నేతల మీటింగ్‌లకే కాదు.. నియోజకవర్గ కార్యకర్తల సమావేశాలకు కూడా అటెండ్ అవుతున్నారు. మంగళవారం గరివిడిలో జరిగిన వైసీపీ చీపురుపల్లి నియోజకవర్గ సమావేశానికి తండ్రితో కలసి వచ్చారు.బొత్స సత్యనారాయణను రాజ్యసభకు పంపే యోచనలో వైసీపీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అప్పుడు నియోజకవర్గ బాధ్యతలను కుమార్తెకు అప్పగించాలనుకుంటున్నారు. అందుకు ఆమెను ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ మధ్యలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమెను పోటీ చేయిస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. చీపురుపల్లి పరిధిలోని ఓ మండలం నుంచి ఆమె జెడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లా అంతటా టీడీపీ ఎమ్మెల్యేలే ఉండటంతో జెడ్పీ పీఠంపై వైసీపీకి ఆశలు లేవు కానీ.. అసెంబ్లీ ఎన్నికల సమయానికి జెడ్పీటీసీ పనిచేసిన అనుభవం పనికొస్తుందని భావిస్తున్నారు.

# తెలుగు తమ్ముళ్ల మధ్య తగవులు పాత నేతలు వర్సెస్ కొత్త లీడర్లు

**విజయవాడ, జనవరి 31, పెన్ పవర్:** తెలుగుదేశం తన చరిత్రలోనే ఎన్నడూ లేని రీతిలో అత్యధిక సీట్లను సాధించి ఏపీలో మళ్లీ అధికారంలోకి వచ్చింది. ప్రత్యర్థి వైసీపీను నేలకరిపించడమే కాదు.. కేంద్రంలోనూ అనుకూల వాతావరణం రావడంతో ఆ పార్టీ ఎప్పుడూ లేనంత స్ట్రాంగ్‌గా ఉంది. కానీ పార్టీ కార్యకర్తల్లో ఎక్కడో ఆవేదన.. సీనియర్లలో ఎందుకో అసంతృప్తి. ఆత్మగౌరవ నినాదానికి ప్రతిరూపమైన తెలుగుదేశం సోల్.. దెబ్బతింటోందా.. అన్న ఆలోచన కల్ట్ తెలుగుదేశం అభిమానుల్లో కలుగుతోంది.తెలుగుదేశండ అత్యంత విజయవంతమైన, దేశంలోని అతిపెద్ద రీజనల్ పార్టీ. 44 ఏళ్ల క్రితం ప్రారంభమైన తెలుగుదేశానికి కార్యకర్తలే అసలైన బలం. సైద్ధాంతిక పునాదులతో నిర్మితమైన ఆ పార్టీ కాలానుగుణంగా వస్తున్న మార్పులతో సతమతమవుతోందా అనిపిస్తోంది. కొత్త లీడర్ల ప్రవేశం.. ఇతర పార్టీ నేతల సాంగత్యం.. నేతల్లో తగ్గిపోతున్న ఎమోషన్.. ఇవన్నీ కార్యకర్తలకు కాస్త కష్టం కలిగిస్తున్నట్లుగానే ఉంది. పార్టీలోనే కొందరి సీనియర్ నేతల సణుగుళ్లు కూడా అందుకు నిదర్శనమే..!తెలుగుదేశం అనేది బలమైన భావోద్వేగాలతో నిర్మితమైన ప్రాంతీయ పార్టీ.. కార్యకర్తల్లో ఉద్వేగం.. అంకిత భావం ఎక్కువ. వ్యక్తుల కంటే పార్టీ ఎక్కువ అనే ఫీలింగ్ ఆ పార్టీకి ఇంధనం. అందుకే ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకుంది. నాలుగు సార్లు ఎన్నికల్లో ఓడిపోయినా ఇంకా నిలబడగలిగింది. అయితే కాలానుగుణంగా వస్తున్న మార్పులు పార్టీ కట్టును తప్పిస్తున్నాయా అనిపిస్తోంది. ముఖ్యంగా ఈసారి ఎన్నికల తర్వాత తెలుగుదేశంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా బయటపార్టీల నుంచి తీసుకున్న నాయకుల వల్లనైతేనేమీ.. తెలుగుదేశంలో పైస్థాయి నాయకత్వం నుంచీ కిందిస్థాయి వరకూ కాలక్రమేణా జరిగిన నాయకత్వ మార్పుల వల్లనైతే నేమీ ఒకప్పటి గాఢత తగ్గిందనేది వాస్తవం.కోర్ తెలుగుదేశానికి అధికారంలో భాగస్వామ్యం దక్కడం లేదనడానికి ఓ చిన్న ఎగ్జాంపుల్ మంత్రివర్గ కూర్పే. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి మినహా.. 24మంది మంత్రులు ఉన్నారు. వీరిలో మిత్రపక్షాలకు చెందిన నలుగురూ కొత్తమంత్రులే. వారని మినహాయిస్తే.. మిగిలిన 20మంది మంత్రుల్లో పాతవారు కేవలం ఆరుగురు. అంటే మిగిలిన 14మంది కొత్తవారే. ఇందులో ఇతర పార్టీల్లోకి వెళ్లొచ్చిన వాళ్లు.. యాక్టివ్‌గా లేని వాళ్లు ఉండటం తెలుగుదేశం కార్యకర్తలకు అప్పుడే నచ్చలేదు. కొత్త నాయకత్వం పేరుతో పార్టీ ఐచీూను ఏమాత్రం అర్థం చేసుకోని వారికి అప్పగించారనే విమర్శలున్నాయి. ఇక కొంతమంది మంత్రులు “ఏ కోటాలో” మంత్రి పదవి దక్కించుకున్నారో తెలీదు కానీ .. అసలు వాళ్లకి పార్టీతో కిందిస్థాయిలో కనెక్షన్ లేదు.పార్టీని కాపాడటానికో.. లేక ఆర్థిక పరిపుష్టి కలిగించడానికో.. లేక ప్రత్యర్థి పార్టీని బలహీనపరచాలన్న లక్ష్యంతోనో కొన్ని నిర్ణయాలు జరిగాయి. వీటివల్ల తెలుగుదేశంలో ఎప్పటి నుంచో ఉన్న సీనియర్లు పక్కకు తప్పుకోవలసి వచ్చింది. పార్టీ అధికారంలోకి వచ్చినా.. తాము గెలిచినా కూడా కొంతమంది పార్టీ నేతలు ‘త్యాగం’ చేయాల్సి వచ్చింది. చాలా నియోజకవర్గాల్లో పొత్తుల వల్ల అడ్జెస్ట్‌మెంట్‌లు, బయట నుంచి తీసుకున్న వారి వల్ల కలిగిన ఇబ్బందులు ఇలా అనేక రూపాల్లో కొన్నాళ్లుగా ప్రతిస్పందనలు వస్తూనే ఉన్నాయి.తెలుగుదేశంలో పార్టీని ఓన్ చేసుకుని ఉ పార్టీ లైన్‌పై చాలా కచ్చితంగా ఉండే నేతలు కొంతమంది ఉన్నారు. అయ్యన్నపాత్రుడు పార్టీ అధికారంలో లేనప్పుడు.. తన వాయిస్‌ను బలంగా వినిపించారు. ఇతర పార్టీల నేతలకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని అంతగా ఇష్టపడరు. ఈ మధ్య ఆయన కుమారుడు కూడా నేరుగా ఇలాగే మాట్లాడారు. “వైసీపీ వాళ్లకి వంగి దండాలు పెట్టాల్సిన ఖర్మ లేదన్నారు..” టీడీపీలో మరో నేత చింతమనేని ప్రభాకర్ ఫైర్‌బ్రాండ్. పార్టీ లైన్ విషయంలో పక్కాగా ఉంటారు. ఆయనకు కూడా ఏలూరు జిల్లాలో సమస్యలు వచ్చాయి. మంత్రి పార్థసారథి కొంతమంది వైసీపీ నేతలను పార్టీలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారంటూ చిరాకుపడ్డారు. పార్టీ పుట్టినప్పటి నుంచీ ఉన్న వాళ్లలో ఇప్పటికీ కొనసాగుతున్న వారిలో అయ్యన్న, బుచ్చయ్య చౌదరి ఉన్నారు. వయసు మీద పడుతున్నా తనకు మంత్రి పదవి రాకపోవడంపై బుచ్చయ్య చాలా సార్లు ఆవేదన చెంది.. ఇక తనకు రాదని డిసైడై పార్టీలో స్తబ్దుగా ఉంటున్నారు. అయితే ఆయన కూడా ఈమధ్య కొంతమంది “జూనియర్లు” తనకే సలహాలు ఇస్తున్నారంటూ చిటపటలాడారు. పార్టీ పుట్టినప్పటి నుంచీ ఉన్న మరో నేత యనమల కూడా సైడ్‌లైన్ అయిపోయారు. ఆయన కూడా అప్పడప్పుడూ కనిపించీ.. కనిపించనట్లు అసంతృప్తి బయటపెడుతూనే ఉంటారుతెలుగుదేశం అధికారంలో ఉన్నా.. లేకున్నా.. ఆ పార్టీ నాయకత్వం చాలా పటిష్టంగా ఉంటుంది. అధికారంలో ఉన్నప్పుడు దేవేందర్ గౌడ్, ఎర్రన్నాయుడు, యనమల, అయ్యన్న వంటి సీనియర్లు పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు. 2004–14 ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. పయ్యావుల, ధూళిపాళ్ల, దేవినేని రేవంత్ రెడ్డి లాంటి వాళ్లు పార్టీకి స్ట్రైకింగ్ ఫోర్సుగా ఉండేవారు. కానీ 2014 నుంచే పార్టీ ఫంక్షనింగ్‌లో చాలా మార్పులు వచ్చాయి. సీనియర్లు పార్టీని డిఫెండ్ చేయడం మానేశారు. మంత్రి పదవి రావడం లేదన్న అసంతృప్తి వల్ల ధూళిపాళ్ల రాష్ట్ర కార్యాలయానికి రావడమే మానేశారు. తనను పక్కన పెట్టారని దేవినేని కూడా అంతంత మాత్రంగానే ఉన్నారు. ప్రత్యర్థి పార్టీ నుంచి ఏదైనా విమర్శ వస్తే.. ఇప్పుడు పార్టీ తరపున మాట్లాడటానికి వంగలపూడి అనిత తప్ప ఎవరూ లేరు. ఇంకా ఎంత దైన్యస్థితి అంటే ఏదైనా మంత్రిత్వ శాఖకు సంబంధించిన విషయాలపై ఆరోపణలు వస్తే.. అన్నింటికీ చంద్రబాబో.. లోకేషో ఆన్సర్ చేసుకోవాలి తప్పితే.. ఆ మంత్రుల జాడ ఉండదు.ఇలాంటి పరిణామాలతో పార్టీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. లీడర్ల కన్నా పార్టీనే నమ్మే కార్యకర్తలు తెలుగుదేశంలో ఎక్కువగానే ఉంటారు. అలా పార్టీతో మమేకం అయిన స్థానిక నాయకత్వంతో వాళ్లు కలవగలుగుతారు కానీ.. మిక్సిడ్ కల్చర్ వాళ్లకు కాస్త ఇబ్బందిగానే ఉంది. ఇంక కొన్ని చోట్ల అయితే పార్టీని పూర్తిగా గాలికొదిలేసి సంపాదించడమే టార్గెట్ గా ఉన్న ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు.

## ఉపఎన్నికల దిశగా అడుగులు

**విజయవాడ, జనవరి 31 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ప్రస్తుతం తీవ్ర ఉత్కంఠతో సాగుతున్నాయి. అధికార కూటమి ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసీపీకి మధ్య పోరు రోజురోజుకూ మరింత కఠినంగా మారుతోంది. గత దాదాపు ఇరవై నెలలుగా రాష్ట్ర అసెంబ్లీకి వైసీపీ సభ్యులు హాజరు కావడం లేదు. దీనిని అధికార పార్టీలు ఒక రకమైన అసెంబ్లీ బహిష్కరణగా అభివర్ణిస్తున్నాయి. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లోనే కాక ప్రజల్లో కూడా పెద్ద చర్చకు దారి తీసింది. ఒకవైపు వైసీపీ తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా, మరోవైపు సభకు రాని పార్టీకి ఆ హక్కు ఎలా ఇస్తారని కూటమి ప్రభుత్వం ప్రశ్నిస్తోంది.నిబంధనల ప్రకారం అసెంబ్లీ సభ్యుడు అరవై పని దినాలు సభకు హాజరు కాకపోతే అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరగబోయే బడ్జెట్ సమావేశాలు కీలకంగా మారాయి. ఈ సమావేశాలతో అరవై పని దినాల సంఖ్య పూర్తవుతుందని, అప్పుడు వైసీపీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే ప్రక్రియను కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ), జనసేన పార్టీ , బీజేపీ ( కలిసిన కూటమి దీనిపై గట్టిగా ఆలోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.ఒకవేళ వైసీపీ ఎమ్మెల్యేలు అనర్హులైతే ఉప ఎన్నికలు తప్పవు. చట్టప్రకారం ఆరు నెలల లోపు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. అంటే వచ్చే ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలల్లో ఈ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అప్పటికి కూటమి ప్రభుత్వం దాదాపు రెండున్నరేళ్ల పాలనను పూర్తి చేసిన దశలో ఉంటుంది. సాధారణంగా ఈ కాలంలో కొంత మేర యాంటీ ఇన్కంబెన్సీ ప్రభావం కనిపించే అవకాశముంటుంది. అయినప్పటికీ అధికార బలం, ప్రభుత్వ వనరులు కూటమికి పెద్ద అడ్వాంటేజ్‌గా మారతాయని అంచనాలు ఉన్నాయి.మరోవైపు వైసీపీ పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. ఉప ఎన్నికలు వస్తే పార్టీ ఒంటరిగా పోరాడాల్సి ఉంటుంది. పైగా “ఒకసారి గెలిచిన తర్వాత అసెంబ్లీకి రాకుండా ప్రజా సమస్యలను విస్మరించారు” అనే విమర్శలు ప్రచారంలో ప్రధాన అంశంగా మారే అవకాశం ఉంది. ఈ అంశాన్ని కూటమి జనంలోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. దీంతో ఉప ఎన్నికల్లో అధికార పక్షానికే పైచేయి ఉంటుందని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు.వైసీపీ కూడా ఈ పరిస్థితిని తేలిగ్గా తీసుకోవడం లేదని తెలుస్తోంది. అనర్హత వేటు పడితే ఉప ఎన్నికల్లో పార్టీకి ఎంతవరకు మద్దతు ఉంటుందనే అంశంపై అంతర్గతంగా సర్వేలు చేయించిందనే ప్రచారం ఉంది. ఆ సర్వేల్లో గతంలో ఉన్న అన్ని స్థానాలు తిరిగి దక్కే పరిస్థితి లేదన్న అంచనాలు వచ్చినట్టు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఒకవేళ సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గితే అది పార్టీకి దీర్ఘకాలికంగా పెద్ద దెబ్బగా మారే అవకాశం ఉంది.ఈ మొత్తం పరిణామాల మధ్య, కొందరు సీనియర్ రాజకీయ నాయకులు ఒక సూచన చేస్తున్నారు. రాజకీయ భేషజాలను పక్కన పెట్టి అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై చర్చ చేయడమే వైసీపీకి ఉత్తమ మార్గమని వారు అభిప్రాయపడుతున్నారు. అలా చేస్తేనే కూటమి ఎత్తులకు సరైన ప్రత్యుత్తరం ఇవ్వగలుగుతుందని అంటున్నారు. లేకపోతే ఉప ఎన్నికలు జరిగితే కూటమికి నష్టమేమీ లేకుండా, వైసీపీకి మాత్రం ప్రమాదకర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

## ఏపీ భవిష్యత్తును చూపించిన ఆర్థిక సర్వే

**గుంటూరు, జనవరి 31, పెన్ పవర్:** ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన అంశాలు ప్రజల్లో ఆనందాన్ని కలిగిస్తున్నాయి. దేశవ్యాప్తంగా నగరాల అభివృద్ధి, జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులపై చేసిన విశ్లేషణలో ఏపీ నుంచి రెండు నగరాలు టాప్ టెన్ జాబితాలో చోటు దక్కించుకోవడం గర్వకారణంగా మారింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లో ఆర్థిక ప్రగతి స్పష్టంగా కనిపిస్తోందని సర్వే పేర్కొనడం శుభ సూచకంగా భావిస్తున్నారు.ఆర్థిక సర్వే ప్రకారం ఏపీలో తిరుపతి, విజయవాడ ) నగరాలు అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతున్నాయి. జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉండటం, ఉపాధి అవకాశాలు పెరగడం, మౌలిక వసతులు విస్తరించడం వంటి అంశాల ఆధారంగా దేశంలోని ఉత్తమ నగరాల జాబితాను రూపొందించగా, అందులో ఈ రెండు నగరాలు చోటు దక్కించుకోవడం విశేషం. ప్రజలు కలిసి నివసించేందుకు అనుకూలంగా ఉండే నగరాలుగా గుర్తింపు రావడం ఏపీ అభివృద్ధికి నిదర్శనంగా భావిస్తున్నారు.ఇక నగరాల వృద్ధి వేగాన్ని పరిశీలిస్తే, హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరంగా విజయవాడను ఆర్థిక సర్వే గుర్తించింది. ఇది రాష్ట్రానికి మరింత పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భవిష్యత్తు అంచనాల ప్రకారం 2031 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.4 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉండగా, అదే సమయంలో విజయవాడ జీడీపీ 21.3 బిలియన్ డాలర్ల స్థాయికి చేరవచ్చని సర్వే అంచనా వేసింది. ఈ గణాంకాలు తెలుగు ప్రాంతాల ఆర్థిక శక్తిని ప్రతిబింబిస్తున్నాయని చెప్పవచ్చు.రాష్ట్ర రాజధాని అమరావతి గురించి కూడా ఆర్థిక సర్వేలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త నగరాల నిర్మాణం జరుగుతోందని సర్వే వెల్లడించింది. అమరావతిని హరిత నగరంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రణాళికలు అమలు అవుతున్నాయని, దీనివల్ల పర్యావరణ అనుకూల అభివృద్ధికి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొంది. రాజధానిగా అమరావతికి ఉన్న అవకాశాలు రాష్ట్ర భవిష్యత్తుకు కీలకంగా మారనున్నాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.వాణిజ్యం, పరిశ్రమల రంగంలో కూడా ఏపీ ముందంజలో ఉందని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. రాష్ట్రంలో చేపట్టిన వాణిజ్య సంస్కరణలు వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరచాయని పేర్కొంది. సింగిల్ విండో విధానం (అమలుతో పరిశ్రమల ఏర్పాటుకు వేగం పెరిగిందని తెలిపింది. అంతర్జాతీయ స్థాయిలో అతి పెద్ద బల్క్ డ్రగ్ పార్క్ వంటి ప్రాజెక్టులు ఏపీకి రావడం రాష్ట్ర పారిశ్రామిక శక్తిని పెంచిందని సర్వే గుర్తించింది.ద్రవ్యోల్బణం విషయంలో కూడా ఏపీ మంచి ఫలితాలు సాధించినట్లు నివేదిక తెలిపింది. 202324 ఆర్థిక సంవత్సరంలో 7.57 శాతం ఉన్న ద్రవ్యోల్బణ రేటు, 202526 నాటికి 1.39 శాతానికి తగ్గడం ప్రజలకు ఊరట కలిగించే అంశంగా పేర్కొంది. మొత్తం మీద ఈ ఆర్థిక సర్వే ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా స్థిరంగా, భవిష్యత్తు వైపు నమ్మకంగా అడుగులు వేస్తోందని స్పష్టంగా చూపిస్తోంది.

## ఆ నేతలంతా సైలెంట్...

**గుంటూరు, జనవరి 31, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల వైఖరి వింతగా ఉంది. వైసిపి హయాంలో చాలామంది నేతలు దూకుడుగా ఉండేవారు. సీనియర్లు మౌనంగా ఉండగా.. జూనియర్ లు విచ్చలవిడిగా మాట్లాడేవారు. నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేసేవారు. అటువంటి వారంతా ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. కేసుల పరంగా ఇబ్బందులు పడుతున్నారు. జైలుకు వెళ్లిన వారు ఉన్నారు. అయితే ఇలా జైలుకు వెళ్లిన క్రమంలో చాలా రోజులుగా రిమాండ్ ఖైదీలుగా ఉండిపోతున్నారు. అటువంటివారు బెయిల్ పై బయటకు వచ్చే క్రమంలో కూటమి ప్రభుత్వంపై దూకుడుగా మాట్లాడుతున్నారు. తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. వారి దూకుడు చూస్తే ఇక ప్రభుత్వంపై గట్టి పోరాటం చేస్తారని అనుకోవచ్చు. అటు తర్వాత వారు ఎందుకో సైలెంట్ అవుతున్నారు. కనీసం మాట్లాడడం లేదు కూడా. అయితే పార్టీ నుంచి ఆశించిన స్థాయిలో వారికి సాయం దక్కకపోవడంతోనే వారు సైలెంట్ అవుతున్నట్లు తెలుస్తోంది.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా మాజీ ఎంపీ నందిగాం సురేష్ అరెస్టు అయ్యారు. చాలా రోజులు పాటు ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. చివరకు న్యాయస్థానంలో ఆయనకు బెయిల్ దక్కింది. అయితే సురేష్ మాత్రం ప్రభుత్వం పై ఎటువంటి ఘాటు వ్యాఖ్యలు చేయలేదు. బయటకు మాట్లాడింది కూడా చాలా తక్కువ. అయితే అరెస్టు అయిన మిగతా నేతలు కంటే తన విషయంలో అధిష్టానం పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆవేదన ఆయనలో ఉంది. బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత ఆయన చాలా ఇంటర్వ్యూల్లో మాట్లాడారు. అరెస్టయిన తన కుటుంబాన్ని పట్టించుకోలేదన్న ఆవేదన ఆయనలో కనిపించింది. అయితే నందిగాం సురేష్ విషయంలో జగన్ ఆలోచన వేరేలా ఉంది. జగన్మోహన్ రెడ్డి సైతం ఆయనను పట్టించుకోలేదని అర్థమవుతోంది.వల్లభనేని వంశీ మోహన్ చాలా రోజులు రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో టిడిపి నుంచి గెలిచి ఆ పార్టీలోకి ఫిరాయించారు. చంద్రబాబుతో పాటు లోకేష్ లపై విరుచుకుపడ్డారు. అందుకోసమే ఆయనను వైసీపీలో చేర్పించుకున్నారు అన్న రీతిలో విమర్శలు చేసేవారు. దానికి ఇప్పుడు మూల్యం చెల్లించుకున్నారు. జైలులో సుదీర్ఘకాలం రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఆరోగ్యం కూడా ఇబ్బందుల్లో పడింది.. బెయిల్ పై బయటపడిన అనంతరం ఆయన నేరుగా జగన్మోహన్ రెడ్డిని కలుసుకున్నారు. ఇక గన్నవరంలో ఆయన యాక్టివ్ అవుతారని.. ప్రభుత్వంపై మునుపటి మాదిరిగా విరుచుకుపడతారని అంతా భావించారు. కానీ ఆయన మాత్రం హైదరాబాద్కు మాత్రమే పరిమితమయ్యారు. కాకాని గోవర్ధన్ రెడ్డి పరిస్థితి కూడా అలానే ఉంది. బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత కేవలం మీడియా ముందు మాత్రమే ఆయన దూకుడుగా ఉంటున్నారు. మిగతా విషయాల్లో మాత్రం పెద్దగా చూసి చూడనట్టుగా ఉన్నారు.తాజాగా మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి బెయిల్ లభించింది. దీంతో మీడియా ముందుకు వచ్చిన ఆయన తాను జగన్ కోసమే ఇక్కడి నుంచి బతుకుతానని ప్రకటన చేశారు. గతంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విషయంలో కూడా అదే జరిగింది. అయితే ఆయన బయటికి వచ్చిన తర్వాత జగన్మోహన్ రెడ్డిని కలవలేదు. మునుపటి దూకుడు కూడా లేదు. మరోవైపు మాజీ మంత్రులు పేర్ని నాని, అంబటి రాంబాబులు తాము రెడ్ బుక్ కు భయపడలేదని చెబుతున్నారు. కానీ లోకేష్ మాత్రం రెడ్ బుక్ లో మూడు పేజీలు అయ్యాయని.. ఇంకా చాలా పేజీలు ఉన్నాయంటూ స్పష్టం చేశారు. ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో భయం పెంచుతోంది. జైలుకు వెళ్లిన వారు నోరు తెరవడం లేదు. అరెస్టుల భయంతో ఉన్నవారు సైలెంట్ గా ఉంటున్నారు. పేర్ని నాని, అంబటి రాంబాబు లాంటి ఒకరిద్దరు మాత్రమే మాట్లాడుతున్నారు. ముఖ్యంగా జైలుకెళ్లి బయటకు వచ్చిన వారు నోరు తెరవడం లేదు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన సైలెన్స్ కనిపిస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## పాకిస్తాన్‌లో 52 మంది ఉగ్రవాదులు హతం

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్తాన్ భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్స్‌లో 52 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. గడచిన 24 గంటల్లో మూడు ప్రావిన్స్‌లలో పాకిస్తాన్ భద్రతా దళాలు ఆపరేషన్స్ నిర్వహించాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో చేపట్టిన ఆపరేషన్‌లో ఆరుగురు ఉగ్రవాదులు మృతి చెందారు. గురువారం బలూచిస్తాన్‌లో జరిగిన రెండు వేర్వేరు నిఘా ఆధారిత ఆపరేషన్ల (ఐబిఓలు)లో 41 మంది మృతి చెందారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఒక కమాండర్‌తో సహా ఐదుగురు తెహ్రీక్ ఇ-తాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి) బృందానికి చెందిన వ్యక్తులు మృతి చెందారు. లాహోర్ నుండి దాదాపు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రావిన్స్‌లోని మియాన్‌వాలి జిల్లాలో పోలీసులు, ఇతర అధికారుల కార్యాలయాలయాలపై ఉగ్రవాదులు దాడికి సిద్ధమైనట్లు పోలీసుల ఉగ్రవాద నిరోధక విభాగం తెలిపింది. అలాగే ఛాప్రి డ్యామ్ ప్రాంతంలో ఉగ్రవాద నిరోధక బృందానికి, ఉగ్రవాదులకు జరిపిన ఎదురుకాల్పుల్లో మరో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదుల్ని హతమార్చడానికి పోలీసులు, సైనిక భద్రతా దళాలు ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాయి.

## అమెరికాలో మళ్లీ షట్ డౌన్ ..!

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ అయింది. 2026 బడ్జెట్ ఆమోదానికి విధించిన గడువు అర్ధరాత్రితో ముగియడంతో ప్రభుత్వ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోనున్నట్లు అంతర్జాతీయ మీడియా శనివారం వెల్లడించింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ సర్కార్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించడంలో కాంగ్రెస్ విఫలం కావడంతో ప్రభుత్వం మరోసారి షట్ డౌన్ లోకి వెళ్లిపోయింది. 2026 సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఆమోదించడానికి అర్ధరాత్రి వరకూ గడువు ఉన్నా.. ఆ లోపు దాన్ని కాంగ్రెస్ ఆమోదించలేకపోయింది. ఈ నేపథ్యంలో నిర్ణీత గడువును కాంగ్రెస్ దాటవేయడంతో ప్రభుత్వం ఈరోజు పాక్షికంగా షట్ డౌన్ అయింది. దీంతో పలు సేవలు నిలిచిపోబోతున్నాయి. షట్‌డౌన్ స్వల్పకాలికంగా ఉండవచ్చని సెనేటర్లు చెబుతున్నారు. మరోవైపు గడువుకు ముందు బడ్జెట్ పై ఎలాంటి ఒప్పందం కుదరకపోవడంతో, తాత్కాలిక లేదా పూర్తి-సంవత్సర నిధుల చర్యను కాంగ్రెస్ ఆమోదించే వరకు కీలకం కాని పలు ప్రభుత్వ కార్యకలాపాల్ని నిలిపేస్తున్నారు. సభ తిరిగి సమావేశం అయ్యాక సెనేట్ మద్దతు ఉన్న ఒప్పందాన్ని ఆమోదించడానికి తగినంత మద్దతును కూడగట్టడానికి చట్టసభ సభ్యులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ?. అమెరికాలో దాదాపు మూడో వంతు ప్రభుత్వ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, రక్షణను నిర్వహించే అనేక ఏజెన్సీలలో షట్‌డౌన్ చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ విభాగాలు రాత్రికి రాత్రే షట్‌డౌన్ ప్రణాళికలను అమలు చేయడం ప్రారంభించాలని భావించాయి. కానీ ఇది తాత్కాలికమేనన్న అంచనాలతో ఆ ప్రతిపాదన విరమించుకున్నాయి. వచ్చే వారం ప్రారంభంలో కాంగ్రెస్ ఊహించిన విధంగా ప్యాకేజీని ఆమోదిస్తే, కొన్ని రోజుల్లో నిధుల పునరుద్ధరణ ఉంటుందని అంచనా వేస్తున్నారు. షట్‌డౌన్ కొనసాగితే మాత్రం పదివేల మంది ప్రభుత్వ కార్మికులు జీతం లేని సెలవును ఎదుర్కోవలసి రావచ్చు, లేదా నిధులు అందేవరకు జీతం లేకుండా పని చేయాల్సి రావచ్చు.

## క్యూబాకు చమురు ఇస్తే టారిఫ్‌లు !




**హైదరాబాద్ పెన్ పవర్:** క్యూబాకు చమురును విక్రయించే లేదా అందించే దేశాల నుండి వచ్చే ఉత్పత్తులపై టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఇప్పటికే తీవ్రమైన ఇంధన సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న క్యూబాను ఈ చర్య మరింత ఇబ్బందుల్లోకి నెడుతుంది.
ఈ ఆదేశాలు ప్రాథమికంగా మెక్సికోపై ఒత్తిడిని పెంచుతాయి. ప్రస్తుతం క్యూబాకు చమురు జీవనాడిగా మెక్సికో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అలాగే క్యూబాకు నిరంతరంగా సంఘీభావాన్ని కూడా ప్రదర్శిస్తూ వస్తోంది. క్యూబాను ఉక్కిరి బిక్కిరి చేయడానికి ప్రయత్నిస్తున్నారా అని ఒక విలేకరి ట్రంప్‌ను ప్రశ్నించగా, అది చాలా కఠినమైన పదమని వ్యాఖ్యానించారు. 'నేను అలా ప్రయత్నించడం లేదు, కానీ మనుగడ సాగించేలా అది కనిపించడం లేదు.' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా ట్రంప్ ఉత్తర్వులను క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తీవ్రంగా ఖండించారు. క్యూబాపై, క్యూబన్లపై తీవ్రమైన దురాక్రమణ చర్య అని వ్యాఖ్యానించారు. క్యూబాకు సంఘీభావంగా నిలిచే దేశాలను బ్లాక్‌మెయిల్ చేసే చర్యలకు ట్రంప్ పాల్పడుతున్నారని విమర్శించారు. గురువారం ఉదయం మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షబ్నంతో ట్రంప్ ఫోన్లో మాట్లాడారు. కాగా తాము క్యూబాపై చర్చలు జరపలేదని ఆమె చెప్పారు.

## గాజాలో సిబ్బందిని తొలగించిన యుఎన్ఆర్‌డబ్ల్యుఎ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్థిక సంక్షోభంతో 'ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ)' గాజాలో పలువురు ఉద్యోగులను తొలగించింది. 2026 బడ్జెట్‌లో 220మిలియన్ డాలర్ల లోటు ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. దీంతో గాజాలోని స్థానిక సిబ్బందికి ఈ నెల 20శాతం వేతనంలో కోత విధించనున్నట్లు ప్రకటించింది. పనిగంటలను తగ్గించడంతో పాటు ఈ ప్రాంతం వెలుపల ఉన్న ఉద్యోగుల కోసం ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. ఆర్థికలోటు తమ సిబ్బందికి చెల్లింపుల నుండి ప్రతికూల పరిస్థితుల్లో శరణార్థులకు మానవసేవలను కొనసాగించడం వరకు సంస్థ కీలకమైన ప్రాథమిక బాధ్యతలను నెరవేర్చడంలో తమ సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని సిబ్బందికి రాసిన లేఖలో కమిషనర్ జనరల్ ఫిలిప్పె లాజారిని పేర్కొన్నారు. తమ సిబ్బందిపై ఇజ్రాయిల్ ఆరోపణల తర్వాత పలు దేశాలు సంస్థకు నిధులను స్తంభింపచేశాయని, అంతర్జాతీయ సాయంలో భారీగా కోత విధించడంతో ఆర్థిక లోటు ఏర్పడిందని తెలిపారు. యుఎన్ఆర్‌డబ్ల్యుఎ పాలస్తీనా శరణార్థులకు అత్యవసర సేవలను అందిస్తుంది. 70శాతం జనాభాకు విద్య, ఆరోగ్య భద్రత, సామాజిక సాయం అందించడంతో పాటు ఇజ్రాయిల్ దాడులు, సరిహద్దు ఆంక్షలు వంటి కీలక సమయాల్లో స్థిరీకరణ శక్తిగా కూడా పనిచేస్తుంది.

## అప్పులు అడగటం సిగ్గుగా అనిపించింది: పాక్ ప్రధాని వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీనినుంచి బయటపడేందుకు మిత్ర దేశాల వద్దకు వెళ్లి మరీ రుణాలు అడగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫే అంగీకరించారు. అప్పులు అడగటం తనకు సిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులు, వ్యాపారులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ (ంబతిఎ ఓబీనితితీ)తో కలిసి నేను రహస్యంగా చాలా దేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగాము. ఆ సమయంలో మాకు చాలా సిగ్గుగా అనిపించింది. రుణాలు తీసుకోవడం ఆత్మగౌరవానికి పెద్ద దెబ్బ. డబ్బులు ఇచ్చేవారు ఏం డిమాండు చేసినా సరే.. అడ్డు చెప్పలేని పరిస్థితి ఉంటుంది' అని షరీఫ్ అన్నారు. అయితే రుణాలు ఇచ్చే విషయంలో చాలా దేశాలు తమను నిరాశ పరచలేదన్నారు. పరిస్థితులతో సంబంధం లేకుండా పాక్‌కు మద్దతుగా నిలిచిన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, చైనా వంటి మిత్ర దేశాలన్నింటికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోవడంపై షరీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. పాక్‌కు ఆర్థికసాయం అందించిన దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉంది.

# స్మగ్లింగ్ నిరోధంలో తీరరక్షణ దళం పాత్ర కీలకం

**హైదరాబాద్ పెన్ పవర్:** 1977 ఫిబ్రవరి 1వ తేదీ భారత తీర రక్షణదళం ఉనికిలోకి వచ్చిన దినం. భారత తీర రక్షణ దళం.. నావికాదళం, మత్స్య శాఖ, రెవెన్యూ శాఖ (కస్టమ్స్), కేంద్ర, రాష్ట్ర పోలీసు దళాల సహకారంతో పని చేస్తుంది. 1960లలో స్మగ్లింగ్ కార్యకలాపాలు ఎక్కువ అవటం కారణంగా కస్టమ్స్ శాఖ వారికి... తీర గస్తీకి నౌక దళం అవసరం ఏర్పడింది. స్మగ్లింగ్ నిరోధక ప్రయత్నంలో పెట్రోలింగ్ సహాయం కోసం భారత కస్టమ్స్ విభాగం తరచూ భారత నావికాదళాన్ని పిలిపించేది. క్రమంగా భారతీయ ప్రభుత్వం నౌక, వైమానిక దళ అధికారులతో సమితిని ఏర్పాటు చేసింది. భారత తీర రక్షణ దళ స్థాపన కోసం భారత నావికాదళం మొదట దేశానికి సైనిక రహిత సముద్ర సేవలను అందించడానికి ప్రతిపాదించింది. సమస్యను అధ్యయనం చేయడానికి భారత నావికాదళం, భారత వైమానిక దళం భాగస్వామ్యంతో నాగ్‌చౌధురి కమిటీని ఏర్పాటు చేశారు. ఆగష్టు 1971 లో, భారతదేశం లోని విస్తారమైన తీర ప్రాంతంలో పెట్రోలింగ్ చేయవలసిన అవసరాన్ని కమిటీ గుర్తించింది. అక్రమ కార్యకలాపాలను గుర్తించడానికి ఆఫ్‌షోర్ ఫిషింగ్ ఓడల రిజిస్ట్రీని ఏర్పాటు చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాలలో నిమగ్నమైన ఓడలను అడ్డగించడానికి సమర్థవంతమైన, సుసంపన్నమైన రక్షణ శక్తిని ఏర్పాటు చేసింది. ఆ సేవలను అందించడానికి అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది సంఖ్య, స్వభావాన్ని కూడా కమిటీ పరిశీలించింది. 1973 నాటికి, భారతదేశం పరికరాలను సంపాదించడానికి ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం నిబంధనల ప్రకారం, స్మగ్లింగ్ నిరోధక మరియు చట్ట అమలు పనుల కోసం భారత నావికా దళానికి చెందిన సిబ్బందిని నియమించడం ప్రారంభించింది. అప్పటి నావికాదళ సిబ్బంది చీఫ్ అడ్మిరల్ సౌరేంద్ర నాథ్ కోహ్లీ రక్షణ కార్యదర్శికి ఒక సిఫారసు చేసారు. రక్షణ విధులను చేపట్టడానికి ప్రత్యేక సముద్ర సేవ ఆవశ్యకతను, దాని స్థాపనలో నేవీ సహాయాన్ని అందించాల్సిన అవసరాన్ని వివరించారు. అడ్మిరల్ కోహ్లీ సిఫారసుపై, రక్షణ కార్యదర్శి 1974 ఆగస్టు 31 న కేబినెట్ కార్యదర్శికి నోట్ సమర్పించారు. పర్యవసానంగా, 1974 సెప్టెంబరులో, భారత మంత్రివర్గం ఖుస్రో ఫరాముర్జ్ రుస్తాంజీ అధ్యక్షతన రుస్తాంజీ కమిటీని ఏర్పాటు చేసింది. నేవీ, వైమానిక దళం, రెవెన్యూ శాఖల భాగస్వామ్యంతో భద్రత మరియు చట్ట అమలులో అంతరాలను పరిశీలించడానికి భారత నావికాదళం, కేంద్ర మరియు రాష్ట్ర పోలీసు దళాలు, బొంబాయి హై నుండి చమురు ఆవిష్కరణ సముద్ర చట్ట అమలు మరియు రక్షణ సేవ యొక్క అవసరాన్ని మరింత నొక్కి చెప్పింది. ఈ కమిటీ 31 జూలై 1975 న రక్షణ మంత్రిత్వ శాఖలో ఇండియన్ కోస్ట్ గార్డ్ ఏర్పాటుకు సిఫారసు చేసింది. కేబినెట్ కార్యదర్శి ఈ సేవను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్రింద ఉంచాలని సిఫారసు చేశారు. అప్పుడు ప్రధాని ఇందిరా గాంధీ కేబినెట్ కార్యదర్శిని తప్పుపట్టి, ఈ సేవను రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద ఉంచడానికి రుస్తాంజీ కమిటీ అసలు సిఫార్సును అంగీకరించాలని నిర్ణయించు కున్నారు. 1 ఫిబ్రవరి 1977 న తాత్కాలిక ఇండియన్ కోస్ట్ గార్డ్ అమలు లోనికి వచ్చింది. ఇందులో రెండు చిన్న కొర్వెట్టలు మరియు ఐదు పెట్రోల్ బోట్లు నేవీ నుండి బదిలీ చేయబడ్డాయి.కోస్ట్ గార్డ్ చట్టంలో రక్షణ దళం విధులు అధికారికంగా నిర్వచించ బడ్డాయి, దీనిని భారత పార్లమెంట్ 18 ఆగస్టు 1978 న ఆమోదించింది. తద్వారా వెంటనే అమలులోకి వచ్చింది. భారత నావికా దళానికి చెందిన వైస్ అడ్మిరల్ వి.ఎ.కామత్‌ను వ్యవస్థాపక డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. సేవ ప్రారంభోత్సవంలో ప్రధాని మొరార్జీ దేశాయ్ గార్డ్ ఆఫ్ ఆనర్ ను పరిశీలించారు. వైస్ అడ్మిరల్ కామత్ 1984 నాటికి ఐసిజిని శక్తివంతమైన శక్తిగా అభివృద్ధి చేయటానికి ఐదేళ్ల ప్రణాళికను ప్రతిపాదించాడు, కాని ఆర్థిక వనరుల సంక్షోభం కారణంగా ఈ ప్రణాళిక పూర్తి లక్ష్యం నెరవేరలేదు. ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారికంగా 18 ఆగస్టు 1978 న భారత పార్లమెంట్ యొక్క కోస్ట్ గార్డ్ చట్టం, 1978 చేత స్థాపించ బడింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) ఒక ప్రత్యేక సముద్ర నేవీ చట్టం కలిగి ఉంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఏజెన్సీ. రక్షణ మంత్రిత్వ శాఖ క్రింద పనిచేస్తుంది. ఇది భారతదేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షిస్తుంది, సముద్ర చట్టాన్ని అమలు చేస్తుంది. ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐ.సి.జి) ప్రపంచం లోని ఇతర కోస్ట్‌గార్డ్‌తో కలిసి సమన్వయంతో పని చేస్తుంది. మే 2005లో, పాకిస్తాన్ మారిటైమ్ సెక్యూరిటీ ఏజెన్సీ (పిఎంఎస్ఎ) తో సంబంధాలు ఏర్పరచు కోవడానికి ఐసిజి అంగీకరించింది. 2006 లో, ఇండియన్ కోస్ట్ గార్డ్ తన జపనీస్, కొరియన్ సహచరులతో కలిసి కార్యకలాపాలు నిర్వహించింది. 2008 ముంబై దాడుల తరువాత, భారత ప్రభుత్వం ఐసిజి ఫోర్స్, ఆస్తులు, మౌలిక సదుపాయాలను విస్తరించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇండియన్ కోస్ట్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ కోస్టల్ కమాండ్ తీర భద్రతకు సంబంధించిన అన్ని విషయాలలో కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయానికి బాధ్యత వహిస్తారు. కృత్రిమ ద్వీపాల రక్షణ, సముద్రంలో మత్స్యకారులు, నావికులకు రక్షణ, సహాయం, కాలుష్య నియంత్రణతో సహా సముద్ర పర్యావరణం, పర్యావరణ పరిరక్షణ, తీరం గురించి శాస్త్రీయ సమాచార సేకరణ, స్మగ్లింగ్ నిరోధక చర్యలలో కస్టమ్స్ శాఖ, ఇతర అధికారులకు సహాయం, రక్షణ, ప్రాదేశిక మరియు అంతర్జాతీయ జలాల్లో చట్ట అమలు, తదితర కార్యమాలను నిర్వహిస్తుంది.

# గ్రామీణ ఉపాధి హామీకి మద్దతుగా



**హైదరాబాద్ పెన్ పవర్:** అండమాన్ నికోబార్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ)కి మద్దతుగా అండమాన్ నికోబార్ దీవుల్లో సిపిఎం ఇంటింటి ప్రచారం శుక్రవారం ప్రారంభమయింది. ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకాన్ని నీరుగార్చడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్న చర్యలకు వ్యతిరేకంగా గాంధీ వర్ధంతి నుంచి వారం రోజుల పాటు ప్రచారం నిర్వహించాలని సిపిఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఇది ప్రారంభమయింది. ఈ ప్రచారంలో భాగంగా కేంద్రపాలిత ప్రాంతంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న ఎంజిఎన్ఆర్ఇజిఎ పనుల్లో పాల్గొంటున్న జాబ్-కార్డు హోల్డర్లు, వ్యవసాయ కార్మికుల ఇళ్లను సిపిఎం నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. రాష్ట్ర కార్యదర్శి డి. అయ్యప్పన్, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు గౌరంగ మాఝి, దక్షిణ అండమాన్ గ్రామీణ ప్రాంత కమిటీ సభ్యులు ఎస్ చిదంబరం తదితర నాయకులతో కూడిన బృందాలు ఈ సందర్శనలో పాల్గొన్నాయి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఈ పథకాన్ని ఎలా నీరుగారుస్తోందో వివరించాయి. ఎంజిఎన్ఆర్ఇజిఎను రద్దు చేసి, దాని స్థానంలో విబిజిఆర్ఎఎంజిని తీసుకుని రావడం ద్వారా గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని సిపిఎం నాయకులు వివరించచారు. మధ్య అండమాన్‌లో జరిగిన ప్రచారానికి సిపిఎం రాష్ట్ర సెక్రటరియట్ సభ్యులు ప్రోజిత్ కుమార్ సర్కార్, పికె ఖలిద్ నేతృత్వం వహించారు. ఉర్మిళాపూర్, బకుల్తల గ్రామ పంచాయితీ ప్రాంతాల్లో ప్రోజిత్ కుమార్ సర్కార్, ఇతర నాయకులు ప్రచారం నిర్వహించగా, శివపురం గ్రామ పంచాయితీ ప్రాంతంలో పిక్ ఖలీద్, ఇతర నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కేంద్రపాలిత ప్రాంతంలో ఫిబ్రవరి 5 వరకూ ఈ ఇంటింటి ప్రచారం జరగనుందని సిపిఎం నాయకులు తెలిపారు.

# అస్సాం సిఎం బిశ్వశర్మపై ఫిర్యాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగాలీ ముస్లింలను ఉద్దేశిస్తూ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేసిన వివాదాస్పద 'మియా ముస్లిం' వ్యాఖ్యపై తీవ్ర దుమారం రేగుతోంది. ఆయనపై రచయిత హర్ష్ మందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 196, 197, 299, 302, 353 సెక్షన్లతో పాటు భారతీయ న్యాయ సంహితలోని నిబంధనల కింద బిశ్వశర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. రాష్ట్రంలో సర్ ప్రక్రియ కొనసాగుతున్నందున భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయకుండా ముఖ్యమంత్రిని నిరోధించాలని, ఆయన చేసిన విద్వేషపూరిత, వివక్షాపూరిత వ్యాఖ్యలపై దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని హజ్ కాస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని మందర్ ఓ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. తిన్‌సుకియా జిల్లా దిగ్బరులో మంగళవారం జరిగిన అధికారిక కార్యక్రమంలో బిశ్వశర్మ మాట్లాడుతూ బెంగాలీ ముస్లింలను 'మియా'లుగా అభివర్ణించారు. వారిపై వేధింపులు, వివక్షను ప్రోత్సహించేలా ప్రకటనలు చేశారు. ఓటర్ల జాబితా నుంచి ముస్లింల పేర్లను తొలగించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా ముస్లింలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు చేయాలని, అభ్యంతరాలు తెలపాలని బిజెపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మియాలు ఇబ్బంది పడేలా చూడడమే తన పని అని చెప్పారు. వారిని ఇబ్బంది పెడుతుంటే అస్సాంను వదిలేసి వెళ్లిపోతారని అన్నారు. గతంలో కూడా బిశ్వశర్మ అనేక వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## ఒక్కసారిగా కుప్పకూలిన గని.. 200 మంది మృతి!



**హైదరాబాద్ పెన్ పవర్:** తూర్పు కాంగో రుబాయా ప్రాంతంలోని ఓ అనీశ్రీబిజీని మైన్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. గని ఒక్కసారిగా కూలిపోవడంతో 200 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌లో వాడే ఈ లోహం కోసం అక్కడ మైనింగ్ జరుగుతోంది. రెబల్స్ కంట్రోల్‌లో ఉన్న ఈ గనుల్లో సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఘటనలో ప్రాణనష్టం ఎక్కువగా ఉండటం అందరినీ కలచివేస్తోంది.గని కూలిన సమయంలో అక్కడ కార్మికులు, పిల్లలు, మహిళలు మట్టిలో కూరుకుపోయారు. కొంతమంది గాయాలతో బయటపడగా వెంటనే వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా నేల బలహీనపడి, గని ఒక్కసారిగా కుప్పకూలిందని అధికారులు చెబుతున్నారు. కోల్టన్ వంటి ఖనిజాల కోసం ఇల్లీగల్ గా జరిపే తవ్వకాలు ఈ ప్రమాదానికి కారణం అంటున్నారు. ఉత్తర కివు ప్రాంతంలోని రుబయా నగరం కోల్టన్ ఉత్పత్తికి ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

# నెలసరి పరిశుభ్రత ప్రాథమిక హక్కే



**హైదరాబాద్ పెన్ పవర్:** చదువుకునే అవకాశం అందరికీ కల్పించే విద్యాహక్కు, లింగసమానత్వ హక్కు, జీవన హక్కు కోవలోనే... మహిళలు, బాలికలకు నెలసరి శుభ్రత కూడా ప్రాథమిక హక్కేనంటూ సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, పాఠశాలలకు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం శుక్రవారం పలు ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థినులకు పర్యావరణహితమైన రుతు రుమాళ్లు (శానిటరీ న్యాప్కిన్స్)ను ఉచితంగా అందించాలని తెలిపింది. అందరికీ కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని, శుభ్రమైన టాయిలెట్లను బాలికలకు, బాలురకు, దివ్యాంగులకు విడివిడిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేస్తూ 126 పేజీల తీర్పు వెలువరించింది. 'ఈ తీర్పు న్యాయవ్యవస్థలో భాగమైన వారి కోసం మాత్రమే కాదు. సహాయం అడిగేందుకు సంకోచించే విద్యార్థినులు, నిధుల కొరత కారణంగా సహాయం చేయలేని స్థితిలో ఉన్న ఉపాధ్యాయుల కోసం కూడా' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ ఆదేశాలను పాటించాలని స్పష్టం చేసింది. బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయకపోతే ప్రైవేటు పాఠశాలలు గుర్తింపు కోల్పోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. రుతుక్రమ ఆరోగ్య హక్కు అనేది రాజ్యాంగంలోని అధికరణం 21 కిందకు వచ్చే జీవన హక్కులో భాగమని వ్యాఖ్యానించింది. బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల వారి చదువు, ఆరోగ్యం, గౌరవం దెబ్బతింటాయని, ఇది సమానత్వ హక్కుకు కూడా విరుద్ధమని న్యాయస్థానం అభిప్రాయపడింది. టాయిలెట్లను ఏర్పాటు చేయడంలో, రుతురుమాళ్లను ఉచితగా అందించడంలో రాష్ట్రాలు విఫలమైతే వాటినీ జవాబుదారులుగా నిలబెడతామని స్పష్టం చేసింది.

## నాసా చంద్రమండల యాత్ర వాయిదా

**హైదరాబాద్ పెన్ పవర్:** నాసా చేపట్టిన చంద్రమండల యాత్ర అర్టెమిస్-2 మిషన్ వాయిదా పడింది. వాతావరణ కారణాల వల్ల కొద్దిగా ఆలస్యమైంది. ఫ్లోరిడాలోని కెనెడీ అంతరిక్ష కేంద్రం వద్ద వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఈ యాత్రను రెండురోజులు వాయిదా వేసింది. దీంతో ఆర్టెమిస్-2 మిషన్ ఫిబ్రవరి 8న జరిగే అవకాశం ఉందని నాసా వెల్లడించింది. ఈ మిషన్ కోసం ఉపయోగిస్తున్న 98 మీటర్ల పొడవైన స్పేస్ లాంచ్ సిస్టమ్ రాకెట్‌కు జరగాల్సిన ఇంధన నింపే ప్రక్రియను కూడా విపరీతమైన చలి, ప్రతికూల వాతావరణం వలన తాత్కాలికంగా నిలిపివేశారు. పరిస్థితులు అనుకూలిస్తే ఈ ప్రక్రియ సోమవారం నిర్వహించే అవకాశం ఉంది. ఈ మిషన్ కు నాసాకు ఫిబ్రవరిలో కేవలం మూడు రోజులు మాత్రమే అవకాశం ఉండగా.. అవి మిస్ అయితే మిషన్ మార్చికి వాయిదా పడే పరిస్థితి ఉంది. కాగా ఈ మిషన్‌లో పాల్గొనబోయే నలుగురు వ్యోమగాములు ప్రస్తుతం క్వారంటైన్‌లో ఉన్నారు. అర్టెమిస్-2 మిషన్‌లో వ్యోమగాములు సుమారు 10 రోజుల పాటు అంతరిక్షంలో ప్రయాణించి చంద్రుడి చుట్టూ తిరిగి వస్తారని, వారు చంద్రునిపై దిగరని నాసా స్పష్టం చేసింది.

## సాఫ్ట్‌వేర్ నుంచి ఏఐ సొల్యూషన్ల వైపు మారుతున్న భారతీయ ఐటీ పరిశ్రమ



భారత ఐటీ రంగం సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి నుంచి వేగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సొల్యూషన్ల వైపు పయనిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దశాబ్దాలుగా మన ఐటీ పరిశ్రమకు ఉన్న బలాన్ని, పాత సాఫ్ట్‌వేర్ అభివృద్ధి మోడల్‌కు బదులుగా, ఏఐ సొల్యూషన్స్ అందించేలా ఉపయోగిస్తున్నామని అన్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. భారత్ ఇప్పటికే ఏఐ సంబంధిత రంగంలో 70 బిలియన్ డాలర్ల(రూ. 6.44 లక్షల కోట్ల) పెట్టుబడులను సాధించింది. వచ్చే నెలలో జరిగే ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఇది రెట్టింపు కావొచ్చని వెల్లడించారు. ఈ సమ్మిట్ ప్రపంచంలోనే నాల్గవ, అతిపెద్ద ఏఐ సదస్సు. భారత్ తన ఏఐ ఎకోసిస్టమ్‌ను సరైన క్రమంలో అభివృద్ధి చేసిందని, దీని ద్వారా ప్రపంచ ఏఐ అభివృద్ధిలో దేశాన్ని కీలకంగా మార్చిందని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులకు కొత్త స్కిల్స్ కోసం శిక్షణ ఇస్తున్నాయని, క్లయింట్లతో తిరిగి సంబంధాలు ఏర్పరచుకుంటున్నాయని, కొత్త మార్కెట్ అవకాశాలను అన్వేషిస్తున్నాయని మంత్రి అన్నారు. ఇప్పటికే 5,00,000 మందికి పైగా విద్యార్థులు ఏఐ స్కిల్స్‌ను అందిపుచ్చుకున్నారు. త్వరలో 500 విశ్వవిద్యాలయాలలో ఏఐ మౌలిక సదుపాయాలు, కోర్సు పాఠ్యాంశాలను అందిస్తామని, తద్వారా విద్యార్థులు ఏఐ అవకాశాలపై మెరుగైన శిక్షణ పొందవచ్చని పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ షాక్ ?




కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదురుచూస్తున్న కరువు భత్యం (ఆం)పై వారికి షాక్ తప్పేలా లేదు. ఈసారి కరువు భత్యం పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వం పిసినారిగా వ్యవహరించబోతున్నట్లు తెలుస్తోంది. 8వ వేతన సంఘం సిఫార్సుల కోసం ఎదురుచూస్తున్న కేంద్ర ఉద్యోగులకు ఈసారి కరువు భత్యం ఊరటనిస్తుందని భావించగా.. అలాంటిదేమీ లేదని తెలిపోతోంది. ఈ మేరకు కేంద్రం డీఏ పెంపును ఖరారు చేసినట్లు సమాచారం. ఈసారి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ కనిష్టంగా 2 శాతం, గరిష్టంగా 5 శాతం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో 2 శాతం పెరిగితే ప్రస్తుతం ఉన్న మూలవేతనం(బేసిక్ పే) లో 58 శాతం నుంచి 60 శాతానికి పెరిగే ఛాన్స్ ఉంది. గరిష్టంగా 5 శాతం పెరిగినా అత్యధికంగా 63 శాతానికి మాత్రమే ఇది చేరనుంది. ఎందుకంటే కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ డిసెంబర్ 2025కి ప్రకటించిన అఖిల భారత వినియోగదారుల ధరల సూచీని 148.2 వద్దే ఉంచింది. ద్రవ్యోల్బణం ప్రభావం నుండి జీతాలు, పెన్షన్లను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం ఎప్పటికప్పుడు సవరిస్తారు. అయితే ఈ సవరణకు ప్రాతిపదికగా పారిశ్రామిక కార్మికుల కోసం అఖిల భారత వినియోగదారుల ధరల సూచీని తీసుకుంటారు. కానీ తాజాగా ప్రకటించిన సూచీని ఎలాంటి మార్పులు లేకుండా అలాగే ఉంచడంతో కరువు భత్యం గరిష్టంగా 5 శాతం పెరిగి 63 శాతానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం జూలై 2025లో 54 శాతంగా ఉన్న డీఏను 58 శాతానికి పెంచింది. ఇప్పుడు డీఏను ఖరారు చేసినా మార్చి లేదా ఏప్రిల్ లో కేంద్రం ఆమోదం తర్వాతే ఇది అమల్లోకి వస్తుంది. అయితే బకాయిలు మాత్రం చెల్లిస్తారు.

## ద్రవ్యలోటు రూ.8.55 లక్షల కోట్లు



దేశ ద్రవ్యలోటు 2025 డిసెంబరు చివరకు రూ.8.55 లక్షల కోట్లుగా నమోదైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు, జీడీపీలో 4.4% లేదా రూ.15.69 లక్షల కోట్లుగా ఉండొచ్చని కేంద్రం అంచనా వేసింది. ఈ అంచనాల్లో తాజా గణాంకాలు 54.5 శాతానికి సమానం. 2024-25 ఇదే సమయంలో ద్రవ్యలోటు బడ్జెట్ లక్ష్యంలో 56.7 శాతంగా ఉంది. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) గణాంకాల ప్రకారం.. డిసెంబరు చివరకు ప్రభుత్వానికి రూ.25.25 లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. బడ్జెట్ అంచనాల్లో ఈ మొత్తం 72.2 శాతానికి సమానం. ఇందులో రూ.19.39 లక్షల కోట్లు పన్నుల రూపేణ, రూ.5.39 లక్షల కోట్లు పన్నేతర ఆదాయంగా లభించింది. రుణ రహిత పెట్టుబడి సాధనాల్లో రూ.46,047 కోట్లు సమకూరాయి. ఏప్రిల్-డిసెంబరు నెలల్లో పన్ను ఆదాయంలో వాటా రూపేణ రాష్ట్రాలకు రూ.10.38 లక్షల కోట్లు బదిలీ చేశారు. 2024-25 ఇదే కాలంలో బదిలీ చేసిన మొత్తం కంటే ఇది రూ.1.37 లక్షల కోట్లు అధికం. ఏప్రిల్-డిసెంబరులో మొత్తం ప్రభుత్వ వ్యయాలు రూ.33.8 లక్షల కోట్లకు చేరాయి. బడ్జెట్ అంచనాల్లో ఇవి 66.7 శాతానికి సమానం. ఇందులో రూ.25.93 లక్షల కోట్లు రెవెన్యూ వ్యయాలు కాగా.. రూ.7.87 లక్షల కోట్లు పెట్టుబడి వ్యయాలు. రెవెన్యూ వ్యయాల్లో రూ.9.11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు, రూ.3.17 లక్షల కోట్లు ప్రధాన రాయితీలకు వెచ్చించారు.

## రష్యన్ క్రూడ్‌పై రిలయన్స్ భారీ డీల్ ఫిబ్రవరి నుంచి పోటెత్తనున్న దిగుమతులు

ప్రముఖ భారతీయ పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, రష్యా నుంచి భారీ మొత్తంలో ముడి చమురును దిగుమతి చేసుకునేందుకు సిద్ధమైంది. రానున్న ఫిబ్రవరి నెల నుంచి ప్రతిరోజూ సుమారు 1.5 లక్షల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేయాలని కంపెనీ నిర్ణయించుకున్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో మారుతున్న పరిణామాలు, దేశీయ ఇంధన అవసరాల దృష్ట్యా రిలయన్స్ ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందం ద్వారా భారత ఇంధన రంగంలో రిలయన్స్ తన పట్టును మరింత బలోపేతం చేసుకోనుంది. అమెరికా విధించిన ఆంక్షల పరిధిలోకి రాని రష్యన్ చమురు సంస్థలతోనే ఈ లావాదేవీలు జరగనున్నట్లు సమాచారం. రాబోయే రెండు నెలల పాటు ఈ కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని కంపెనీ ప్రతినిధులు భావిస్తున్నారు. అంతర్జాతీయ నియమ నిబంధనలను పాటిస్తూనే, తక్కువ ధరకే లభించే రష్యా క్రూడ్‌ను అందిపుచ్చుకోవాలని రిలయన్స్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దీనివల్ల కంపెనీకి ఉత్పత్తి వ్యయం తగ్గడమే కాకుండా, లాభదాయకత కూడా పెరిగే అవకాశం ఉంది. గత డిసెంబర్ నెలలో కూడా రిలయన్స్ సంస్థ అమెరికా ఆంక్షల నుంచి ప్రత్యేక మినహాయింపులు పొంది రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంది. ఆ సమయంలో కుదుర్చుకున్న ఒప్పందాలు విజయవంతం కావడంతో, ఇప్పుడు మరింత పెద్ద మొత్తంలో ఆర్డర్లు ఇచ్చేందుకు కంపెనీ మొగ్గు చూపుతోంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, దౌత్యపరమైన వెసులుబాటును ఉపయోగించుకుంటూ రిలయన్స్ తన దిగుమతులను కొనసాగిస్తోంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఇంధన భద్రతకు కూడా దోహదపడనుంది. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలో, రష్యా నుంచి నేరుగా కొనుగోలు చేయడం భారత్‌కు ఎంతో ప్రయోజనకరం. రిలయన్స్ వంటి పెద్ద సంస్థలు ఈ స్థాయిలో దిగుమతులు చేపట్టడం వల్ల దేశీయంగా పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాలో స్థిరత్వం ఏర్పడుతుంది. అమెరికా మరియు ఇతర పాశ్చాత్య దేశాల ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగకుండా రిలయన్స్ చట్టబద్ధంగానే ఈ డీల్స్‌ను పూర్తి చేస్తోంది. రాబోయే రోజుల్లో ఈ దిగుమతులు భారత వాణిజ్య రంగంలో కొత్త చర్చకు దారితీయవచ్చు.

# సమానత్వం, ప్రేమ భావనలను చాటుతున్న గురు రవిదాస్ బోధనలు

ప్రతి ఏట మాఘ పూర్ణిమ రోజు "గురు రవిదాస్ జయంతి"ని భారతదేశవ్యాప్తంగా అత్యంత గౌరవప్రదంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. అతి ప్రధానమైన భారత సాధువుల్లో ఒకరైన గురు రవిదాస్ భక్తి ఉద్యమాలు, ఆధ్యాత్మిక బోధనలు, కరుణతో నిండిన జీవితం, వివక్షలేని సమాజం, సామాజిక సమానత్వ పోరాటాలు, కుల వ్యవస్థను సవాలు చేయడం లాంటి అంశాలు నేటి పౌర సమాజంపై చెరగని ముద్రను వేసాయి. దేవుడి ఏకత్వ బోధనలు, ఆధ్యాత్మిక స్వచ్ఛత ప్రోత్సాహాలు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి, భవిష్యత్తులో కాలాతీత సందేశాలుగా ఉంటాయి కూడా. గురు రవిదాస్ జీవనయానం వినయం, భక్తి, కరళత అనే ఇతివృత్తాలతో ముడిపడి ఉన్నది. 15వ శతాబ్దంలో తక్కువ కుల (తోలు కార్మిక) కుటుంబంలో జన్మించిన గురు రవిదాస్, సాధువుగా మారి సమానత్వం సాధనకు కృషి చేసిన ఆధ్యాత్మిక నాయకుడుగా మనకు తెలుసు. పుట్టుక, కులం, మతం పేర్లతో పౌర సమాజ విభజనలు వ్యతిరేకించిన రవిదాస్ కుటుంబం చెప్పులు కుట్టే పనిలో గడిపేవారు. ఆయన బోధనలు విన్న పండితులు, రారాజులు సహితం ఆయనకు ఎనలేని గౌరవాన్ని ఇచ్చేవారు. గురు రవిదాస్ తన భక్తి గీతాలతో ప్రసిద్ధి పొందారు. అనేకమైన ఈ గీతాలు సిక్కుల మత గ్రంథమైన "గురు గ్రంథ్ సాహిబ్"లో చేర్చబడ్డాయి. ఆయన కీర్తనలు మతపరమైన సరిహద్దులను దాటి సమానత్వ సాధనకు ఉపకరించాయి. ప్రేమ, ఐక్యత, సమానత్వం అనబడే సందేశాలు నేటికీ లక్షలాది ప్రజలకు ప్రేరణగా నిలుస్తున్నాయి. సకల జీవుల్లో దేవుడు ఉన్నాడని, దైవం ముందు పెద్ద చిన్న కులాలు లేవని ప్రచారం చేసాడు. గురు రవిదాస్ బోధనలు అణగారిన వర్గాలకు గౌరవప్రదమైన జీవితంపై ఆశలు, బలాన్ని అందించాయి. బాహ్య ఆచారాల కంటే భక్తి ఆధారంగా దైవంతో సంబంధం పెట్టుకోవచ్చని వివరించాడు. విగ్రహారాధనను వ్యకిరేకిస్తూ, నిరాకార దేవుని ఏకత్వ భావనను ప్రచారం చేసాడు. గురు రవిదాస్ జయంతి రోజు ఆధ్యాత్మిక చింతన, ఆనంద పూజలు, సమాజ వేడుకలు, నాగర్ కీర్తనలు (ఊరేగింపులు), స్తోత్రాల పఠనం, లంగర్ భోజనాలు, దాతృత్వ కార్యక్రమాలు లాంటివని పెద్ద ఎత్తున జరుపుకుంటారు. "మీ హృదయం స్వచ్ఛంగా ఉంటే, ఒక చిన్న కుండ నీరు కూడా పవిత్ర గంగా నదిలా పవిత్రం అవుతుంది" అనే ఒక ప్రసిద్ధ సామెతను గురు రవిదాస్ అందించాడు. అంతర్గత స్వచ్ఛతే ఆధ్యాత్మికత, శాంతికి అదే నిజమైన మార్గం అని నొక్కి వక్కానించిన గురువు మన రవిదాస్. కులమతాలు, సామాజిక వివక్షలకు అతీతంగా ప్రతి ఒక్కరిలో దైవంతో అనుసంధానమయ్యే సామర్థ్యం ఉంటుందని బోధించాడు. గురు రవిదాస్ బోధనలు నేటికీ సందర్భోచితంగా ఉంటూ, అసమానతలు, వివక్షత, సామాజిక అన్యాయాలు వంటి సమస్యలను పరిష్కరించడానికి ఒక నైతిక చట్రంగా నిలుస్తున్నాయి. సమాజ ఐక్యత, కరుణ వ్యాప్తి, నిస్వార్థ సేవాగుణాలను ఆచరిస్తూ గురు రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుందాం.

# ఆసియా తొలి మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా

కల్పనాచావ్లా.. భారతదేశ గర్వించదగ్గ వ్యోమగామి. ప్రపంచ వ్యాప్తం గాఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మహిళ. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ, అంతేకాక ఇండో-అమెరికన్ మహిళ వ్యోమగామి కల్పనా చావ్లా. పట్టుదల, కృషి, అంకితభావం ఉంటే సాధించ లేనిది ఏదీ ఉండదని ఆమె నిరూపిం చారు. ఎందరో యువతులకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. కల్పనా చావ్లా, భారత దేశం లో హర్యానా లోని కర్నాల్ అనే ఊరులో సంప్రదాయ శాఖాహార ఒక పంజాబీ కుటుంబం లో మార్చి17, 1962 లో పుట్టారు. తండ్రి బనారసీ లాల్ చావ్లా. సోదరుడు సంజయ్ చావ్లా కమర్షియల్ పైలట్ కావాలని కలలు కనేవాడు. తన గదిలో విమా నాల బొమ్మలుంచేవాడు. అవి కల్ప నలో స్ఫూర్తిని రగిలించాయి. కల్ప నా చావ్లా ముందుగా, కర్నాల్ లో ఉన్న టాగోర్ పబ్లిక్ స్కూల్లో చదువుకున్నారు. పంజాబ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన కల్పనా చావ్లా ఎంఎస్ కోసం 1982లో అమెరికాకు వలస వెళ్లారు. 1982 లో ఈమె అమెరికా వెళ్లి అక్కడ "ఏరోస్పేస్ ఇంజనీరిం గ్"లో మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని, అర్లింగ్టన్‌లో ఉన్న టెక్సాస్ విశ్వ విద్యాలయం నుంచి 1984 లో పొందారు. 1986లో, చావ్లా రెండవ మాస్టర్ అఫ్ సైన్సు డిగ్రీని మరియు ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో పిహెచ్డి ని బౌల్డర్‌లో ఉన్న కోలోరాడో విశ్వ విద్యాలయం నుంచి పొందారు. ఆమె 1983 లో విమానయాన శిక్షకుడు మరియు విమాన చోదక శాస్త్ర రచయిత ఐన జీన్-పియర్ హారిసన్ ను వివాహం చేసుకున్నారు. భారత దేశంలో మొట్టమొదటి విమానాన్ని నడిపిన జె.ఆర్.డి. టాటా యే తనకు స్ఫూర్తి, అందుకనే ఏరోనాటిక్స్ ఇంజనీరింగ్ ను కెరీర్ గా తీసుకున్నానని చెపుతుండేవారు. లింగ వివక్షతను అధిగమించి తల్లి సహకారంతో ఆమె తన కలలను సాకారం చేసుకున్నారు. కల్పన అంటే ఆలోచన లేదా ఊహ. చిన్న నాటి నుంచే ఆకాశంలో విహరిం చాలనే కోరికతో కల్పన తన పేరును సార్థకం చేసుకున్నారు. టెక్సాస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన తర్వాత, 1988లో కొలరాడో యూనివర్సిటీ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో పీహెచ్ పట్టాను స్వీకరించారు. 1988లో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాకు చెందిన ఏమ్స్ రిసెర్చ్ సెంటర్లో ఉద్యోగంలో చేరారు. ఏడాది నాసా పరిశోధన కేంద్రంలో చేరిన కల్పన పవర్ లిఫ్ట్ కాంప్యూటే షనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ విభాగంలో వైస్-ప్రెసిడెంట్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత నాసాకు వైస్-ప్రెసిడెంట్‌గా సేవలు అందించారు. 1991లో ఆమెకు అమెరికా పౌరసత్వం లభించింది. తొలిసారిగా 1997లో కొలంబియా నౌక ద్వారా అంతరిక్ష యానం చేసిన కల్పనా చావ్లా చరిత్ర సృష్టించారు. అంతరిక్షంలో 376 గంటలు గడిపి భూమిచుట్టూ 252 సార్లు పరిభ్రమించి 6.5 మైళ్లు తిరిగారు. అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మహిళగానే కాదు, తొలి ఆసియా మహిళగానూ కల్పన రికార్డులకెక్కారు. తన మొదటి స్పేస్ మిషన్‌లో భాగంగా కొలంబి యా ఋా-87 అంతరిక్ష నౌకలో ప్రయాణించే టప్పుడు ఆమెఅప్పటి భారత ప్రధాని ఐకే గుజ్రాల్‌తో మాట్లాడారు. ఆ సమయంలో అంతరిక్షం నుంచి తీసిన హిమాల యాల ఫోటోలను గుజ్రాల్‌కు చూపించారు. 2003 జనవరిలో రెండోసారి అంతరిక్షంలోకి వెళ్లి 16 రోజులు గడిపి 80 ప్రయోగాలను విజయ వంతంగా నిర్వహించారు. భారత మూలాలు ఉన్న కల్పన 40 ఏళ్ల వయసులో, 2003లో చని పోయారు. 2003 ఫిబ్రవరి 1 న అంతరిక్షం నుంచి తిరిగివస్తూ ఆమె ప్రయాణిస్తున్న అంతరిక్ష నౌక భూమి వాతావరణం లోకి ప్రవేశిస్తు న్నప్పుడు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో కల్పనతో పాటు ఆమె తో కలిసి ప్రయాణిస్తున్న మరో ఆరుగురు సిబ్బంది కూడా మరణిం చారు. కొలంబియా అంతరిక్ష నౌక షెడ్యూల్ ల్యాండింగ్‌కు 16 నిమిషాల ముందు అమెరికాలోని టెక్సాస్ ప్రాంతంలో కూలిపోయింది. ఆమె గౌరవార్ధం తమిళనాడు ప్రభుత్వం కల్పనా చావ్లా పురస్కా రాన్ని 2003 నుంచి ఏటా ప్రకటిస్తోం ది. దీన్ని వివిధ రంగాల్లో 15 మంది శక్తివంతమైన మహిళకు అంద జేస్తుంది. కల్పన గౌరవార్థం దేశం లోని ఎన్నో విద్యాసంస్థలకు, అవార్డులకు ఆమె పేరు పెట్టారు. యువ మహిళా శాస్త్రవేత్తలను ప్రోత్సహించేందుకు కర్ణాటక ప్రభు త్వం 2004లో కల్పనా చావ్లా అవార్డును ఏర్పాటు చేసింది. భార తీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 2003లో ప్రయోగించిన మెట్ శాట్‌కు కల్పనా చావ్లా పేరు పెట్టారు. తండ్రి బనారసీలాల్ చావ్లా సాధారణ వ్యాపారి. కల్పనపై ఆయన ప్రభావం ఎక్కువ. పేదరికం నుంచే ఆయన పైకెదిగీ, పట్టుదల, అందుకు తగిన కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన వ్యక్తి ఆయన. చిన్నగా టైర్ల వ్యాపారాన్ని ప్రారంభించిన ఆయన తొలుత ఎన్నో కష్టనష్టాలకు గురయ్యారు. అయినా దాన్ని వదలకుండా అనుకున్నది సాధించేందుకు ముందుకు సాగిపోయారు. అప్పటి వరకూ టైర్ల తయారీకి విదేశీ యంత్రాన్ని ఉపయోగించేవారు. ఆ క్రమంలో ఆయన దేశీయంగానే ఆ యంత్రా న్ని రూపొందించారు. బనారసీలాల్ శ్రమ ఫలించింది. రాష్ట్రపతి నుంచీ అభినందనలు అందుకున్నారు. తర్వాత డబ్బుకోసం బనారసీ కుటుంబం ఇబ్బంది పడింది లేదు. ఆడపిల్లే అయినా జీవితంలో ఏదో సాధించాలన్న తపన కల్పనలో పాదుకోవడానికి తండ్రేకారణం. "పరిస్థితులు ఎలాగున్నా... కన్న కలల్ని నిజం చేసుకోవడమే అంతిమ లక్ష్యం అన్న మాటలు నా తండ్రి జీవితంలో నిజమయ్యాయి. ఫలితంగా అవే నాలోనూ జీర్ణించుకుపోయాయి. అందుకు నాన్నే కారణం." అంటూ తొలి అంతరిక్షయానం తర్వాత ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆలోచనలు ఏ విధంగా ప్రభావితమయిందీ కల్పన వివరించారు. ఏదో ఒకటి చేయండి, కానీ దాన్ని మీరు మనఃస్ఫూర్తిగా చేయాలను కోవాలి. ఎందుకంటె ఏదైనా పనిని కేవలం ఒక లక్ష్యం కోసం చేయడం కాక,... దానిలో లీనమై అనుభవిం చాలి" అని యువతులకు సందేశం ఇచ్చేవారు.

# ఉచితాలు ఎత్తేస్తారా? ఆర్థిక సర్వేలో కేంద్రం ఏం చెప్పింది?

ఉచిత పథకాలపై ఆర్థిక సర్వేలో అంచనాలు ఎలాంటి టార్గెట్లు లేకుండా క్యాష్ ట్రాన్స్‌ఫర్లు సరికాదు ఆర్థిక వ్యవస్థ గాడి తప్పే ప్రమాదముంటుందన్న సర్వేఇఞనీనినీఏతిఞ ాబీతీలవఎ: దేశంలో ఉచిత పథకాలకు సంబంధించి కేంద్ర ఎకనామిక్ సర్వేలో సంచలన విషయాలు వెలుగుచూశాయి. కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన ఎకనామిక్ సర్వేలో ఉచిత పథకాలు, ఎలాంటి టార్గెట్లు లేకుండా క్యాష్ ట్రాన్స్ ఫర్లు చేయడం లాంటి పథకాల వల్ల ఆర్థిక వ్యవస్థ గాడి తప్పే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఇలాంటి పథకాల కంటే కూడా బ్రెజిల్, మెక్సికో, ఫిలిప్పీన్స్ లో ఉన్న పథకాలను అమలు చేస్తే బెటర్ అని అభిప్రాయపడింది. దేశంలో ఈ మధ్య కాలంలో ఓటర్లను ఆకట్టుకోవడానికి పొలిటికల్ పార్టీలు ఇబ్బడిముబ్బడిగా వరాలు ప్రకటిస్తున్నాయి. ఆడవారికి 10వేలు ఇస్తాం. రైతులకు ఇవి ఇస్తాం.. చేనేతలకు అది ఇస్తాం.. పిల్లలకు ఇంకోటి ఇస్తాం.. నిరుద్యోగులకు ఫలానాది ఇస్తాం. ఇలా నోటికి వచ్చినట్టు హామీలు గుప్పిస్తున్నాయి. ఏ రాష్ట్రం కూడా వీటికి అతీతం కాదు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, అసోం, పశ్చిమ బెంగాల్.. ఇలా ఒకటేంటి ప్రతి రాష్ట్రం కూడా ఇలాంటి ఉచిత హామీల విషయంలో తగ్గేదేలే అన్నట్టుగా ఉన్నాయి. దేశంలో ఉచిత హామీలు, మనీ ట్రాన్స్ ఫర్లు ఏ రేంజ్ లో పెరిగిందంటే 2023 నుంచి 2026 నాటికి అది ఐదింతలు పెరిగింది. ప్రస్తుతం దేశ ఆర్థిక బడ్జెట్ మీద 1.7 లక్షల కోట్లు ఈ ఉచితాలు, మనీ ట్రాన్స్ ఫర్ల రూపంలో ప్రజలకు అందుతున్నాయి. ఏడు రాష్ట్రాల్లో నెలవారీ వచ్చే ఆదాయంలో 87 శాతం కేవలం ఈ ఉచితాలకు ఇవ్వడానికే సరిపోతుందంటే పరిస్థితి ఏం స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్థిక సర్వేతో పాటు ఇతర ప్రభుత్వ సర్వేలు, అంచనాలను గమనిస్తే ఈ ఉచిత పథకాలు, డబ్బులు ట్రాన్స్ ఫర్ల వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదు. ఆ స్థాయిలో పురోగతి కూడా సాధించలేదు. మహిళలకు గానీ, ఇతరులకు గానీ ఇస్తున్న ఉచిత హామీల డబ్బుల వల్ల పెద్దగా వారి జీవితాలలో మార్పులు తీసుకురాలేకపోయాయని సర్వేలు చెబుతున్నాయి. వాళ్లకు డబ్బులిస్తే ఏదో మంచి జరిగి వాళ్ల జీవితాలు మారతాయని ఆశించిన ఫలితం దక్కలేదు. మరోవైపు రాష్ట్రాల ఖజానాల మీద ఆర్థిక భారం తడిసి మోపెడవుతోంది. దీని వల్ల ఆర్థిక లోటు పెరుగుతోంది. జనాల చేతిలో డబ్బుల పెడుతున్నప్పుడు, ఉచితాల రూపంలో కాకుండా ఏదో ఒక టార్గెట్ ఓరియంటెడ్ గా ఉండాలని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. అంటే, ఫర్ ఎగ్జాంపుల్ మీ పిల్లలు స్కూలుకి వస్తేనే డబ్బులిస్తామని అంటే వాళ్లు స్కూలుకు వచ్చినప్పుడు వాళ్ల అటెండెన్స్ పూర్తిగా, ప్రాపర్ గా చెక్ చేసి వాళ్ల అకౌంట్లో డబ్బులు వేయడం. ఇది ఓ రకంగా బెటర్. ఎందుకంటే పిల్లలు చదువుకుంటారు. మెల్లగా వృద్ధిలోకి వస్తారు. ఇంకో ఎగ్జాంపుల్ ఏంటంటే, గర్భిణులు ప్రాపర్ గా చెకప్స్ చేయించుకోవడం, పిల్లలకు కచ్చితంగా వ్యాక్సిన్లు వేయించడం.. ఇలాంటి వాటికి మనీ ట్రాన్స్ ఫర్ చేస్తే ఆరోగ్య పరంగా దేశం బాగుపడుతుంది. మనిషి ఆరోగ్యంగా ఉంటే సగం సమస్యలు లేనట్టే. ఎందుకంటే ఇండియా లాంటి దేశంలో ఒక్క చిన్న జబ్బు వచ్చినా ఆస్పత్రుల్లో ఖర్చుల సంగతి తెలిసిందే. జీవితాంతం కష్టపడి సంపాదించిన సొమ్ము ఒక్కసారి ఆస్పత్రి పాలవుతుంది. కాబట్టి హెల్త్ లాంటి అంశాలపై ఉచితాలు, మనీ ట్రాన్స్ ఫర్లు చేస్తే బెటర్ అనే అభిప్రాయం ఎకనామిక్ సర్వే వెలిబుచ్చింది. ఉచితాలు, కండిషనల్ మనీ ట్రాన్స్ ఫర్ల లాంటి అంశాల్లో ఎలా పడితే అలా ఇచ్చేయకుండా బ్రెజిల్ ను ఫాలో అయితే బెటర్ అనే అభిప్రాయాన్ని ఎకనామిక్ సర్వే అభిప్రాయపడింది. బ్రెజిల్లో 2003లో బోల్సా ఫెమిలియా అనే స్కీమ్ తెచ్చారు. అక్కడ విద్య, వైద్యం (పైన చెప్పిన ఎగ్జాంపుల్స్) అంశాల్లో లబ్దిదారులకు బ్యాంకు అకౌంట్లకు మనీ ట్రాన్స్ ఫర్ చేస్తున్నారు.



ఇది సత్ఫలితాలు ఇచ్చింది. ఈ రకంగా చేయడం వల్ల ఒకదశకు వచ్చాక ఆ విద్యార్థి చదువుకుని గ్రాడ్యుయేట్ అయ్యాక డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదు. అలాగే, స్త్రీలకు కూడా ఆ టార్గెట్ పూర్తయ్యాక డబ్బులు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. అలా కాకుండా 'ఫలానా కులం వారికి డబ్బులు ఇస్తాం.' అని ఎన్నికల హామీలు ఇస్తే వాళ్లకు జీవితాంతం ఇస్తూ పోవాలి. అలాగే, మెక్సికో, ఫిలిప్పీన్స్ లో కూడా ఇలాంటి కండిషన్ల మీదే మనీ ట్రాన్స్ ఫర్ పథకాలు ఉన్నాయి. దీని వల్ల అకౌంటబిలిటీ పెరుగుతుంది. అలాగే, సరైన దిశలోనే ప్రజల సొమ్ము ఖర్చవుతుంది. మొత్తానికి ఉచితాలు, డబ్బుల పంపిణీలు అనేవి కొన్ని కండిషన్ల ద్వారా జరగాలని ఎకనామిక్ సర్వే కచ్చితంగా అభిప్రాయపడింది. అలాగే, టైమ్ కండిషన్లు కూడా పెట్టుకోవాలని సూచించింది. లేకపోతే ఆర్థికంగా దెబ్బతింటామని స్పష్టం చేసింది.

# బియ్యం కడిగిన నీళ్లు వృథాగా పారబోస్తున్నారా?



అన్నం వండేటప్పుడు చాలా మంది బియ్యం కడిగి.. ఆ నీటిని వృద్ధాగా పారబోస్తుంటారు. కానీ ఈ నీటిలో అనేక పోషకాలు, ఖనిజాలు ఉంటాయట. ఇవి చర్మం నుంచి జుట్టు వరకు అనేక ప్రయోజనాలను అందిస్తాయని నిపుణులు అంటున్నారు. సాధారణంగా అందరి ఇళ్లలో అన్నం వండుతుంటారు. అన్నం వండేటప్పుడు చాలా మంది బియ్యం కడిగి.. ఆ నీటిని వృద్ధాగా పారబోస్తుంటారు. కానీ ఈ నీటిలో అనేక పోషకాలు, ఖనిజాలు ఉంటాయట. ఇవి చర్మం నుంచి జుట్టు వరకు అనేక ప్రయోజనాలను అందిస్తాయని నిపుణులు అంటున్నారు. అయితే చాలా మందికి దీని గురించి సరైన అవగాహనక లేకపోవడం వల్ల బియ్యం కడిగి నీళ్లు పారబోస్తుంటారు. చాలా మంది బియ్యం కడగడానికి ఉపయోగించే నీటిని పారబోస్తారు. బదులుగా మీరు ఈ నీటిని మొక్కలకు వాడవచ్చు. ఇది మంచి ఎరువుగా పనిచేస్తుంది. ఇందులో ఉండే పోషకాలు, ఖనిజాలు మొక్కల పెరుగుదలకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. బియ్యం నీటిని ఒక సీసాలో వేసి అద్దాలు, గాజు సామాగ్రిని శుభ్రం చేయడానికి వాడవచ్చు. ముందుగా ఈ నీటిని మరకలు ఉన్న ప్రదేశంలో స్ప్రే చేసి, ఆపై మెల్లగా రుద్ది శుభ్రం చేయండి. గాజు సామాగ్రి బాగా మెరుస్తుంది. వంటింటి పాత్రలు శుభ్రం చేసిన తర్వాత కూడా, అల్లం ? వెల్లుల్లి పేస్ట్ వాసన కంటైనర్లలో అలాగే ఉంటుంది. ఈ వాసనను వదిలించుకోవడానికి మీరు బియ్యం నీటిని ఉపయోగించవచ్చు. దీని కోసం వాసన ఉన్న కంటైనర్‌లో బియ్యం నీటిని పోసి కొంత సమయం తర్వాత శుభ్రం చేయాలి. ఇలా చేస్తే వాసన పూర్తిగా పోతుంది. ఇది కంటైనర్‌ల నుంచ గ్రీజును కూడా తొలగిస్తుంది.బియ్యం నీటిలో సహజ పిండి పదార్థం ఉంటుంది. దీనిని కాటన్ దుస్తులను శుభ్రం చేయడానికి ఉపయోగించవచ్చు. బియ్యం నీటిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది ముఖ రంధ్రాలను బిగించి చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. బియ్యం నీటిని జుట్టుకు కూడా ఉపయోగించవచ్చు. ఈ నీటితో జుట్టు కడుక్కోవడం వల్ల జుట్టు రాలడం నుంచి ఉపశమనం లభిస్తుంది. చివరలు చిట్లడం తగ్గుతుంది. పొడిబారడం తగ్గుతుంది. అలాగే దీని వాడకం వేగంగా జుట్టు పెరుగుదలకు సహాయపడుతుంది.

## ఈ తప్పులు చేస్తే తిప్పలు తప్పవు..



స్మార్ట్‌ఫోన్ లేకపోతే ఏం తోచదు.. నిద్ర రాదు.. ఆఖరికి టాయిలెట్‌కు వెళ్లినా ఫోన్ ఉండాల్సిందే.. రీల్స్ చూస్తూనో, చాటింగ్ చేస్తూనో టాయిలెట్ సీటుపై గంటలు గడిపేస్తున్నారా.. అయితే మీరు తెలియకుండానే ఒక భయంకరమైన అనారోగ్య ఉచ్చులో చిక్కుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు మనిషి శరీరంలో ఒక భాగమైపోయింది. తినేటప్పుడు, పడుకునేటప్పుడు.. ఆఖరికి టాయిలెట్‌కు వెళ్లేటప్పుడు కూడా ఫోన్‌ను వదలడం లేదు. రీల్స్ చూడటం, సోషల్ మీడియాలో చాటింగ్ చేయడం వంటి అలవాట్లతో అవసరమైన దానికంటే ఎక్కువ సమయం టాయిలెట్ సీటుపై గడిపేస్తున్నారు. అయితే ఈ చిన్న సరదా మీ ప్రాణాల మీదకు తెస్తుందని, ముఖ్యంగా పైల్స్ వంటి భయంకరమైన వ్యాధులకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా టాయిలెట్ సీటుపై కూర్చున్నప్పుడు పురీషనాళంపై సహజంగానే ఒత్తిడి ఉంటుంది. ఫోన్ చూస్తూ గంటల తరబడి అక్కడే కూర్చోవడం వల్ల ఈ ఒత్తిడి రెట్టింపు అవుతుంది. దీనివల్ల రక్తనాళాలు ఉబ్బి, తీవ్రమైన మలబద్ధకం, మూలవ్యాధి వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని పరిశోధనల్లో తేలింది. శరీరం నుండి వ్యర్థాలను బయటకు పంపే ప్రక్రియలో మెదడు కీలక పాత్ర పోషిస్తుంది. మెదడు సిగ్నల్స్ ఇచ్చినప్పుడు మాత్రమే అవయవాలు స్పందిస్తాయి. కానీ మీరు ఫోన్‌లో నిమగ్నమైనప్పుడు మెదడు డైవర్ట్ అవుతుంది. ఫలితంగా కడుపు పూర్తిగా శుభ్రపడదు. లోపల మిగిలిపోయిన మురికి కాలక్రమేణా విషతుల్యమై ఇతర తీవ్ర అనారోగ్యాలకు కారణమవుతుంది. టాయిలెట్‌లో ఫోన్ చూసేటప్పుడు మనం వంగి కూర్చుంటాం. ఈ భంగిమ మెడ, భుజాలపై భరించలేని ఒత్తిడిని కలిగిస్తుంది. నిరంతరం కిందకు చూస్తూ ఉండటం వల్ల మెడ ఎముకలు అరిగిపోవడం, తీవ్రమైన తలనొప్పి, వెన్నుపాము సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పటికే వెన్నునొప్పి ఉన్నవారు ఈ అలవాటుకు దూరంగా ఉండటం శ్రేయస్కరం. టాయిలెట్‌లో ఉండే ప్రమాదకరమైన ఈ-కోలి వంటి బ్యాక్టీరియాలు మీ ఫోన్ స్క్రీన్‌పైకి సులభంగా చేరుతాయి. మీరు చేతులు కడుక్కున్నా, ఫోన్ ద్వారా ఆ బ్యాక్టీరియా మళ్లీ మీ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇది తీవ్రమైన జీర్ణకోశ వ్యాధులకు, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది.

## చిన్నారుల్లో పళ్లు వస్తున్నాయా?




చిన్నారుల ఎదుగుదలలో పళ్లు రావడం అనేది ఒక ముఖ్యమైన ఘట్టం. సాధారణంగా శిశువులకు 7 నుంచి 9 నెలల వయసు మధ్యలో పాలదంతాలు రావడం మొదలవుతుంది. ఈ సమయంలో పిల్లలు చిగుళ్ల నొప్పితో అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి, తల్లిదండ్రులు వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం ఎంతో అవసరమని శిశువైద్య నిపుణులు సూచిస్తున్నారు.మొదటి పన్ను కనిపించినప్పటి నుంచే నోటి శుభ్రతను అలవాటు చేయాలి. పళ్లు రావడం ప్రారంభమైన వెంటనే, పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన మృదువైన బ్రష్‌ను ఉపయోగించి వాటిని సున్నితంగా శుభ్రం చేయాలి. ఇలా చేయడం వల్ల పళ్లపై పాచి పేరుకుపోకుండా ఉంటుంది. చిగుళ్ల ఆరోగ్యాన్ని కాపాడటం ద్వారా భవిష్యత్తులో దంత సమస్యలు రాకుండా ముందుగానే అరికట్టవచ్చు. దంతాలు వచ్చే సమయంలో చిగుళ్లలో దురద, నొప్పి కలగడం సహజం. ఈ ఇబ్బంది నుండి ఉపశమనం కలిగించడానికి ఒక శుభ్రమైన కాటన్ వస్త్రాన్ని తీసుకుని, దానిని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి చల్లబరచాలి. ఆ చల్లని క్లాత్‌ను పసిపిల్లలకు ఇస్తే, వారు దానిని నమలడం ద్వారా చిగుళ్ల నొప్పి నుండి ఉపశమనం పొందుతారు. ఇది వారికి ఎంతో హాయిని ఇస్తుంది మరియు చిరాకును తగ్గిస్తుంది. పళ్లు వచ్చే క్రమంలో కొంతమంది పిల్లల్లో జ్వరం రావడం లేదా విరేచనాలు (మోషన్స్) అవ్వడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఒకవేళ ఈ లక్షణాలు తీవ్రంగా ఉన్నా లేదా పిల్లాడు బాగా నీరసించిపోయినా అశ్రద్ధ చేయకూడదు. వెంటనే వైద్యులను సంప్రదించి తగిన సలహాలు, మందులు తీసుకోవడం ద్వారా పసిపిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# రాత్రుళ్లు ఏ పక్కకు తిరిగి పడుకుంటే మంచిది..?



**హైదరాబాద్ పెన్ పవర్:** నేటి సమాజంలో చాలా మందికి నిద్రలేమి సమస్య వేధిస్తోంది. శరీరం, మెదడు విశ్రాంతికి నిద్ర అత్యవసరం. మంచి నిద్ర కోసం సరైన పడుకునే భంగిమను ఎంచుకోవడం కీలకం. సాధారణంగా ఎడమ వైపు తిరిగి పడుకోవడం ప్రశాంతతను, శ్వాస సులభతరాన్ని అందిస్తుంది. అయితే, గుండె రోగులు కుడి వైపు తిరిగి పడుకోవడం వల్ల గుండెపై ఒత్తిడి తగ్గి, గుండెపోటు ప్రమాదం తగ్గుతుంది. ఆరోగ్యకరమైన నిద్రకు ఈ చిట్కాలు పాటించండి. నిద్ర.. అనేది ఆ సమయంలో మన శరీరాన్ని మరమ్మత్తు చేస్తుంది. దీనివల్ల మెదడుకు విశ్రాంతి లభిస్తుంది. కనీ, ఈ రోజుల్లో చాలా మంది రాత్రి నిద్ర పట్టడం లేదని లేదా తరచుగా నిద్ర చెదిరిపోతుందని ఇబ్బంది పడతారు. కాబట్టి మంచి నిద్ర కోసం నిద్రించే స్థానాన్ని జాగ్రత్తగా ఎంచుకోవడం ముఖ్యం. తద్వారా మీకు మంచి నిద్ర వస్తుంది. నిద్రించడానికి ఒక వైపు తిరిగి పడుకోవడం ఉత్తమం. ఎందుకంటే ఇది మీ మనస్సును రిలాక్స్ గా ఉంచుతుంది. వైద్యుల ప్రకారం.. మీరు గర్భవతిగా ఉన్నా లేకున్నా.. ఎడమ వైపు తిరిగి పడుకోవడం మంచిదిగా చెప్తారు. ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, శ్వాస తీసుకోవడం సులభం అవుతుందని నమ్ముతారు. అయితే గుండె రోగుల విషయానికి వస్తే వారు కుడి వైపు తిరిగి పడుకోవాలి. వారి గుండె మీద తక్కువ ఒత్తిడి ఉంటుంది. ఇది గుండెపోటు వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. అంతేకాదు.. ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణాశయంలోని యాసిడ్స్ అన్నీ సక్రమంగా పనిచేస్తాయి. తద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అదే కుడివైపు తిరిగి పడుకుంటే, ఈ యాసిడ్స్ అన్నీ పైకి ఎగదన్నుతాయని నిపుణులు చెబుతున్నారు. . అందుకే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ సమస్యలు ఉన్నవాళ్లు ఎడమ వైపు తిరిగి పడుకోవాలని సూచిస్తున్నారు. వెన్నెముక సమస్యలు ఉన్నవారు ఎడమవైపు తిరిగి పడుకుంటే ఉపశమనం కలుగుతుంది.

# ఎర్రగా, ఉబ్బిన కళ్లు? కిడ్నీల నుంచి వచ్చే హెచ్చరిక ఇదే!



మన శరీరం ఏదైనా అనారోగ్యానికి గురైనప్పుడు ముందుగానే కొన్ని సంకేతాలను ఇస్తుంది. కానీ, మనం వాటిని తరచుగా నిర్లక్ష్యం చేస్తుంటాం. ముఖ్యంగా ఉదయాన్నే నిద్రలేవగానే కళ్లు ఉబ్బినట్లుగా (ఖబీటటఎ ఇఎవబ) అనిపించడం లేదా కళ్ల చుట్టూ ఎర్రగా మారడాన్ని కేవలం నిద్రలేమి అనుకుంటే పొరపాటే. ఇది మీ కిడ్నీలు పంపిస్తున్న ప్రమాద హెచ్చరిక కావచ్చు, మన శరీరంలో ఫిల్టర్లలా పనిచేసే కిడ్నీల పనితీరులో లోపం తలెత్తినప్పుడు కనిపించే ఈ ముఖ్యమైన మార్పుల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. కిడ్నీ పనితీరుకు, కళ్ల వాపుకు ఉన్న సంబంధం: శరీరంలోని మలినాలను, అదనపు ద్రవాలను బయటకు పంపడంలో కిడ్నీలు కీలక పాత్ర పోషిస్తాయి. కిడ్నీలు సరిగ్గా పనిచేయనప్పుడు, అవి రక్తంలోని ప్రోటీన్‌ను (ముఖ్యంగా అల్బుమిన్) వడకట్టలేక మూత్రం ద్వారా బయటకు పంపేస్తాయి. దీనివల్ల శరీరంలో ప్రోటీన్ స్థాయిలు తగ్గి, ద్రవాలు కణజాలాలలో నిలిచిపోతాయి. ఈ ప్రభావం మన ముఖంపై, ముఖ్యంగా కళ్ల చుట్టూ స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే కళ్ల కింద వాపు రావడం అనేది కిడ్నీ వడపోత వ్యవస్థలో ఏదో సమస్య ఉందనడానికి ఒక ప్రాథమిక సూచనగా వైద్యులు పరిగణిస్తారు. ఇతర లక్షణాలు మరియు గుర్తించాల్సిన తీరు: కేవలం కళ్ల వాపు మాత్రమే కాదు, కిడ్నీ సమస్యలు ఉన్నప్పుడు మరికొన్ని లక్షణాలు కూడా తోడవుతాయి. పాదాలు లేదా చీలమండల వద్ద వాపు రావడం, తరచుగా మూత్ర విసర్జన కావడం (ముఖ్యంగా రాత్రి వేళల్లో), మూత్రం రంగు మారడం లేదా నురుగు రావడం వంటివి గమనించాలి. కళ్లు ఎర్రబడటం అనేది రక్తపోటు పెరగడం వల్ల కూడా జరగవచ్చు, ఇది కిడ్నీలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఈ లక్షణాలు ఏవైనా ఒకటికంటే ఎక్కువ రోజులు కనిపిస్తే, అది కేవలం అలసట అని సరిపెట్టుకోకుండా శరీర అంతర్గత ఆరోగ్యంపై దృష్టి సారించడం


చాలా ముఖ్యం.కిడ్నీలు మన శరీరానికి నిశ్శబ్ద పోరాట యోధులు. అవి 60-70 శాతం దెబ్బతినే వరకు బయటకు తీవ్రమైన సంకేతాలు ఇవ్వవు. అందుకే కళ్ల వాపు వంటి చిన్న చిన్న మార్పులను గమనించినప్పుడే అప్రమత్తం కావాలి. తగినంత నీరు తాగడం ఉప్పు వాడకాన్ని తగ్గించడం మరియు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే మూత్ర మరియు రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా భవిష్యత్తులో వచ్చే పెద్ద ముప్పులను నివారించవచ్చు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నది మరువకండి.

## ఇడ్లీ అతిగా తింటే డేంజరేనట..!



ఇడ్లీ సౌత్ ఇండియాలో ప్రాచుర్యం పొందిన అల్పాహారం. కానీ, వాటిని అతిగా తినడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇడ్లీలలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది, ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రమాదకరం. అతిగా తీసుకోవడం వల్ల బరువు పెరగడం, పులియబెట్టిన పిండి వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా తలెత్తవచ్చు. అందుకే మితంగా తినడం శ్రేయస్కరం. ఇడ్లీ అనేది మనలో చాలా మంది అల్పాహారంగా తినడానికి ఇష్టపడే ఆహారం. ఇది దక్షిణ భారత వంటకం. కానీ, ఇప్పుడు దేశవ్యాప్తంగా చాలా మంది ఎంతో ఇష్టంగా ఇడ్లీలు తింటూ ఉంటారు. ప్రతి ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చాలా మంది ఇడ్లీనే తింటారు. కొంతమంది భారతీయులైతే ప్రతి రోజు ఆహారంగా కూడా వీటిని తీసుకుంటారు.. నిజానికి వీటిని అతిగా తినడం మంచిదేనా? ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారు. అతిగా ఇడ్లీలు తినడం వల్ల అనేక రకాల దుష్ప్రభావాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇడ్లీలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి అతిగా తినడం మంచిది కాదని అంటున్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు ఎట్టి పరిస్థితుల్లో తినకూడదని నిపుణులు చెబుతున్నారు. అతిగా తినడం వల్ల రక్తంలో షుగర్ లెవల్స్ ఊహించని స్థాయిలో పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇడ్లీలలో కేలరీలు తక్కువగా ఉన్నప్పటికీ, అధిక మొత్తంలో కార్బోహైడ్రేట్లు లభిస్తాయి. కాబట్టి అతిగా తింటే బరువు పెరుగుతారు. ఇడ్లీ పిండిని పులియబెట్టి తయారు చేస్తారు. కాబట్టి ఇలా తయారు చేసిన ఇడ్లీని అతిగా తింటే గ్యాస్ట్రిక్ వంటి సమస్యలు వస్తాయి.

## వీరు జామపండు అస్సలు తినకూడదు..!



జామపండు విటమిన్ సి, ఫైబర్, పొటాషియం కలిగి రోగనిరోధక శక్తిని, జీర్ణశక్తిని పెంచుతుంది. అయితే కడుపు ఉబ్బరం, డయాబెటిస్, మూత్రపిండాల సమస్యలు, దంత సమస్యలు, అలర్జీలు, జలుబు ఉన్నవారు దీనిని తినే విషయంలో జాగ్రత్త వహించాలి లేదా నివారించాలి. అధిక మోతాదులో తీసుకోవడం కొన్ని ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేయవచ్చు. జామపండులో విటమిన్ సి, డైటరీ ఫైబర్, పొటాషియం తో పాటు శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. దీనివలన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణశక్తి కూడా మెరుగుపడుతుంది. జామపండులో నారింజ పండు కంటే అధికంగా విటమిన్ సి ఉంటుంది. దీనివలన ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గుతుంది మరియు రోగనిరోధక శక్తి మరింత పెరుగుతుంది. జామపండులో కరిగే ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం తగ్గుతుంది. జామపండులో అనేక పోషకాలు ఉన్నప్పటికీ, కొందరు దీనిని తినకపోవడం లేదా పరిమితంగా తీసుకోవడం మంచిది. దీనివల్ల వారిలో పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కడుపు ఉబ్బరంతో బాధపడేవారు జామకాయలు తినకపోవడం శ్రేయస్కరం. ఇందులో ఫ్రక్టోస్, విటమిన్ సి సమృద్ధిగా ఉండటం వల్ల కడుపు ఉబ్బరం పెరిగే అవకాశం ఉంది. అలాగే, ఇరిటేటబుల్ బౌల్ సిండ్రోమ్ (ఎఖా) సమస్యతో బాధపడేవారు జామకాయలు తినకపోవడం మంచిది. గ్లైసెమిక్ ఇండెక్స్ గ్లూకోజ్ స్థాయిలో తక్కువగా ఉండడం వల్ల డయాబెటిస్ రోగులు జామపండును తినవచ్చని చెబుతుంటారు. అయితే, డయాబెటిస్‌తో బాధపడేవారు ఎక్కువ మోతాదులో జామకాయలు తినకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అతిగా తీసుకోవడం వల్ల సమస్యలు తలెత్తవచ్చు. జామ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన మూత్రపిండాలు శరీరం నుండి అదనపు పొటాషియంను సులభంగా తొలగిస్తాయి. కానీ మూత్రపిండాల పనితీరు బలహీనంగా ఉన్నవారికి లేదా మూత్రపిండాల డయాలసిస్ లో ఉన్నవారికి అదనపు పొటాషియం హానికరం కావచ్చు. అలాంటి సందర్భాల్లో జామ పండ్లను పరిమిత పరిమాణంలో తినడం లేదా వాటిని పూర్తిగా నివారించడం మంచిది. అలాగే, జామకాయ గట్టిగా ఉంటుంది కాబట్టి పచ్చి జామకాయను నమలడం వల్ల దంతాలపై ఒత్తిడి పెరుగుతుంది. బలహీనమైన దంతాలు, దంత సమస్యలు లేదా చిగుళ్ళ సమస్యలు ఉన్నవారు జామకాయను నమిలేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. జామకాయ గింజలు దంతాల్లో కూడా పేరుకుపోయి అసౌకర్యాన్ని కలిగిస్తాయి.

## అందుకే చద్దన్నం తినమనేది..



చద్దన్నం.. రాత్రి మిగిలిన అన్నంతో తయారుచేసే సాంప్రదాయ ఆహారం, ఆధునిక పోకడలతో మరుగున పడింది. అమెరికన్ డైటెటిక్ అసోసియేషన్ సైతం దీని అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను గుర్తించింది. జీర్ణక్రియను మెరుగుపరచడం, ఎముకలను బలోపేతం చేయడం, రక్తపోటును నియంత్రించడం, శరీర ఉష్ణోగ్రతను తగ్గించడం వంటి అనేక లాభాలు దీనిలో ఉన్నాయి. ఆధునిక ప్రపంచం.. ఉరుకులు పరుగుల జీవితంలో చాలా మంది అనారోగ్యకరమైన ఆహారం తీసుకుంటున్నారు.. ఆరోగ్యానికి హాని చేసే వాటిని తినడంతోపాటు.. పేలవమైన జీవనశైలిని అవలంభిస్తున్నారు.. దీంతో తరతరాలుగా పాటిస్తున్న అనేక ఆరోగ్యకరమైన అలవాట్లు ఆధునిక జీవనశైలిలో మరుగున పడుతున్నాయి. అలాంటి వాటిలో ఒకటి రాత్రి మిగిలిపోయిన అన్నంతో తయారుచేసే చద్దన్నం. ఒకప్పుడు సాధారణమైన ఈ ఆహారం పాశ్చాత్య పోకడల కారణంగా ప్రాధాన్యతను కోల్పోయింది. అయితే, దీని విలువను అమెరికన్ డైటెటిక్ అసోసియేషన్ వంటి సంస్థలు సైతం గుర్తించడం విశేషం. రాత్రికి తినడానికి వండుకున్న అన్నం తినగా మిగిలిన దానిలో మజ్జిగ లేదా పెరుగు కలిపి నానబెడతారు. కొన్ని సార్లు పాలు పోసి డైరెక్టుగా తోడు వేస్తారు.. దీనిని ఉదయాన్నే తినేందుకు ఉపయోగిస్తారు. ఈ విధంగా రాత్రంతా నానబెట్టిన అన్నంను చద్దన్నం అంటారు. వండుకున్న అన్నం తినగా మిగిలిపోయిన అన్నం అయిదారు గంటల్లో చల్లబడి బ్యాక్టీరియా చేరి చద్ది అన్నం అవుతుందని.. దీనిలో ఎన్నో పోషకాలు దాగున్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చద్దన్నం కేవలం ఒక సాధారణ ఆహారం కాదు.. పోషకాల గని. రాత్రి వండిన అన్నాన్ని నీటిలో నానబెట్టి ఉదయం మజ్జిగ లేదా పెరుగుతో కలిపి తినే ఈ పద్ధతి అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఉదయం అల్పాహారానికి బదులుగా చద్దన్నం తీసుకోవడం వల్ల పొట్ట తేలికగా ఉండడమే కాదు.. రోజంతా శక్తివంతంగా పనిచేయగలుగుతారు. దీనికి కారణం చద్దన్నంలో ఉండే లాక్టిక్ యాసిడ్, ఐరన్, పొటాషియం వంటి విలువైన పోషకాలు. సాధారణంగా వేడి అన్నంలో కన్నా చద్దన్నంలో 60% క్యాలరీలు తక్కువగా ఉంటాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. అందువల్ల, బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక గొప్ప ఎంపిక. అంతేకాకుండా, ఈ ఫర్మెంటెడ్ రైస్‌లో బి6, బి12 విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవి శరీరానికి అత్యవసరం. చద్దన్నంలో వృద్ధి చెందే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా జీర్ణక్రియను మెరుగుపరచి, పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలను నివారించడంలో ఇది సహాయపడుతుంది. చద్దన్నం తినడం వల్ల ఎముకలకు సంబంధించిన అనారోగ్య సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయి. ఇది శరీరంలో వేడిని తగ్గించే గుణాన్ని కలిగి ఉంటుంది. ముఖ్యంగా వేసవి కాలంలో ఇది ఎంతగానో ఉపకరిస్తుంది. ప్రతిరోజు చద్దన్నం తినేవారిలో రక్తపోటు అదుపులో ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

### ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల విజేత రైబాకినా..

## ఫైనల్లో సబలెంకాపై థ్రిల్లింగ్ విక్టరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ మహిళల విజేతగా ఎలెనా రైబాకినా నిలిచింది. మెల్‌బోర్న్‌లో శనివారం (జనవరి 31) జరిగిన మ్యాచ్ లో ప్రపంచ నంబర్ వన్ అరీనా సబలెంకాను ఓడించి టైటిల్ తమ ఖాతాలో వేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో రైబాకినా 6-4, 4-6, 6-4 తేడాతో ఓడించి తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మూడేళ్ల క్రితం 2023లో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో సబలెంకా చేతిలో ఓడిపోయిన రైబాకినా తాజా విజయంతో ప్రతీకారం తీర్చుకుంది. రైబాకినాకు ఇదే తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కావడం విశేషం. 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో రైబాకిన తొలి సెట్ గెలిచి ఆ తర్వాత వరుసగా రెండు సెట్లలో సబలెంకా చేతిలో ఓడిపోయింది. 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో కూడా అదే సీన్ రిపీట్ అయ్యేలా కనిపించింది. తొలి సెట్ ను రైబాకిన చాలా కూల్ గా 6-4తో గెలుచుకుంది. అయితే రెండో సెట్ లో మాత్రం సబలెంకా ధాటికి వెనకబడి పోయింది. ఈ నెంబర్ వన్ సీడ్ హార్డ్ హిట్టింగ్ దెబ్బకు రైబాకిన వద్ద సమాధానం లేకుండా పోయింది. కీలకమైన సమయంలో సర్వీస్ కోల్పోయి సెట్ ను 3-6 తేడాతో చేజార్చుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్ ప్రారంభంలో అంతా సబలెంకా హవా కొనసాగింది. తన సర్వీస్ ను నిలుపుకోవడంతో పాటు రెండో గేమ్ లో రైబాకిన సర్వీస్ ను బ్రేక్ చేసి 2-0 ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత తన సర్వీస్ నిలుపుకొని 3-0 ఆధిక్యంలోకి వెళ్ళింది. ఈ సమయంలో సబలెంకా విజయం ఖాయమని చాలామంది భావించారు. అయితే ఇక్కడ నుంచి రైబాకిన షో స్టార్ట్ అయింది. తన సర్వీస్ ను నిలుపుకొని తొలి గేమ్ గెలిచిన ఈ కజకిస్తాన్ ప్లేయర్ ఆ తర్వాత టాప్ లెవల్ ఆట తీరుతో చెలరేగిపోయింది. వరుసగా ఐదు గేమ్ లు గెలిచి 5-3 ఆధిక్యంలోకి వెళ్ళింది. తన సర్వీస్ ను జాగ్రత్తగా నిలుపుకొని మ్యాచ్ తో పాటు టైటిల్ కూడా గెలుచుకుంది.


# వరల్డ్ కప్ సెమీస్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఆఫ్ఘనిస్తాన్.. టీమిండియా పరిస్థితి ఏంటి..?




**హైదరాబాద్ పెన్ పవర్:** అండర్-19 వరల్డ్ కప్ లో భాగాంగా ఇప్పటికే మూడు జట్లు సెమీ ఫైనల్ కు అర్హత సాధించాయి. గ్రూప్ లో ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్ తో పాటు గ్రూప్-బి లో ఇంగ్లాండ్ ఇప్పటికే సెమీస్ కు చేరుకున్నాయి. గ్రూప్ ఏ లో ఆస్ట్రేలియా ఆడిన నాలుగు మ్యాచ్ ల్లో విజయం సాధించింది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ ఆడిన నాలుగు మ్యాచ్ ల్లో మూడు విజయాలతో సెమీస్ బెర్త్ కన్ఫర్మ్ చేసుకుంది. మరోవైపు గ్రూప్ బి లో ఇంగ్లాండ్ ఆడిన నాలుగు మ్యాచ్ ల్లో గెలిచి సెమీస్ కు చేరుకుంది. గ్రూప్ బి లో ఇండియా లేదాపాకిస్థాన్ జట్లలో ఒక జట్టే సెమీస్ కు చేరే అవకాశం ఉంది. అండర్-19 వరల్డ్ కప్ సూపర్ సిక్స్ లో భాగంగా ఇండియా ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్ ల్లో విజయం సాధించింది. మరోవైపు పాకిస్థాన్ ఆడిన మూడు మ్యాచ్ ల్లో రెండు గెలిచింది. రెండు జట్లు ఆదివారం (ఫిబ్రవరి 1) బులవాయోలోని క్వీన్ స్పోర్ట్స్ క్లబ్‌లో మ్యాచ్ ఆడాల్సి ఉంది. సెమీస్ కు చేరాలంటే ఈ రెండు జట్లకు చివరి మ్యాచ్ చాలా కీలకం. ఇండియా గెలిస్తే నేరుగా సెమీ-ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ టీమిండియా ఓడిపోయినా సెమీస్ కు వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే భారీగా ఓడిపోకుండా చూసుకోవాలి. ఓవరాల్ గా ఈ మ్యాచ్ లో ఇండియాకు ఎక్కువగా అవకాశాలు ఉన్నాయి. సెమీ ఫైనల్లో పాకిస్థాన్ ను ఇంటికి పంపే సువర్ణావకాశం టీమిండియాకు ముందు ఉంది. ఇటీవలే జరిగిన ఆసియా కప్ ఫైనల్లో ఇండియాను పాకిస్థాన్ ఓడించింది. ఆ పరాజయానికి ప్రతీకారం తీసుకునే అవకాశం టీమిండియాకు ఇప్పుడు వచ్చింది.ఇప్పటివరకు టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా వస్తున్న భారత జట్టు స్థాయికి తగ్గట్టుగా ఆడితే పాకిస్థాన్ పై గెలవడం అంత కష్టం కాదు. వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, ఆయుష్ మాత్రే, అభిజ్ఞాన్ కుందు చెలరేగాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. పాకిస్థాన్ లాంటి జట్టును ఇంటికి పంపించి సెమీస్ కు చేరుకుంటే అంతకంటే కిక్ ఏం ఉంటుంది అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# టీ20 ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియాకు బిగ్ షాక్... స్టార్ పేసర్ ఔట్!

- గాయం కారణంగా టీ20 ప్రపంచకప్‌కు దూరమైన ప్యాట్ కమిన్స్
- తుది జట్టులో కమిన్స్ స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌కు చోటు
- గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వచ్చిన జోష్ హేజిల్‌వుడ్
- మిచెల్ మార్ష్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్న ఆస్ట్రేలియా




**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు స్టార్ పేస్ బౌలర్, కీలక ఆటగాడు ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా మెగా టోర్నీకి పూర్తిగా దూరమయ్యాడు. ఈ మేరకు ప్రావిజనల్ జట్టులో రెండు మార్పులు చేసి, 15 మందితో కూడిన తుది జట్టును క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఇవాళ ప్రకటించింది. గతేడాది జూలైలో వెన్ను గాయానికి గురైన కమిన్స్, ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడిని టోర్నీ నుంచి తప్పించాలని సీఏ నిర్ణయించింది. కమిన్స్ స్థానంలో మరో పేసర్ బెన్ డ్వార్షుయిస్‌ను జట్టులోకి తీసుకున్నారు. అదే సమయంలో టాప్ ఆర్డర్ బ్యాటర్ మ్యాథ్యూ షార్ట్‌ను కూడా తుది జట్టు నుంచి తొలగించారు.అయితే, గాయాల కారణంగా యాషెస్ సిరీస్‌కు దూరమైన మరో ప్రధాన పేసర్ జోష్ హాజిల్‌వుడ్ పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి తిరిగి రావడం ఆసీస్‌కు ఊరటనిచ్చే అంశం. పాకిస్థాన్ పర్యటనకు దూరమైన టిమ్ డేవిడ్ కూడా తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ జట్టుకు మిచెల్ మార్ష్ సారథ్యం వహించనున్నాడు. హేజిల్‌వుడ్, నాథన్ ఎల్లిస్, జేవియర్ బార్ట్‌లెట్‌లతో పేస్ విభాగం బలంగానే ఉంది. శ్రీలంక, భారత్‌లో జరగనున్న ఈ టోర్నీలో స్పిన్‌కు ప్రాధాన్యం ఇస్తూ ఆడమ్ జంపా, మాథ్యూ కునెమన్‌లను జట్టులో చేర్చారు. ఆస్ట్రేలియా గ్రూప్-బీలో ఉండగా, ఫిబ్రవరి 11న కొలంబోలో ఐర్లాండ్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది.



నైరా బెనర్జీ యొక్క అద్భుతమైన రెడ్ చీర త్రోబ్యాక్

# #బార్డర్ 2.. 'దురంధర్'ని టచ్ చేయడం అసాధ్యం



బాలీవుడ్ మీడియా ఒక్కోసారి ఊదరగొట్టేస్తుంటుంది. ముఖ్యంగా ఉత్తరాది బాక్సాఫీస్ వద్ద సౌత్ సినిమా డామినేషన్ ని హిందీ మీడియా తట్టుకోలేకపోతోంది. పర్యవసానంగా బాలీవుడ్ రైజింగ్ ని చూడాలని కసిగా వేచి చూస్తోంది. కరోనా క్రైసిస్ తర్వాత ఉత్తరాదిన దక్షిణాది సినిమా హవా కొనసాగడం... హిందీ పరిశ్రమ డిజాస్టర్లతో నీరసపడిపోవడంతో ఇంతకాలం వేచి చూసింది. షారూఖ్ పఠాన్- జవాన్ కొంతవరకూ ఊరట. స్త్రీ 2, చావా లాంటి సినిమాలు ఆదుకున్నాయి. ఇప్పుడు రణ్ వీర్ సింగ్ -దురంధర్- హిందీ పరిశ్రమ గౌరవాన్ని కాపాడింది. -దురంధర్- చిత్రం 50రోజుల్లో 800కోట్ల నెట్... వసూళ్లను సాధించడం నిజంగా ఒక రికార్డ్. అయితే దురంధర్ వసూళ్ల విషయంలో కొన్ని హిందీ మీడియాలు చాలా హైప్ క్రేయేట్ చేయడానికి ప్రయత్నించాయన్నది వాస్తవం. ఒరిజినల్ లెక్కలకు మీడియా చూపించిన లెక్కలకు కచ్చితంగా తేడా ఉంది. అయినా దురంధర్ క్లీన్ బ్లాక్ బస్టర్ గా రికార్డులకెక్కిందనడంలో సందేహం లేదు.అయితే ఇప్పుడు సన్నీడియోల్ లాంటి సీనియర్ హీరో నటించిన బార్డర్ 2 చిత్రం విషయంలోను బాలీవుడ్ మీడియా అత్యుత్సాహం చూస్తుంటే ఇది చాలా కామెడీగా అనిపిస్తోంది. బార్డర్ 2 చిత్రం 6 రోజుల్లో 213 కోట్ల నెట్ వసూలు చేసింది. అయితే బార్డర్ 2 దురంధర్ రికార్డులను కొట్టేస్తుంది! అంటూ ఒక సెక్షన్ మీడియా ప్రచారం చేస్తోంది. నిజానికి బార్డర్ 2 కి అంత సీన్ లేదని కొందరు క్రిటిక్స్ విశ్లేషించారు.బార్డర్ 2 చిత్రం 50 రోజులు ఆడినా 800కోట్లు తేవడం కష్టం.. ఇప్పటికి బాగా ఆడుతున్నా కానీ, దురంధర్ రన్ వేరే.. దురంధర్ చిత్రానికి సంక్రాంతి సెలవులు బాగా కలిసొచ్చాయి... సౌత్ లో కూడా బాగా ఆడింది.. ఆ పరిస్థితి సన్నీడియోల్ బార్డర్2 చిత్రానికి లేదు. దురంధర్ ఒరిజినల్ కథతో.. బయోపిక్ కేటగిరీలో వచ్చిన సినిమా కాబట్టి అన్ స్టాపబుల్ గా దూసుకెళ్లింది.. కానీ బార్డర్ 2 సీక్వెల్ సినిమా... ఇప్పటికే చూసేసిన ఎమోషన్స్ రొటీన్ వార్ డ్రామా కాబట్టి దీనికి అంత సీన్ లేదని విశ్లేషిస్తున్నారు.

నిజానికి బార్డర్ 2 చిత్రానికి పండగ సెలవులు ఏవీ కలిసి రాలేదు. కేవలం వీకెండ్స్ పై మాత్రమే ఆధారపడి ఫుల్ రన్ ని సాగించాల్సి ఉంటుంది. అందువల్ల దురంధర్ రేంజులో వసూలు చేయడం సాధ్యపడదు. అలాగే బార్డర్ 2 కి రెండో వారంలో అసలైన టెస్ట్ మొదలవుతుంది. ఇంకా నాలుగైదు వారాలు భారీగా వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ దేశభక్తి సినిమా దురంధర్ స్థాయికి వెళుతుందని ట్రేడ్ భావించడం లేదు. అయితే బార్డర్ 2 సన్నీడియోల్ కెరీర్ బెస్ట్ హిట్ చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఈ చిత్రంలో నటించిన వరుణ్ ధావన్, అహాన్ శెట్టి లాంటి యువహీరోలకు ఒక మంచి హిట్టు దక్కినట్టయిం ది. ఇకపై యంగ్ హీరో లు సోలో హిట్లతో నిరూపించాల్సి ఉంటుంది.



షామా సికిందర్ అద్భుతంగా కనిపిస్తున్నాడు!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965